
పొదిలి ప్రాంతంలో వర్షాలకు దెబ్బతిన్న పొగాకు తోటల్లో విడుపులు వేస్తున్న కూలీలు

- వెనక్కితగ్గమంటున్న రైతులు
- దక్షిణాదిలో ఇప్పటికే 40,500 హెక్టార్లలో సాగు
- ఇంకా అంతకుపైనే అవకాశం
- బోర్డు అధికారుల సూచనలు బేఖాతర్
- ప్రస్తుత మార్కెట్లో ధరలు తగ్గినా సాగువైపే మొగ్గు
- శనగ ఆశాజనకంగా లేకపోవడం, వాతావరణ సానుకూలతలే కారణం
- ప్రస్తుతం అన్నిప్రాంతాల్లో ముమ్మరంగా నాట్లు, విడుపులు

తగ్గేదే లే..!

భారీగా పొగాకు సాగు

ఈ ఏడాది కూడా పొగాకు పంట భారీగా సాగయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. నారు ధర కొండెక్కి కూర్చున్నా, ట్యాంకర్లతో నీటిని అధిక వ్యయంతో తరలించాల్సి వచ్చినా రైతులు లెక్కచేయడం లేదు. ఒకవైపు తుఫాన్‌తో దెబ్బతిన్న తోటలలో విడుపులు, మరోవైపు కొత్త విస్తీర్ణంలో ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. దక్షిణాదిలోని 11 వేలం కేంద్రాల పరిధిలో ఇప్పటికే 41 వేల హెక్టార్లకుపైగా విస్తీర్ణంలో పొగాకు సాగైంది. ప్రస్తుతం స్పీడ్ చూస్తుంటే ఇంకా అంత విస్తీర్ణంలో సాగయ్యే పరిస్థితులు ఉన్నాయి. పంట ఉత్పత్తి పొగాకు బోర్డు అనుమతి ఇచ్చిన దాని కన్నా భారీగా పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. నియంత్రణ కోసం అధికారులు ఈసారి నారుమడులు పెట్టే స్థాయి నుంచే ఒత్తిడి పెంచారు. గత సీజన్ మార్కెట్ ఒడిదొడుకులతో అత్యధిక శాతం మంది రైతులకు పెట్టుబడులు కూడా రాలేదు. అయినప్పటికీ ఈసారి విస్తారంగా సాగు చేస్తున్నారు. వ్యయప్రయాసలను లెక్కచేయకుండా మొక్కలు నాటుతున్నారు.



ఒంగోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దక్షిణాదిలో ఈసారీ పొగాకు సాగు పెరుగుతోంది. గడిచిన సీజన్ మార్కెట్ ఒడిదొడుకుల్లో నడిచినా రైతులు మాత్రం వెనక్కి తగ్గడం లేదు. మూడేళ్ల క్రితం పంట ఉత్పత్తి కొంత అదుపులో ఉండగా 2022-23 నుంచి 2024-25 వరకు మూడేళ్లలో భారీగా పెరిగింది. ప్రత్యేకించి 2024-25 సీజన్‌లో గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో సాగైంది. దక్షిణాది ప్రాంతంగా పిలిచే నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో 11 పొగాకు వేలం కేంద్రాలు ఉన్నాయి. 2022-23 సీజన్‌కు ఈ ప్రాంతంలో సుమారు 87.97 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి పొగాకు బోర్డు అనుమతివ్వగా 123.11 మిలియన్ కిలోల విక్రయాలు జరిగాయి. సగటున కిలోకు రూ.216.28 ధర లభించింది. అదే 2023-24 సీజన్‌కు 88.68 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతిస్తే ఇంచుమించు 154.11 మిలియన్ కిలోలు పండింది. అయినా మార్కెట్ బాగా ఉండటంతో మంచి ధరలు లభించి సగటున కిలోకు రూ.265 దక్కింది. ముందు సీజన్‌లో మంచి రాబడులు రావడంతోపాటు 2024-25కు వాతావరణం

మిగతా 6వ పేజీలో

భారీగానే పంట సాగు

గత సీజన్ ప్రతికూల మార్కెట్ పరిస్థితులతో నష్టాలు వచ్చినా, బోర్డు అధికా రులు హెచ్చరిస్తున్నా, పెట్టుబడులు భారీగా అయ్యే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తున్నా చాలాగ్రామాల్లో రైతులు పంట సాగును భారీగానే చేపడుతున్నారు. రెండు నెలల క్రితం వరకు కాస్తంత వెనుకడుగులోనే ఉన్నట్లు కనిపించిన రైతులు తర్వాత మళ్లీ గత రెండేళ్ల వలే సాగుకు ఉపక్రమించారు. ప్రత్యామ్నాయంగా సాగు చేసే శనగ పంట పరిస్థితి బాగా లేకపోవడం, వాతావరణం పొగాకు సాగుకు అనుకూలంగా ఉండటం, అక్టోబరులో ఒక్కసారిగా పొగాకు గరిష్ఠ ధరలు కిలో రూ.350 దాటడం వంటివి తిరిగి రైతులను సాగుకు ప్రేరేపిస్తున్నాయి. ఇప్పటికే దక్షిణాది తేలిక నేలల రీజియన్‌లో 27,139 హెక్టార్లు, నల్లరేగడి రీజియన్‌లో 13,367 హెక్టార్లు కలిపి 40,507 హెక్టార్లలో పొగాకు నాట్లు వేశారు.


కొణిజేడులో విద్యార్థిని ప్రోగ్రెస్‌ను తల్లికి వివరిస్తున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ రాజాబాబు

సందడి సందడిగా..

- జిల్లా అంతటా విద్యాసంస్థల్లో పీటీఎంలు
- 2,409 పాఠశాలల్లో నిర్వహణ
- కొణిజేడులో పాల్గొన్న మంత్రి స్వామి, కలెక్టర్
- పలుచోట్ల ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల హాజరు

ఒంగోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా శుక్రవారం పాఠశాలల్లో తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాలు సందడిసందడిగా సాగాయి. వివిధ స్థాయిల్లోని మొత్తం 2,409 విద్యాసంస్థల్లో వీటిని ఏర్పాటు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2.45 గంటల వరకు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఆదేశించగా తదనుగుణంగా ఆయా విద్యాసంస్థల్లో ప్రధానోపాధ్యాయులు, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమ నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా రూ.53.79లక్షలు విడుదల చేసింది. ఆర్థిక భారం లేకపోవడంతో ఇటు ఉపాధ్యాయులు, అటు మేనేజ్‌మెంట్ కమిటీల సభ్యులు ఊపిరిపీల్చుకున్నారు. కార్యక్రమం జరిగిన అత్యధిక విద్యాసంస్థల్లో ప్రత్యేక అలంకరణలు చేశారు. కీలక

మిగతా 6వ పేజీలో


మార్కాపురం జడ్పీహెచ్‌లో తల్లులకు పాదాభివందనం చేస్తున్న విద్యార్థులు


రోగులతో కిటకిటలాడుతున్న ఒంగోలు జీజీహెచ్‌లోని జనరల్ వార్డు

వణికిస్తున్న వాతావరణం

వెంటాడుతున్న వ్యాధుల భయం..!

పెరుగుతున్న శ్వాస సంబంధ సమస్యలు

- ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు కిటకిట
- పలు ఆరోగ్య సమస్యలతో ఇంటికో బాధితుడు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాను వ్యాధులు చుట్టుముట్టాయి. ఇటీవల పెరిగిన చలితీవ్రత, వరుస వానలతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. శ్వాసకోశ సంబంధ సమస్యలు పెరుగుతున్నాయి. ఇంటికో బాధితుడు జలుబు, తగ్గని దగ్గు సమస్యలతో బాధపడుతున్నారు. మరికొందరు జ్వరాలతో వణికిపోతున్నారు. చిన్నపిల్లలు, పెద్దవారిలోనూ ప్రధానంగా జలుబు, దగ్గు, గొంతునొప్పి సమస్యలు అధికమయ్యాయి. వైరల్ జ్వరాలు నమోదవుతున్నాయి. 40 ఏళ్లు పైబడిన వారు, వృద్ధుల్లో కీళ్లనొప్పులు, అలాగే ఆస్తమా రోగులు శ్వాస తీసుకోవడం చాలా ఇబ్బందికరంగా మారింది.

నీటి కాలుష్యంతో ముప్పు

నీటి కాలుష్యం కారణంగా డయేరియా, పచ్చకామెర్లు, వైరల్ జ్వరాలు, చికెన్‌ఫాక్స్, పిల్లల్లో మీజిల్స్, నీళ్ల విరేచనాలు, గవద బిళ్లలు, పలు రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి, ప్రస్తుతం చెరువుల్లో కొత్తగా చేరిన నీటిని అధికార యంత్రాంగం కొళాయిల ద్వారా గృహాలకు విడుదల చేయడంతో రోగాలు మరింత అధికంకానున్నాయి. అయితే కొళాయిల ద్వారా ఇచ్చే నీటిని ఏరోజుకారోజు నీటి పరీక్షలు నిర్వహించి, శుద్ధి చేసిన అనంతరం అందించాల్సిన యంత్రాంగం కొన్ని ప్రాంతాలలో అలాగే వదిలేయడంతో ప్రజలు రోగాల బారినపడుతున్నారు.

ఇరిగేషన్‌లో వార్

- అధికారుల మధ్య విభేదాలు
- సాగునీటి పంపిణీ అస్తవ్యస్తం
- నీటి కొలతల్లో సరికాని తేడాలు
- డీసీ, నీటిసంఘాల అధ్యక్షుల ఆగ్రహం
- ఆయకట్టు రైతుల అవస్థలు



దర్శి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇరిగేషన్ శాఖ అధికారుల మధ్య విభేదాలు నెలకొన్నాయి. సాగునీటి పంపిణీలో ఎవరికి వారు పొంతన లేకుండా వ్యవహరిస్తున్నారు. చేసిన పనులకు బిల్లులు చేయకుండా నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్నారు. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ తమను ఇబ్బందిపెడుతున్నారని డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్‌తోపాటు నీటి సంఘాల అధ్యక్షులు ఆరోపిస్తున్నారు. దర్శి ఎన్ఎస్పీ సబ్ డివిజన్ పరిధిలో నెలకొన్న ఈ పరిణామాలతో ఆయకట్టు రైతులు అవస్థలు పడుతున్నారు. జిల్లాకు వాటా మేరకు రావాల్సిన నీరు విడుదల కావడం లేదు. తక్కువగా విడుదల అవుతున్నందున చివరి ఆయకట్టు భూములకు అందడంలేదు. కొద్దిరోజుల క్రితం పమిడిపాడు బ్రాంచ్ కాలువకు నీటి పరిమాణం పెంచాలని డీసీ అధ్యక్షుడితోపాటు పలువురు నీటి సంఘాల అధ్యక్షులు ఇరిగేషన్ అధికారులను కలిసి డిమాండ్ చేశారు. ఎగువన వస్తున్న నీటి పరిమాణం ప్రకారం అందరికీ సమన్యాయం చేస్తున్నామని ఇరిగేషన్ అధికారులు చెప్పగా పీబీసీ పరిధిలోని చివరి భూములకు నీరందక రైతులు ఇబ్బందిపడుతున్నారని, నీటి పరిమాణం

మిగతా 6వ పేజీలో

పాతాళానికి పడిపోయిన నిమ్మ ధర

6


- గతేడాది ఇదే సీజన్‌లో కేజీ రూ.40
- ప్రస్తుతం కేజీ రూ.8 మాత్రమే
- నష్టాల బాటలో రైతులు
- అడిగేవారు లేక పొలంలోనే వదిలేస్తున్న వైనం
- ఎకరాకు రూ.50వేలకు పైగా నష్టం

ఆలయానికి వెళుతూ..

- పేట బైపాస్‌లో ఘోర ప్రమాదం
- ఐదుగురు విద్యార్థుల దుర్మరణం
- మృతుల్లో విఠలాపురం వాసి
- గ్రామంలో విషాదచాయలు
- నివాళులర్పించిన టీడీపీ నాయకులు

తాళ్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అయ్యప్పదీక్ష చేపట్టి రాత్రికి ఆలయంలో నిద్ర చేయడానికి వెళుతుండగా రోడ్డుప్రమాదం చోటుచేసుకుని విఠలాపురం వాసి దుర్మరణం చెందాడు. ఈ ఘటన చిలకలూరిపేట బైపాస్‌లో గురువారం రాత్రి చోటుచేసుకుంది. ప్రమాదంలో ఐదుగురు మృత్యువాత పడగా వారిలో మండలంలోని విఠలాపురం గ్రామానికి చెందిన టీడీపీ నేత మేడగం సుబ్బారెడ్డి రెండో కుమారుడు మేడగం రామిరెడ్డి(20) కూడా ఉన్నారు. దీంతో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం శుక్రవారం ఉదయం 11 గంటలకు గ్రామానికి తీసుకువచ్చారు. వివరాల్లోకి వెళితే.. విఠలాపురం గ్రామానికి చెందిన మేడగం సుబ్బారెడ్డి ఒంగోలు ఎంపీ మాగుంటకు ముఖ్య అనుచరునిగా

మిగతా 6వ పేజీలో


రామిరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న లలిత్ సాగర్, టీడీపీ నేతలు (ఇన్‌సెట్‌లో) రామిరెడ్డి (ఫైల్)

100శాతం ఉత్తీర్ణత లక్ష్యం

- పది పరీక్షలకు వంద రోజుల కార్యాచరణ ప్రణాళిక
- నేటి నుంచి అమలు



ఒంగోలు విద్య, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా వారికి తర్ఫీదును ఇచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో పదిలో విద్యార్థుల ఉత్తీర్ణత పెంచేందుకు ఏజిల్లాకు ఆ జిల్లా ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించి అమలుచేసేవారు. అయితే ప్రస్తుత ప్రజాప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఒకే కార్యాచరణ ప్రణాళిక అమలుకు సిద్ధమైంది. ఎస్సీఈఆర్టీ వందరోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించింది. విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణలో టీచర్లను చేయిపట్టి ఎస్సీఈఆర్టీ ముందుకు నడిపిస్తుంది. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యాచరణ ప్రణాళికను కామన్‌గా అమలు చేస్తారు. జిల్లాలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో 29,117 మంది విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాయనున్నారు. వీరిలో 17,380 మంది ప్రభుత్వ పాఠశాలలు, 11,737 మంది ప్రైవేటు పాఠశాలల వారు ఉన్నారు. ప్రభుత్వ, జడ్పీ హైస్కూళ్లు, కేజీబీవీలు, ఏపీ మోడల్ స్కూళ్లు, ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు, ప్రభుత్వ సంక్షేమ గురుకులాల్లో చదువుతున్న విద్యార్థులందరికీ ఈ వంద రోజుల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తారు. ఎఫ్ఏ-1, ఎఫ్ఏ-2, ఎస్ఏ-1 పరీక్షల్లో మార్కుల ఆధారంగా విద్యార్థులను ఏబీసీడీలుగా విభజించి చదువులో వెనుకబడిన వారిపై ఎక్కువ ఫోకస్ పెట్టడమే కాకుండా అందరూ ఉత్తీర్ణులయ్యేలా ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఈ వందరోజుల ప్రణాళిక జిల్లాలో శనివారం నుంచి ప్రారంభం కానుంది. అందుకోసం విద్యాశాఖ అధికారులు తగిన చర్యలు తీసుకున్నారు.



పోలీసులకు దీటుగా విధులు

- ఉద్యోగ విరమణ చేసినా పింఛన్ రాదు
- గౌరవ వేతనం కాదు బేసిక్ ఇవ్వాలని డిమాండ్
- నేడు హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం

7

'కొనకనమిట్ల'లో స్వల్ప భూకంపం

- మండలంలో దాదాపు 15 గ్రామాల్లో ప్రకంపనలు
- భయంతో బయటకు పరుగులు తీసిన ప్రజలు

కొనకనమిట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కొనకనమిట్ల మండలంలో శుక్రవారం తెల్లవారుజామున సుమారు 3.30 గంటల సమయంలో స్వల్పంగా భూమి కంపించింది. చిన్నారికట్ల, పెద్దారికట్ల, ఈరసలగుండం, పాతపాడు, బీకే పాడు, గొట్లగట్టు, కొనకనమిట్ల, సిద్ధవరం, నాగరాజుకుంటతోపాటు మరో ఐదారు గ్రామాల్లో 3 నుంచి 4 సెకన్లపాటు భూమి కంపించింది వేకువజామున ఒక్కసారిగా పెద్దశబ్దం రావడంతో ఏం జరిగిందోనని ప్రజలు మేల్కొని ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. ఈ భూకంపం కారణంగా ఎక్కడా ఎలాంటి నష్టం వాటిల్లకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

- జీతాల కోసం ఉద్యోగుల ఎదురుచూపులు
- 50శాతం మందికే అందిన వైనం
- ఈఎంఐలు ఎలా చెల్లించాలని ఆవేదన

7

వేతన యాతన!

తగ్గేదేలే..!

(5వ పేజీ తరువాయి)

అనుకూలంగా ఉండటంతో భారీగా సాగు చేశారు. బోర్డు ఆ సీజన్‌కు 104.60 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతిస్తే దాదాపు 88వేల హెక్టార్లలో పంటను సాగు చేసి ఇంచుమించు 157 మిలియన్ కిలోలు పండించారు. పొగాకు బోర్డు లెక్కల ప్రకారం పాతిక వేల హెక్టార్లలో అదనంగా సాగు చేసి సుమారు 53 మిలియన్ కిలోలు అధికంగా ఉత్పత్తి చేశారు. మొత్తం 11 వేలం కేంద్రాల్లో ఒక్క కొండపి మినహా మిగిలిన పది కేంద్రాల్లో వేలం పూర్తయింది. అక్కడ మరో నాలుగు రోజుల్లో ముగియనుండగా దాదాపు 156.30 మిలియన్ కిలోలు విక్రయాలు జరగ్గా సగటున కిలోకు రూ.223.14 ధర లభించింది. అంటే అధికంగా పంట సాగు, ఉత్పత్తి పెరిగిన ప్రభావం ధరలపై పడి 2023-24 సీజన్ కన్నా 2024-25 సీజన్ ధరలు గణనీయంగా తగ్గాయి. అలా తగ్గడం వల్ల దక్షిణాది రైతులు గతం కన్నా దాదాపు రూ.500 కోట్ల మేర రాబడిని కోల్పోయి ఆమేర నష్టపోయారు. అంతేకాక గతంలో ఎన్నడూలేని విధంగా వేలం ప్రక్రియ దాదాపు నెలల పాటు సుదీర్ఘంగా సాగింది. వేలం ప్రక్రియ సాగే క్రమంలోనూ మార్కెట్ అనేక ఒడిదొడుకులను ఎదుర్కొంది.

నియంత్రణ చర్యలు చేపట్టినా సరే..

రాబోయే సీజన్ (2025-26)లో పరిస్థితి మరింత దారుణంగా ఉండే సంకేతాలు ప్రస్తుత కొనుగోళ్ల సీజన్‌లోనే కనిపించాయి. ఈ విషయాన్ని గుర్తించిన పొగాకు బోర్డు 2025-26 సీజన్‌కు సాగు నియంత్రణపై తొలి నుంచే దృష్టి సారించింది. తొలుత పంట ఉత్పత్తి లక్ష్యాన్ని తగ్గించింది. దక్షిణాదిలో 2024-25 సీజన్‌కు 104 మిలియన్ కిలోల ఉత్పత్తికి అనుమతి ఇచ్చిన పొగాకు బోర్డు 2024-26 సీజన్‌కు 90 మిలియన్ కిలోలకు తగ్గించింది. గతానికి భిన్నంగా ఈసారి నారుమడులు పెట్టే సమయం నుంచే నియంత్రణ చర్యలు చేపట్టింది. పొగాకు బోర్డు నుంచి అనుమతి పొంది సీటీఆర్‌ఐ నుంచి విత్తనాలు పొందిన వారే నారుమడులు పెట్టాలని షరతు విధించింది. అంతేకాకుండా అధికారులు తనిఖీలు చేసి నియంత్రించారు. అలాగే అధిక పంట సాగు వల్ల జరిగే అనర్థాలు, 2024-25 సీజన్ మార్కెట్ సంక్షోభానికి కారణాలు, రానున్న సీజన్‌లో ప్రతికూల పరిస్థితులు, అంతర్జాతీయంగా పెరిగిన పంట ఉత్పత్తిపై విస్తృతంగా రైతులలో ప్రచారం చేపట్టారు. ఇందుకోసం వేలం కేంద్రాల స్థాయిలో అలాగే అధికంగా పంట పండే గ్రామాల్లోనూ అవగాహన సదస్సులు నిర్వహించారు. బ్యారన్ రిజిస్ట్రేషన్ల విధానాన్ని కొంత కఠినతరం చేశారు. అయినా ప్రస్తుతం దక్షిణాదిలో పొగాకు పంట సాగు భారీగానే కనిపిస్తోంది.

జోరుగా నాట్లు

గత అక్టోబరులో సంభవించిన మొంథా తుఫాన్ ఒకరకంగా పంట సాగు సీజన్‌ను తలకిందులు చేసింది. అప్పటికే వేసిన పంట దెబ్బతినగా, తదుపరి సాగు ఆలస్యమైంది. అయినా 40వేల హెక్టార్లకుపైగా సాగు కాగా తుఫాన్ తీవ్రత, తాజా వర్షాల వాతావరణం నుంచి తేరుకొని ప్రస్తుతం తిరిగి రైతులు నాట్లను జోరుగా వేస్తున్నారు. పొగాకు అధికంగా పండే కొండపి, కందుకూరు, ఎస్ఎన్‌పాడు, మార్కాపురం, కనిగిరి, ఉదయగిరి నియోజకవర్గాల్లో ఏ గ్రామంలో చూసినా పొగనాట్లు జోరుగా సాగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితిని చూస్తే ఈ సీజన్‌లో కూడా 80 నుంచి 90వేల హెక్టార్లలో పంట సాగు జరిగి ఆమేర ఉత్పత్తి పెరిగే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ పరిస్థితిపై పొగాకు బోర్డు ఆర్ఎం రామారావు స్పందిస్తూ అధిక సాగు అనర్థం అన్నారు. బోర్డు అధికారుల సూచనలను రైతులు పాటించాలన్నారు. ధర లేక, అమ్ముడుపోక 2024-25లో తీవ్ర ఇక్కట్లు పడాల్సి వచ్చిన వాస్తవ పరిస్థితిని గుర్తించి సాగు తగ్గించాలని రైతులకు సూచించారు. లేకపోతే నష్టపోతారన్నారు.

సందడి సందడిగా..

(5వ పేజీ తరువాయి)

ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొంటున్న చోట మరింత ప్రత్యేకత కనిపించింది. విద్యాసంస్థల ప్రాంగణాల ముఖద్వారాలను మామిడి తోరణాలు, కొబ్బరి మట్టలతో అలంకరించారు. సమావేశానికి హాజరవుతున్న తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులకు విద్యార్థులు పూలతో స్వాగతం పలికారు. పలుచోట్ల సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ప్రార్థన గీతాలతోపాటు దేశభక్తి గీతాలను పలువురు విద్యార్థులు ఆలపించి అలరించారు. కొన్ని హైస్కూళ్లలో వందల సంఖ్యలో విద్యార్థులు, పదుల సంఖ్యలో టీచర్లు ఉండగా పెద్దసంఖ్యలో తల్లిదండ్రులు హాజరుకావడంతో కోలాహలం నెలకొంది.

సందడి చేసిన నేతలు

ప్రభుత్వపరంగా జిల్లాస్థాయి కార్యక్రమం టంగుటూరు మండలం కొణిజేడులో నిర్వహించగా మంత్రి డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, కలెక్టర్ రాజాబాబు, డీఈవో కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఒంగోలు నగరంలోని పీవీఆర్ బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. కొత్తపట్నం మండలం మోటుమాల కేజీబీవీలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ హాజరయ్యారు. సంతనూతలపాడులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అక్కడి ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ పాల్గొన్నారు. పీసీపల్లి జడ్పీ హైస్కూలులో నిర్వహించిన కార్యక్రమానికి కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి హాజరయ్యారు. గిద్దలూరు పట్టణంలోని జడ్పీ బాలికల హైస్కూల్‌లో జరిగిన పీటీఎంలో అక్కడి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి పాల్గొనగా మార్కాపురంలోని జడ్పీ హైస్కూల్ తోపాటు కేకేమిట్ల మండలం గోట్లగట్టు హైస్కూలులో జరిగిన కార్యక్రమాలకు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి హాజరయ్యారు. ముండ్లమూరులోని కేజీబీవీలో జరిగిన పీటీఎంలో దర్శి టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, వైపాలెంలోని హైస్కూలులో అక్కడి టీడీపీ ఇన్‌చార్జి ఎరిక్షన్‌బాబు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బ్రహ్మంచౌదరి పాల్గొన్నారు. అలాగే పలుచోట్ల జిల్లా అధికారులు హాజరయ్యారు. రాష్ట్రప్రభుత్వం విద్యారంగానికి ఇస్తున్న ప్రాధాన్యత, అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల పురోగతిపై టీచర్లు రూపొందించిన పత్రాలను తల్లిదండ్రులకు అందించారు. ఇటీవల మాక్ అసెంబ్లీకి హాజరైన విద్యార్థులను అలాగే వివిధ అంశాలలో గుర్తింపు తెచ్చుకున్న వారిని ఈ సందర్భంగా సత్కరించారు.

ఇరిగేషన్‌లో వార్

(5వ పేజీ తరువాయి)

పెంచాలని పట్టుబట్టారు. దీంతో అధికారులకు, డీసీ అధ్యక్షుడి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఈ అంశం ఇలా ఉండగా సిబ్బంది మధ్య సమన్వయం లేక నీటి పంపిణీ కూడా సక్రమంగా జరగడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రీడింగ్‌లలో తేడాలు ఇప్పటి వరకు సరిచేయలేదు. సాగర్ ప్రధాన కాలువ 85/3వ మైలు (ప్రకాశం బార్డర్) వద్ద ఉన్న రీడింగ్, దర్శి బ్రాంచ్ కాలువ హెడ్ వద్ద ఉన్న రీడింగ్, పమిడిపాడు బ్రాంచ్ హెడ్ వద్ద రీడింగ్‌లలో తేడాలు ఉన్నాయని గత కొంతకాలంగా అధికారులే చెబుతున్నారు. ఆ తేడాల వలన మనకు విడుదలవుతున్న నీటి పరిమాణం సక్రమంగా వస్తుందా? లేదా? అనే విషయం కూడా అనుమానాస్పదమవుతోంది. దీంతో చివరన ఉన్న ఒంగోలు బ్రాంచ్ కాలువకు నీరు సక్రమంగా అందక చివరి ఆయకట్టు భూముల రైతులు ఇబ్బంది పడుతున్నారు. జిల్లా అధికారులు కూడా ఏ కారణం చేతనో లోపాలను సరిదిద్దే ప్రయత్నాలు చేయడం లేదు. పరిస్థితి ఇలాగే కొనసాగితే సమస్య మరింత జటిలమయ్యే ప్రమాదముంది.

ఆరు నెలలగా బిల్లులు చేయని అధికారులు

దర్శి-1 సబ్ డివిజన్ పరిధిలో చేసిన కాలువల మరమ్మతులకు బిల్లులు నేటి వరకు చేయలేదు. సాగర్ జలాలు విడుదల చేయకముందు సుమారు 6 నెలల క్రితం పనులు చేశారు. ఇప్పటివరకు బిల్లులు చేయకుండా ఇబ్బంది పెడుతున్నారని డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ ఆరోపించారు. అధికారులు, సిబ్బంది మధ్య సమన్వయ లోపం వలనే బిల్లులు చేయటంలో కూడా జాప్యం జరిగిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పనులు చేసిన నిర్వాహకులు తాము నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై దర్శి ఈఈ విజయలక్ష్మిని వివరణ కోరగా పమిడిపాడు బ్రాంచ్ కాలువకు నీటి పరిమాణం పెంచాలని డీసీ ప్రెసిడెంట్‌తోపాటు పలువురు నీటి సంఘాల అధ్యక్షులు తమ వద్దకు వచ్చి వాదులాటకు దిగారన్నారు. ఎగువ నుంచి వస్తున్న నీటి పరిమాణం తెలిపి వాస్తవ పరిస్థితి వివరించే ప్రయత్నం చేసినా వారు వినకుండా దురుసుగా మాట్లాడారని చెప్పారు. బిల్లుల చెల్లింపులో జాప్యానికి కారణాలను అడగ్గా తాను ఇటీవలే బాధ్యతలు చేపట్టినందున ఈ విషయం కొద్దిరోజుల క్రితమే తెలిసిందన్నారు. సంబంధిత సబ్ డివిజన్‌లోని అధికారులను పిలిచి త్వరగా బిల్లులు చేయాలని సూచించినట్లు ఆమె వివరించారు.

అభివృద్ధిపథంలో గెలాక్సీపురం!



ప్రారంభోత్సవానికి సిద్ధమైన అర్బన్ హెల్త్‌సెంటర్, విద్యానగర్‌లో సీసీరోడ్డు

- ఎమ్మెల్యే బీఎన్ ప్రత్యేక కృషితో మారుతున్న రూపురేఖలు
- రూ.5.46కోట్లతో అభివృద్ధి పనులు
- నేడు ప్రారంభించనున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న గెలాక్సీపురంగా ప్రఖ్యాతిగాంచిన చీమకుర్తి పట్టణం, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టటంతో మహర్దశ పట్టింది. తనను భారీ మెజార్టీతో గెలిపించడంలో సహకారం అందించిన పట్టణవాసులకు మేలు కలిగించేలా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ చర్యలు చేపట్టారు. రూ.4.66కోట్ల నిధులతో చేపట్టిన పనులు కొన్ని పూర్తయ్యాయి. వాటికి, మిగిలిన పనులకు శనివారం ప్రారంభోత్సవాలు నిర్వహించనున్నారు. వీటన్నింటితో పాటు పట్టణవాసుల ఆరోగ్యాన్ని కాంక్షించి రూ.1.07కోట్లతో నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్‌ని ప్రారంభించనున్నారు. 15వ ఆర్థికసంఘం నిధులతో నిర్మించిన విద్యానగర్, అపెక్స్ స్కూల్ వెనుకవైపున, గూడావారి వీధిలలో నిర్మాణం పూర్తిచేసుకున్న సీసీరోడ్లు, డ్రైనేజీలకు ప్రారంభోత్సవం చేయనున్నారు. అలాగే డీఎంఎఫ్ నిధులతో నాయడుపాలెం రోడ్డు, విద్యానగర్, రాంనగర్ 2వ లైన్ తదితర ప్రాంతాల్లో సీసీరోడ్ల నిర్మాణం కోసం శంకుస్థాపన చేపట్టనున్నారు. మొత్తం మీద 15వ ఫైనాన్స్ నిధులు రూ.1.44కోట్లు, డీఎంఎఫ్ నిధులు రూ.2.60కోట్లు, సబ్‌ప్లాన్ నిధులు రూ.35లక్షలు, వైద్యఆరోగ్యశాఖ, కేంద్ర ఆరోగ్యశాఖ నిధులు మరో కోటి రూపాయలతో నిర్వహిస్తున్న పనులతో పట్టణ రూపురేఖలు మార్చనున్నాయి. వీటితో పాటు రాబోయే కొద్ది నెలలో పట్టణ సుందరీకరణలో భాగంగా పార్కులు నిర్మాణం, సెంట్రల్ డివైడర్లతో లైటింగ్ సిస్టం, ఏపీఎండీసీ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టటానికి కార్యాచరణను ఎమ్మెల్యే విజయ్‌కుమార్ రూపొందిస్తున్నారు.

ఎమ్మెల్యే కృషితో అభివృద్ధి సాకారం

చీమకుర్తిలో పలు అభివృద్ధి పనులకు శనివారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు నిర్వహించనున్నాం. ఎమ్మెల్యే విజయ్‌కుమార్ చొరవ, ప్రత్యేక కృషితో అభివృద్ధి సాకారం కానుంది. భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టటానికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

- వై.రామకృష్ణయ్య, కమిషనర్, చీమకుర్తి మున్సిపాలిటీ

పాతాళానికి పడిన నిమ్మ ధర

- గతేడాది ఇదే సీజన్‌లో కేజీ రూ.40..
- ప్రస్తుతం కేజీరూ.8 మాత్రమే
- నష్టాల బాటలో రైతులు
- అడిగేవారు లేక పొలంలోనే వదిలేస్తున్న వైనం
- ఎకరాకు రూ.50 వేలకుపైగా నష్టం

ముండ్లమూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొప్పూడివారిపాలెం గ్రామంలో నిమ్మసాగు రైతులు నష్టాల పాలయ్యారు. మార్కెట్‌లో ఒక్కసారిగా ధర పాతాళానికి పడి పోవటంతో ఆందోళన చెందుతున్నారు. వారం రోజుల్లోనే కేవలం కిలో ఎనిమిది రూపాయలకు పడి పోయింది. దీంతో పెట్టుబడులు కూడా రాక పోవటంతో చేసేదేమి లేక నిమ్మకాయలు తోటల్లోనే వదిలి వేస్తున్నారు. మరికొంత మంది రైతులైతే కోసి తక్కువ రేటుకే విక్రయిస్తున్నారు. గత ఏడాది ఇదే సీజన్‌లో కేజీ రూ.30 నుంచి రూ.40 వరకు ధర పలికింది. లాభాలు కూడా గడించారు. కాని ఈ ఏడాది నిమ్మసాగు రైతులు ధర పాతాళంలోకి పడి పోవటంతో ఏం చేయాలో అర్థం కాని పరిస్థితుల్లో ఉన్నారు. పెట్టుబడి మాత్రం ఎకరానికి రూ.50వేలు కాగా కోత కూలి ఖర్చు మరో రూ.50వేలు అవుతుంది. దిగుబడి ఒకరకంగా ఉన్నా ధర లేక పోవటంతో ఎకరంలో నిమ్మకాయలు అమ్మకాలు చేస్తే రూ.30వేల నుంచి రూ.40వేలు మాత్రమే వస్తుంది. సరాసరి రైతుకు రూ.60వేలు వరకు నష్టం రావటంతో నిమ్మ రైతులు లబోదిబోమంటున్నారు. బొప్పూడివారిపాలెం గ్రామంలోనే దాదాపు 250 ఎకరాలకు పైగా నిమ్మతోటలు సాగు చేశారు. గత ఏడాది బాగా దిగుబడి రావటం, మార్కెట్‌లో ధర ఉండటంతో వచ్చిన దిగుబడిని నిమ్మసాగు రైతులే తెనాలి మార్కెట్‌కు తరలించి అమ్మకాలు చేసుకొనేవారు. ఈ ఏడాదిలో నెల రోజుల నుంచి ముమ్మరంగా నిమ్మకాయల కోతలు వచ్చాయి. కోతలు వచ్చిన దగ్గర నుంచి రైతుకు ఆశించిన ధర లేదు. ఒక వైపు తోటలో వచ్చిన తెగుళ్లను కాపాడు కోవటానికి ఎక్కువగా మందుల పిచికారీ చేశారు. దీనికి తోడు ఎక్కువగానే రైతుకు ఖర్చయింది. తీరా దిగుబడి వచ్చే సరికి మార్కెట్‌లో ధర లేక పోవటం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం తెనాలి మార్కెట్‌కు తీసుకు వెళ్లాలంటే కనీసం కోత, కూలీ ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేక పోవటంతో తోటలు సాగు చేసిన రైతుల కుటుంబ సభ్యులే కాయలు కోసి సమీపంలోని వినుకొండ, నరసరావుపేట, అద్దంకి, దర్శి ప్రాంతాలకు వెళ్ళి విక్రయిస్తున్నారు. కనీసం నిమ్మకాలు తీసుకు వెళ్ళిన ఆటోల బాడుగ కూడా వచ్చే పరిస్థితి లేదు. దీంతో ఈ ఏడాది సరాసరి ఒక్కొక్క రైతుకు ఎకరానికి రూ.50వేల మేర నష్టం వచ్చింది.



దిగులుగా కూర్చున్న రైతు

కొనే వారే లేరు

నేను మూడేళ్లుగా ఐదు ఎకరాల్లో నిమ్మసాగు చేస్తున్నా. ఈ ఏడాది కేజీ ఆరు నుంచి ఎనిమిది రూపాయలకు మాత్రమే ధర ఉంది. కనీసం కోత, కూలి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితులు లేవు. సరాసరి ఎకరానికి పెట్టుబడి రూ.50వేలు అయ్యింది. కోత కూలీ ఖర్చు మరో రూ.50వేలు అయ్యింది. దానికి అనుగుణంగా ధరలేక తోటలోనే వదిలి వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వమే రైతులను ఆదుకోవాలి.

- లాం శ్రీనివాసరావు, నిమ్మ సాగు రైతు, బొప్పూడివారిపాలెం

జలసంరక్షణతో భూగర్భజలాలు పుష్కలం

- మురుగుమ్మిలో వాటర్‌షెడ్ పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఉగ్ర

పీసీపల్లి,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి):జల సంరక్షణ చర్యలు చేపట్టడం ద్వారా భూగర్భజలాలు పెరుగుతాయని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు.మండలంలోని మురుగుమ్మి గ్రామంలో రూ. 97.66లక్షల వ్యయంతో రూపుదిద్దుకున్న వాటర్‌షెడ్ పథకాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా అక్కడ గ్రామ ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాధారిత ప్రాంతాలకు వాటర్‌షెడ్ పథకాలు ఎంతో మేలు చేస్తాయన్నారు.భూగర్భ జలాలు పెరగడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకత కూడా గణనీయంగా మెరుగుపడుతుందని ఆయన పేర్కొన్నారు. క్షామ పీడిత ప్రాంతమైన ఈ భూమిలో గతంలో ఎన్ని బోర్లు వేసినా నీళ్లు పడేవి కాదన్నారు.ప్రభుత్వం గ్రామీణాభివృద్ధే ధ్యేయంగా చేపట్టిన వాటర్‌షెడ్ పథ ద్వారా చేపట్టిన ఆనకట్టలు, నీటికుంటలు, చెక్‌డ్యాంలతో వర్షపునీరు వృథాపోకుండా నిలిచాయన్నారు. తద్వారా భూగర్భ జలాలు బాగా పెరిగాయన్నారు. దీని ఫలితంగా మురుగుమ్మి వాటర్‌షెడ్ పథకం జాతీయస్థాయిలో జలసంరక్షణ అవార్డును అందుకుందని చెప్పారు. తొలుత ఈ అవార్డు ద్వారా మురుగుమ్మికి అదనంగా కేటాయించిన 20లక్షల రూపాయలకు సంబంధించి చేపట్టనున్న పనులకు ఆయన భూమిపూజ చేశారు.ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ గంగవరపు జోసఫ్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాసరావు,గ్రామసర్పంచ్ నల్ల గంగుల సుబ్బరత్తమ్మ, ఏపీడీ వై.చంద్రశేఖర్‌రెడ్డి, అడిషనల్ పీడీ టి.హనుమంతరావు, పీవో నజీర్, ఏపీవో చినకొండయ్య, తహసీల్దార్ ఉష, ఎంపీడీవో కృష్ణారావు, ఏవో రంగాకృష్ణ, టీడీపీ మండలపార్టీ అధ్యక్షుడు వేమూరి రామయ్య, పులి ప్రతాప్‌రెడ్డి, కసిరెడ్డి హనుమారెడ్డి, ఓబుల్‌రెడ్డి, పువ్వాడి నాగరాజు, కృష్ణారెడ్డి, జోసెఫ్, ఎబినేజరు, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



మురుగుమ్మిలో వాటర్‌షెడ్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

స్క్రబ్ టైఫస్‌పై అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాల్లో స్క్రబ్ టైఫస్ వ్యాధిపై వైద్యఆరోగ్యశాఖ శాఖ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని వైద్యఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి సౌరబ్ ఆదేశించారు. వైద్యశాఖ కమిషనర్ వీరపాండ్యన్‌తో కలిసి శుక్రవారం జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. స్క్రబ్ టైఫస్ చికిత్సకు సంబంధించిన మందులు అందుబాటులో ఉంచడంతో పాటు ల్యాబ్‌ల్లో పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు.

హుండీ ఆదాయం రూ.21.05 లక్షలు

వల్లూరమ్మ (కొండపి): డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : వల్లూరమ్మ ఆలయ హుండీల ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. మొత్తం 118 రోజులకు 21,05,056 రూపాయల నగదు, 32 గ్రాముల బంగారం, 185 గ్రాముల వెండి వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి బి.రమేష్ తెలిపారు. .

స్మారక చిహ్నాలు, ప్రదేశాల అభివృద్ధిపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో జాతీయ గుర్తింపు పొందిన స్మారకచిహ్నాలు, ప్రదేశాల అభివృద్ధిపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి శుక్రవారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర పర్యాటకశాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ సమాధానం ఇస్తూ పురావస్తు సర్వే ఆఫ్ ఇండియా గుర్తించిన పురాతన స్మారక చిహ్నాలు, పురావస్తు ప్రదేశాలు దేశంలో 3,685 ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో 135 ఉన్నాయని తెలిపారు.

సార్వత్రిక విద్యాపీఠం పది, ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం పదవ తరగతి, ఇంటర్మీడియేట్ పబ్లిక్ పరీక్షల షెడ్యూల్‌ను సార్వత్రిక విద్యా పీఠం సంచాలకులు ఆర్, నరసింహారావు శుక్రవారం విడుదల చేశారు. పదవ తరగతి పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 16నుంచి 28వతేదీ వరకు జరుగుతాయి. వచ్చే ఏడాది మార్చి 16వ తేదీన తెలుగు, ఉర్దూ, కన్నడ, ఒరియా, తమిళం, 18వతేదీన ఇంగ్లీషు, 20వతేదీన గణితం, భారతీయ సంస్కృతి, వారసత్వం, 23వతేదీన సాంఘిక శాస్త్రం, ఆర్థిక శాస్త్రం, 28వతేదీన హిందీ పరీక్ష జరుగుతుంది. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతుందని ఆ షెడ్యూల్‌లో ప్రకటించారు. ఇంటర్మీడియేట్ పరీక్షలు వచ్చే ఏడాది మార్చి 2వతేదీ నుంచి జరగనున్నాయి. వచ్చే ఏడాది మార్చి 2వ తేదీన ఇంగ్లీషు, 5వ తేదీన హిందీ, తెలుగు, ఉర్దూ, 7వ తేదీన రసాయనశాస్త్రం, ఆర్థికశాస్త్రం, సామాజిక శాస్త్రం, 9వ తేదీన భౌతిక శాస్త్రం, రాజనీతి శాస్త్రం, పౌరశాస్త్రం, మనో విజ్ఞాన శాస్త్రం, 11వ తేదీన గణితం, చరిత్ర, వ్యాపార గణక శాస్త్రం, 13వ తేదీన జీవశాస్త్రం, వాణిజ్య/వ్యాపార శాస్త్రం, గృహ విజ్ఞాన శాస్త్రం పరీక్షలు జరుగుతాయి. ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు మార్చి 11వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరుగుతాయని షెడ్యూల్‌లో ప్రకటించారు.

ప్రైవేటు వైద్యుల సమస్యలను పరిష్కరించాలి

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రైవేటు వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌కు విన్నవించారు. శుక్రవారం స్థానిక ఐఎంఏ హాలులో ఎమ్మెల్యేతో జరిగిన మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమంలో పలు సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఐఎంఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ జాలాది మణిబాబు మాట్లాడుతూ హాస్పిటల్‌లో చెత్త సేకరణకు ప్రతినెలా రూ.3వేలు వసూలు చేస్తున్నారని, అగ్ని ప్రమాదాల నివారణకు అవసరమైన ఎన్ఓసీ సర్టిఫికెట్ మంజూరులో అధికంగా ఫీజులు, పలు నిబంధనలు ఇబ్బందిగా మారాయన్నారు. దాంతోపాటుగా హాస్పిటల్ రిజిస్ట్రేషన్ ఫీజు అత్యధికంగా ఉంటుందని, అనుమతులు ఇవ్వడంలో జాప్యం జరుగుతుందని ఎమ్మెల్యేకు వివరించారు. సమస్యలు పరిష్కరిస్తానని దామచర్ల హామీ ఇచ్చారు.



మీట్ అండ్ గ్రీట్‌లో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఎన్‌జీవో సంఘం జిల్లా బ్రాంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నాన్ గజిటెడ్, గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీఎన్‌జీవో) ఒంగోలు బ్రాంచి ఎన్నికలకు ఎన్నికల అధికారి, ఎన్‌జీవో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు శుక్రవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఎన్‌జీవో సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శితో పాటు మొత్తం 17 పోస్టులకు ఈ ఎన్నికలు జరగనున్నాయి. ఒంగోలులోని స్థానిక ఎన్‌జీవో భవన్‌లో ఈనెల 9వతేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఈనెల 10వతేదీన నామినేషన్ల ఉపసంహరణ, తుది అర్హత పొందిన అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. ఎన్నికలు అనివార్యం అయితే ఈనెల 20వతేదీ ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎన్‌జీవో భవన్‌లో పోలింగ్ జరుగుతుంది. అనంతరం ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. సహాయ ఎన్నికల అధికారిగా నెల్లూరు జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ వ్యవహరించనుండగా పరిశీలకులుగా రాష్ట్ర కార్యదర్శి ఎస్‌బీవీ రామ్ ప్రసాద్ వ్యవహరించనున్నారు. జిల్లాలోని అన్ని తాలూకా యూనిట్లలో గెలిచిన 267 మంది ఓటర్లుగా ఉన్నారు.

లాట్ మొబైల్స్‌లో లక్కీడ్రా



లక్కీ డ్రా విజేతలతో లాట్ సంస్థ నిర్వాహకులు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని లాట్ మొబైల్స్ స్టోర్‌లో శుక్రవారం లక్కీడ్రా తీసి విజేతలకు బహుమతులను అందజేశారు. జి.శివ రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను పొందారు. పి.చంటి ఏసీని పొందారు. వీరితోపాటు పురిణి హరిక్రిష్ణ, జి.రజిని, వి.అనంత్‌కుమార్, బి.శివకుమార్, ఎ.సాగర్ విజేతలుగా లక్కీ డ్రా పొందారు. ఈ ఏడాది సెప్టెంబరు 17న ప్రముఖ సినీ నటి పాయల్ రాజపుత్ లాట్ మొబైల్స్ స్టోర్ ప్రారంభోత్సవం సందర్భంగా వినియోగదారుల కోసం లక్కీ డ్రా కంటెస్టును ప్రవేశపెట్టారు. ఒంగోలు వినియోగదారుల కోసమే ఈ లక్కీడ్రా రూపొందించామని మొబైల్స్ డైరెక్టర్ ఎం.అఖిల్ తెలిపారు. 13 ఏళ్ళుగా వినియోగదారులకు ఎంతో నమ్మకంతో సేవలను అందిస్తున్నామన్నారు. శుక్రవారం తీసిన లాట్ లక్కీ డ్రాలో విజేతలకు రాయల్ ఎన్‌ఫీల్డ్, రిఫ్రిజరేటర్, వాషింగ్ మిషన్, స్మార్ట్ టీవీ, స్మార్ట్ ఫోన్‌ను బహుమతులుగా అందజేసినట్లు తెలిపారు. లాట్ మొబైల్స్ డైరెక్టర్ ఎం.సుప్రజ మాట్లాడుతూ ఒంగోలులో లాట్ మొబైల్స్ స్టోర్‌లో 365 రోజుల పాటు స్పెషల్ ఆఫర్లు ఉండేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

93.50 కోట్లతో అదనపు తరగతి గదులు

- మంత్రి స్వామి వెల్లడి

కొణిజేడు (కొండపి), డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ స్కూళ్లలో రూ.93.50 కోట్లతో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి వెల్లడించారు. శుక్రవారం కొణిజేడు జడ్పీస్కూల్‌లో జరిగిన మెగా పీటీఎం కార్యక్రమం స్వామి ఈ విషయాన్ని ప్రకటించారు. పనులు త్వరలో ప్రారంభం కానున్నాయన్నారు. ఎస్ఎంసీ కమిటీల ద్వారానే పనులు జరుగుతాయన్నారు. అందులో భాగంగా కొణిజేడు జడ్పీస్కూల్‌కు కూడా రూ.69 లక్షల అంచనా వ్యయంతో రెండు తరగతి గదులు మంజూరయ్యాయని మంత్రి వివరించారు.

ఇంటిముందు ఉంచిన బైక్‌కు నిప్పు

గిద్దలూరు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఉంచిన మోటార్ సైకిల్‌కు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కాలి బూడిదైంది. మండలంలోని వెల్లుపల్లె గ్రామానికి చెందిన జంగాల రవి తన ద్విచక్ర వాహనాన్ని గురువారం రాత్రి ఇంటి ముందు ఉంచాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనానికి నిప్పు పెట్టడంతో కాలి బూడిదైంది. రవి శుక్రవారం స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గల్లంతైన బీటెక్ విద్యార్థి మృతదేహం లభ్యం

త్రిపురాంతకం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాగర్ కాలువలో ప్రమాదవశాత్తు జారిపడి గల్లంతైన విద్యార్థి సురేంద్రరెడ్డి మృతదేహం ఎట్టకేలకు లభ్యమైంది. రెండు రోజులపాటు ఎస్డీఆర్‌ఎఫ్ బృందం గాలించిన మీదట శుక్రవారం ఆచూకీ తెలిసింది. మండలంలోని రాజుపాలేనికి చెందిన పెద్దపూడి సురేంద్రరెడ్డి (21) వడ్లపూడి విజ్ఞాన్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతూ బంధువుల ఇంటిలో కార్యక్రమానికి హాజరయ్యాడు. బుధవారం ఉదయం సాగర్ కాలువ వద్దకు వెళ్లి జారిపడినట్లు గుర్తించి గాలింపు చర్యలు ప్రారంభించారు. గురువారం ఎస్డీఆర్‌ఎఫ్ బృందం రంగంలోకి దిగింది. గాలిస్తున్న వారికి కురిచేడు మండలం నాయుడుపాలెం వద్ద యువకుని మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించారు.

ఆలయానికి వెళుతూ..

(5వ పేజీ తరువాయి)

ఉన్నారు. సుబ్బారెడ్డికి ముగ్గురు సంతానం. ఇద్దరు కవల పిల్లల్లో పెద్దవాడైన రామిరెడ్డి గుంటూరు విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతున్నాడు. అయ్యప్ప దీక్ష చేపట్టిన అతను తన స్నేహితులతో కలిసి దేవుని ఆలయంలో నిద్ర చేసేందుకు వినుకొండకు బయలుదేరాడు. గురువారం రాత్రి 7.30 సమయంలో వారు ప్రయాణిస్తున్న కారు ముందుగా వెళుతున్న కంటైనర్ లారీని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో రామిరెడ్డితోపాటు మరో నలుగురు మృతిచెందారు. వార్త తెలిసి గ్రామప్రజలు విషాదంలో మునిగిపోయారు. సుబ్బారెడ్డిలా కుమారుడు రామిరెడ్డి కూడా ప్రజలతో స్నేహంగా ఉంటూ అందరితో కలిసిమెలిసి ఉండేవాడు. అలాంటి యువకుడు మృతిచెందడం బాధాకరంగా ఉందని గ్రామస్థులు విచారం వ్యక్తం చేశారు.

నివాళులర్పించిన టీడీపీ నాయకులు

మేడగం సుబ్బారెడ్డి కుమారుడు రామిరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్న సమాచారం తెలియగానే టీడీపీ దర్శి నాయకులు కడియాల లలిత్‌సాగర్, పార్టీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర నాటక అకాడమీ కార్పొరేషన్ డైరెక్టర్ బి.ఓబుల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఐ.వెంకటేశ్వరరెడ్డి, మానం రమేష్ విఠలాపురంలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. రామిరెడ్డి తండ్రి సుబ్బారెడ్డిని ఓదార్చారు. ఘటన వివరాలను తెలుసుకుని తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతదేహానికి నివాళులర్పించిన వారిలో రాష్ట్ర వ్యవసాయ కార్పొరేషన్ వైస్‌చైర్మన్ మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, టీడీపీ నాయకులు వేణుబాబు, రాచకొండ వెంకట్రావు, రామకోటిరెడ్డి, చందన, నవులూరి సుధాకర్, నాగార్జునరెడ్డి, కొర్రపాటి శ్రీను, ఎం.సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు మారం వెంకటరెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మారం ఇంద్రసేనారెడ్డి , తదితరులు ఉన్నారు.

ఫోన్‌లో మాగుంట పరామర్శ

సుబ్బారెడ్డిని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి ఫోన్‌లో పరామర్శించారు. ఎంపీ కార్యాలయ ప్రతినిధులు రామకృష్ణ తదితరులు మృతదేహం వద్ద మాగుంట తరఫున నివాళులర్పించారు.



పోలీసులకు దీటుగా పనిచేసే హోంగార్డుల కుటుంబాలు దయనీయ పరిస్థితిలో కొట్టిమిట్టాడుతున్నాయి. శాంతిభద్రతల విషయంలో ముందు వరుసలో ఉండేది హోంగార్డులు. తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజల క్షేమం కోసం పనిచేస్తారు. అయితే చాలీచాలని జీతం, భరోసా లేనిఉద్యోగం చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. 1946లో ఏర్పాటు చేసిన హోంగార్డుల వ్యవస్థలో మార్పులు లేవు. గౌరవ వేతనం ఇచ్చి పనిచేయించుకోవడం పోయి పోలీసు విధులన్నీ చేయిస్తున్నారు. అయినా ఇప్పటికీ దినసరి వేతనం కోసం భద్రత లేకుండా ఉద్యోగం చేస్తున్నారు. నేడు హోంగార్డుల దినోత్సవం సందర్భంగా వారి సేవలపై ప్రత్యేక కథనం..

పోలీసులకు దీటుగా విధులు

- ఉద్యోగ విరమణ పొందినా పింఛన్ రాదు
- గౌరవ వేతనం కాదు బేసిక్ ఇవ్వాలని డిమాండ్
- నేడు హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం

ఒంగోలు క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 817 మంది హోంగార్డులు పనిచేస్తున్నారు. వీరిలో 733 మంది పురుషులు. 84 మంది మహిళలు ఉన్నారు. వీరిలో 731 మంది పోలీసు శాఖలో జనరల్ డ్యూటీలో విధులు నిర్వహిస్తుండగా మిగిలిన 86 మంది వివిధ శాఖల్లో పనులుచేస్తున్నారు. అగ్నిమాపక, రవాణ, ఆర్టీసీ, ఎఫ్‌సీఐ ఇలా అనేక శాఖల్లో డిప్యూటేషన్లపై విధులు నిర్వహిస్తున్నారు.

గౌరవ వేతనం రోజుకు రూ.710

హోంగార్డులకు దినసరి గౌరవ వేతనం రూ.710 ఇస్తున్నారు. ఈ వేతనంతో పోలీసు కానిస్టేబుల్‌కు దీటుగా ఉద్యోగం చేయాల్సి ఉంది. రోజూ కనీసం 12 గంటలు వారికి విధులు చెబుతుంటారు. అయితే హోంగార్డులకు ఎలాంటి ఉద్యోగోన్నతీ లేదు. విధుల్లో చేరింది మొదలు రిటైర్మెంట్ అయ్యే వరకు హోంగార్డుగానే పనిచేయాలి. జీవితాంతం పనిచేసినా జీతం దినసరి వేతనమే. బేసిక్‌తో నెలసరి జీతం ఇవ్వాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉంది. ఏ ప్రభుత్వమూ పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రస్తుతం నెలకు రెండు సెలవులే ఇస్తున్నారు.

పెన్షన్‌కు అవకాశం లేదు

హోంగార్డులు ఉద్యోగ విరమణ చేసిన తరువాత ప్రభుత్వం తరుపున ఎలాంటి రాయితీలు రాకపోగా ప్రభుత్వ సర్వీస్‌గా వారిని గుర్తిస్తారు. దీంతో కనీసం వృద్ధాప్య పింఛన్ పొందలేకపోతున్నారు. విధినిర్వహణలో ఎలాంటి టీఏ, డీఏ దక్కడం లేదు. కాలం మారుతున్నకొద్దీ హోంగార్డులను ఉద్యోగులుగా గుర్తించి వారి జీవితాలలో వెలుగులు నింపాలని కోరుతున్నారు. కనీసం బేసిక్ జీతం ఏర్పాటు చేస్తే, సర్వీస్‌కు అనుగుణంగా జీతం వస్తుందని వారు ఆశిస్తున్నారు.

మా జీవితాలకు భరోసా లేదు

హోంగార్డులుగా పనిచేస్తున్నా మాకు ఎలాంటి భరోసా లేదని వాపోతున్నారు. జిల్లాలో హోంగార్డులుగా పనిచేస్తున్న వారికి ఇంటి స్థలం ఇప్పించాలని కోరుతున్నారు. ప్రతి కుటుంబానికి రూ.5 లక్షలు వైద్య సాయం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. హోంగార్డు మరణిస్తే ఆ కుటుంబానికి భరోసాగా రూ.10 లక్షలు ఇవ్వాలని కోరుతున్నారు. ఉద్యోగ విరమణ తరువాత హోంగార్డు కుటంబాలకు ఎలాంటి భద్రతలేకుండా పోతోందని అవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా హోంగార్డుల జీవితాలలో వెలుగులు నింపాలని ప్రతిఒక్కరూ కోరుకుంటున్నారు.

కన్నులపండువగా..

- మెగా పీటీఎంతో ప్రభుత్వ పాఠశాలల్లో సందడి ● అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ 3.0 శుక్రవారం ఒంగోలులో పండుగ వాతావరణంలో జరిగింది. పిల్లలు, టీచర్స్, విశిష్ట అతిథులతో పాఠశాలల్లో సందడి వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పాఠశాలలను అరిటి తోరణాలతో ముస్తాబు చేసి, అందమైన రంగువల్లులతో అతిథులకు స్వాగతం పలికారు. ప్రత్యేకించి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి క్లాస్ రూమ్ బెంచీలపై ముచ్చట్లు చెప్పుకుంటూ మురిసిపోయారు. మరోవైపు తమలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి అందమైన బొమ్మలను, వివిధ ప్రాజెక్టులను ప్రదర్శనగా ఉంచడంతో అతిథులు, తల్లిదండ్రుల ప్రశంసలతో విద్యార్థుల పులకించిపోయారు. సమావేశం అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులు విద్యార్థుల తల్లిదండ్రులందరు కలిసి సహపంక్తి భోజనం చేశారు. దీంతో ఆయా పాఠశాలల్లో అందరిలోనూ ఆనందోత్సాహాలు వెల్లివిరిసాయి. మెగా పీటీఎం సందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో ప్రదర్శించిన సాంస్కృతి కార్యక్రమాలు కనులవిందుగా సాగాయి. - ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)



విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్



పీటీఎంలో మాట్లాడుతున్న మంత్రి స్వామి, పక్కన కలెక్టర్ రాజాబాబు

ఉత్తమ పౌరుల కార్ఖానాలుగా స్కూళ్లు

- ఇదే నారా లోకేష్ లక్ష్యం
- మెగా పీటీఎంలో మంత్రి స్వామి
- కొణిజేడు, కందులూరు పాఠశాలలకు హాజరు
- విద్యార్థులు, తల్లిదండ్రులతో మాటా మంతీ
- విద్యార్థులతో కలిసి భోజనం

కొణిజేడు, కందులూరు (కొండపి) డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే ఖార్ఖానాలుగా ప్రభుత్వ స్కూళ్లను తయారు చేయాలనేదే విద్యాశాఖామంత్రి నారా లోకేష్ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖామంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం టంగుటూరు మండలంలోని కొణిజేడు, కందులూరు గ్రామాల్లోని స్కూళ్లలో జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో మంత్రి స్వామి కలెక్టర్‌తో కలిసి పాల్గొన్నారు. కొణిజేడులోని జడ్పీ స్కూల్ ప్లస్‌లో జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా మారేందుకు కేవలం చదువులోనే కాకుండా, ఆరోగ్యం, ఆనందం, వ్యాయామం, క్రీడలు, సాంకేతికత, అన్ని రంగాల్లో ముందుకు సాగేలా పాఠ్యాంశాల రూపకల్పన, విద్యార్థులకు ఉత్తమమైన డ్రస్ కోడ్, రుచి, శుచి పోషకాలతో కూడిన ఆహారం, బడికి వెళ్లే ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం పేరుతో రూ.13000 ఎంతమంది ఉన్నా అందరికీ డబ్బులు తల్లుల ఖాతాలకు వేయడం ప్రభుత్వం గొప్ప కార్యక్రమం చేపట్టిందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పోత్సాహకాలను అందుకుని జీవితంలో గొప్ప స్థానాలకు చేరుకుని పారిశ్రామిక వేత్తలుగా, ఉన్నత ఉద్యోగులుగా తయారు కావాలన్నారు. కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్ స్కూళ్లకు మించి ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు సౌకర్యాలు కల్పించిందన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో నేడు అన్ని వసతులు ఉన్నాయన్నారు. సమావేశంలో ఒంగోలు ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవడం ఏమాత్రం తక్కువ కాదన్నారు. నేడు ప్రభుత్వ స్కూళ్లలో ప్రాథమిక స్థాయి నుంచే ఇంగ్లీషు మీడియం అందుబాటులో ఉందన్నారు. సమావేశంలో డీఈవో ఎ.కిరణ్‌కుమార్, నియోజకవర్గ ప్రత్యేకాధికారి కళావతి, సర్వశిక్ష ఈఈ వెంకటరత్నం, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మానాయక్, ఎంపీడీవో దేవసేనకుమారి, తహసీల్దార్ ఆంజనేయులు, ఎంఈవోలు చెల్లి ఆనందరావు, బాలాజీ, స్కూల్ కమిటీ చైర్మన్ వెంకటరావు స్కూల్ హెచ్‌ఎం చల్లా బ్రహ్మయ్య పాల్గొన్నారు. తెలుగు పండిట్ ఝాన్సీరాణి తెలుగులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. కొణిజేడు పీఏసీఎస్ చైర్‌పర్సన్ రామా కామయ్య గ్రామంలో ఎస్సీ, బీసీ విద్యార్థులకు అనకూలంగా హాస్టల్ నిర్మించి వసతి కల్పించాలని కోరారు. కార్యక్రమం ముందుగా స్కూల్ ఆవరణలోని సరస్వతీదేవి విగ్రహానికి మంత్రి స్వామి, కలెక్టర్ పూలమాల వేశారు. స్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనశాలను, మానవ అవయవ నమూనాలను, గ్రంథ, పుస్తకాలను ప్రదర్శించారు. ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు, అంగన్ వాడీలు పోషకాహారాన్ని ప్రదర్శించారు. మంత్రి, కలెక్టర్ విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ గ్రామ నాయకులు రామా గోపి, రామా సీతారామయ్య, రామా శ్రీను, బత్తుల సుబ్బారెడ్డి, పూర్వపు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోడలి చదువుకు అత్త తోడు!

- పీటీఎంలో వెలుగుచూసిన వైనం



పీటీఎం మీటింగ్‌కు హాజరైన అత్తాకోడళ్లు సువార్తమ్మ, విజయ

మర్రిపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అత్తాకోడళ్లు అంటే శత్రువులుగా చూపడం ఈ వ్యవస్థలో భాగమైంది. ఈ భావనను పటాపంచలు చేస్తూ ఆప్యాయత, అనురాగానికి నిదర్శనంగా నిలిచారు ఓ అత్తాకోడళ్లు. తనకు చదువుకునే యోగ్యం లేదని, కనీసం తన కోడలికైనా మంచి చదువు చెప్పించి ఉన్నత ఉద్యోగం సాధించాలనే సంకల్పంతో కళాశాలలో చేర్పించిన ఓ అత్త కథ ఇది. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో జరిగిన పీటీఎం సమావేశానికి స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన దాసరి సువార్తమ్మ, ఆమె కోడలు విజయ తరుపున హాజరయ్యారు. ఈ సందర్భంగా సువార్తమ్మ మాట్లాడుతూ.. తాను 3వ తరగతి చదువుతున్నప్పుడే వివాహం చేయడంతో చదువు కొనసాగించలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. తన కోడలిని అయినా ఉన్నత చదువులు చదివించాలనే ఆకాంక్షతో జూనియర్ కళాశాలలో చేర్పించానని చెప్పారు. ఇంటర్ తొలి సంవత్సరం 500 మార్కులకు గాను 461 సాధించి కళాశాల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలవడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఎంతైనా చదివిస్తానని, ఆమె ఉన్నత ఉద్యోగం సాధించాలనేదే తన అభీష్టమని పేర్కొన్నారు. కోడలి పట్ల అత్త చూపించిన ఆదరణను సభికులను మంత్రముగ్ధులను చేసింది.

పృథులగిరిపై దుష్ప్రచారాన్ని నమ్మొద్దు

- విలేకరుల సమావేశంలో మర్రిపూడి ప్రజల విజ్ఞప్తి

మర్రిపూడి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పృథులగిరి దేవస్థానంపై పొదిలి మండల నాయకులు కొందరు చేస్తున్న దుష్ప్రచారాన్ని నమ్మవద్దని మర్రిపూడి గ్రామస్థులు ముక్తకంఠంతో కోరారు. శుక్రవారం రాత్రి స్థానిక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పొదిలికొండ పేరును మర్రిపూడి కొండగా మార్చారనే ప్రచారం అవాస్తవమన్నారు. లక్ష్మీనరసింహస్వామి సేవలో మర్రిపూడి గ్రామస్థులు వందల ఏళ్ల నుంచి తరిస్తున్నారన్నారు. అటువంటి నరసింహస్వామి ఆలయంపై అపోహలను విడనాడాలని కోరారు. మర్రిపూడికి చెందిన శివరాజ్ వంశీకులు స్వామి దర్శనానికి వెళ్లే భక్తుల కోసం 150 సంవత్సరాల క్రితమే సోపాన మార్గాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. స్వామి వారి ఉత్సవ మూర్తులకు మర్రిపూడి గ్రామంలో నిత్యం దూపదీప నైవేద్యాలు జరుగుతున్న మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. 1914 నుంచి మర్రిపూడి గ్రామస్థులు స్వామివారి బ్రహ్మోత్సవాలలో కీలక ఉభయదాతలుగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. అంకురార్పణ మొదలు ఏకాంత సేవ వరకు బ్రహ్మోత్సవాలలో ప్రధానమైన గరుడ సేవ, కల్యాణోత్సవాలకు సైతం మర్రిపూడి వాసులే ఉభయదాతలుగా వ్యహరిస్తున్నారన్నారు. దేవాలయ అభివృద్ధి కోసం గ్రామస్థులు అహరహం కృషి చేస్తున్నారని చెప్పారు. కేవలం రాజకీయ మనుగడ కోసం కొంతమంది నేతలు అవాస్తవాలను ప్రచారం చేయడం వలన గ్రామస్థుల మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పొదిలి, మర్రిపూడి మండలాల ప్రజలు సోదరభావంతో మెలుగుతున్నారని అటువంటి వారి మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో దారుకుమల్లి గోవిందరెడ్డి, ఇనుకొల్లు సుబ్బారెడ్డి, పల్లకి వెంకటనరసింహారెడ్డి, ఇనుకొల్లు కృష్ణచైతన్యరెడ్డి, నన్నపురెడ్డి రామిరెడ్డి, పూనూరి బ్రహ్మరెడ్డి, కొండూరి చినచెంచురెడ్డి, ఇనుకొల్లు వెంకటేశ్వరరెడ్డి, ఇనుకొల్లు మాదిరెడ్డి, ఇనుకొల్లు రామకృష్ణారెడ్డి, పల్లకి నవీన్‌రెడ్డి, దేవరపల్లి లక్ష్మీనారాయణ, దారకమల్లి పెద్దిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కార వేదికగా ప్రజాదర్బార్

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను తెలుసుకుని సత్వరమే పరిష్కరించేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చెప్పారు. శుక్రవారం పట్టణం లోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అర్జీల రూపంలో స్వీకరించి అప్పటికప్పుడే పలు సమస్యలను సంబంధిత అధికారులకు ఫోన్‌లో వివరించి పరిష్కారానికి సూచనలు చేశారు. ఇంటి స్థలాలు, పక్కాగృహాలు, దివ్యాంగ, సామాజిక పింఛన్లతోపాటు గ్రామాల్లోని సమస్యలపై ప్రజలు ఎమ్మెల్యే ముత్తుములకు అర్జీలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్య ఉన్నా ప్రతి శుక్రవారం నిర్వహించే ప్రజాదర్బార్ కార్యక్రమంలో అర్జీ రూపంలో తనకు తెలియచేస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న వీఆర్ఏలు

వీఆర్ఏల సమస్యలు పరిష్కరించాలి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గ్రామరెవెన్యూ సహాయకులు(వీఆర్ఏ) ఎ దుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ బందగీ సాహెబ్ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వీఆర్ఏలకు పేస్కేలు జీతాలతో పాటు ఎటువంటి నోటిఫికేషన్ లేకుండా పూర్తిగా పదోన్నతులు భర్తీ చేయాలన్నారు. నామిని సమస్యను కూడా పరిష్కరించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి 17 నెలలు గడుస్తున్నా ఒక్క సమస్య కూడా పరిష్కారం కాలేదన్నారు. 8 సంవత్సరాలుగా జీతాలు కూడా పెరగలేదన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రులు, మంత్రులు మారుతున్నారని, కానీ తమ సమస్యలు మాత్రం అలాగే ఉంటున్నాయని అవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు ఇవ్వాలని, వీఆర్ఏలకు పే స్కేలు అమలు చేసి అటెండర్, నైట్ వాచ్‌మెన్ పదోన్నతులకు 70శాతానికి పెంచాలన్నారు. సంఘం గౌరవాధ్యక్షుడు జి.శ్రీనివాసులు మాట్లడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న వీఆర్వో, రికార్డు అసిస్టెంట్, అటెండర్ పోస్టుల్లో పదోన్నతుల ద్వారా నియమించాలన్నారు.

వేతన యాతన!

- జీతాల కోసం ఉద్యోగుల ఎదురుచూపులు
- 50శాతం మందికే అందిన వైనం
- ఈఎంఐలు ఎలా చెల్లించాలని ఆవేదన



ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు జీతాల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రతినెల 1వ తేదీనే జీతాలు వస్తాయని ఆశించిన ఉద్యోగులకు నిరాశే ఎదురవుతోంది. నవంబరు నెలకు సంబంధించిన జీతాలను డిసెంబరు 1వ తేదీనే చెల్లించాల్సి ఉంది. శుక్రవారానికి ఐదో తేదీ వచ్చినా 50శాతం మందికి ఇంకా జీతాలు పడని పరిస్థితి ఏర్పడింది. టెక్నాలజీ పెరిగిన తర్వాత ఉద్యోగులు వివిధ అవసరాల కోసం ఈఎంఐల ద్వారా పలు రకాల వస్తువులను కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రతినెల 5వతేదీలోపు ఈఎంఐలు చెల్లించాల్సి ఉంది. ఆలోపు చెల్లింపులు చేయకపోతే పెనాల్టీ పడుతుందని ఉద్యోగులు ఆందోళన చెందుతుందన్నారు. జిల్లా వ్యాప్తంగా సుమారు 50వేల మంది ఉద్యోగులు, 40వేల మందికిపైగా పెన్షన్‌దారులు ఉన్నారు. పెన్షన్‌దారులకు ఒకటి, రెండో తేదీల్లోనే వారి అకౌంట్లలో జమయ్యాయి. సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ట్రెజరీ, పోలీస్, రెవెన్యూశాఖ ఉద్యోగులకు 4వ తేదీలోపు జీతాలు పడ్డాయి. స్త్రీశిశు సంక్షేమశాఖ, సర్వేశాఖ, పంచాయతీరాజ్, సాంఘిక సంక్షేమశాఖ, ఇరిగేషన్, వ్యవసాయ, ఉద్యానవనశాఖ, ప్లానింగ్ శాఖతో పాటు మరో ఐదారు శాఖల ఉద్యోగులకు జీతాలు పడని పరిస్థితి ఏర్పడింది. వీరి జీతాలు ఎప్పుడు పడుతాయో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. ఆయాశాఖల నుంచి జీతాల బిల్లులు సబ్ ట్రెజరీ కార్యాలయాల్లో పాసై రాష్ట్ర ఖజానాశాఖకు చేరుతాయి. అక్కడి నుంచి సీఎఫ్ఎంఎస్ ద్వారా ఉద్యోగుల జీతాలను వారివారి అకౌంట్లలో జమ చేస్తారు. అయితే ఈ జీతాల బిల్లులు ఎప్పుడు పడతాయో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది. అయితే ఉద్యోగులందరికీ ఏడెనిమిది తేదీల్లో తప్పనిసరిగా వారి అకౌంట్లలో పడతాయని చెప్తున్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

● ఎమ్మెల్యే దామచర్ల

పండుగలా పీటీఎంలు
అన్ని పాఠశాలల్లో నిర్వహణ
పాల్గొన్న అధికారులు, ఉపాధ్యాయులు
భారీగా హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యతోనే ప్రతి ఒక్కరికీ విజ్ఞానం, ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. శనివారం ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్ పండుగ వాతావరణంలో జరిగింది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు రాకతో సందడి నెలకొంది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. విద్యావిధానంలో వినూత్నమైన మార్పులతోపాటు, ప్రభుత్వ పాఠశాలలో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యను అందించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ప్రత్యేక దృష్టి సారించారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 65లక్షల మంది తల్లుల బ్యాంకు ఖాతాల్లో తల్లికి వందనం పథకం కింద రూ.87వేల కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. పిల్లలకు తొలి గురువులు తల్లిదండ్రులేనని, వారిని సన్మార్గంలో పెంచి, మంచి భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత వారిపై ఉందని చెప్పారు. అలాగే పాఠశాలల్లో విద్యతో పాటు మానవతా విలువలను నేర్పించడానికి ఉపాధ్యాయులు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. విద్యార్థులు కూడా సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉంటూ, ఎక్కువ సమయం పాఠ్యపుస్తకాలతోపాటు, ఉత్తమ మార్కులపైనే దృష్టి సారించాలని కోరారు. ప్రతి విద్యార్థి కూటమి ప్రభుత్వాన్ని, సీఎం చంద్రబాబును జీవితాంతం గుర్తుంచుకునేలా పాలన చేస్తున్నారని పేర్కొన్నారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్‌లో ఉన్నత స్థాయిలో నిలుస్తారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో చిన్నారులు ఏర్పాటు చేసిన విజ్ఞాన ప్రదర్శనను ఎమ్మెల్యే దామచర్ల తిలకించి వారిని అభినందించారు.



ఒంగోలులోని పీవీఆర్ బాలుర పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్దన్, పక్కన మేయర్ సుజాత

కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

నగరంలోని పాఠశాలల్లో..

ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నడిచే 24 ప్రభుత్వ కార్పొరేషన్ పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లను ఘనంగా నిర్వహించారు. స్థానిక డీఆర్ఆర్ఎం స్కూలులో జరిగిన పీటీఎంలో నగర కమిషనర్ వెంకటేశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులపట్ల తల్లిదండ్రులు కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. టీవీలు, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచాలని, వీలైనంతవరకు పాఠ్యపుస్తకాలే వారికి స్నేహం కావాలని ఆయన కోరారు.


ఉలిచిలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఒంగోలు మండలంలో..

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలంలోని పలు పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉలిచి జడ్పీ హైస్కూలులో జరిగిన సమావేశంలో ఎంపీడీవో రాజశేఖరరావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి శక్తి మేరకు పనిచేస్తానని తెలిపారు. మాజీ సర్పంచ్ చుంచు శేషయ్య తమ గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి గ్రామస్థులు కట్టుబడిఉన్నారని తెలిపారు. అనంతరం స్కూలులో జరిగిన సైన్సు ఎగ్జిబిషన్‌ను అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులు పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం కోటేశ్వరరావు, నాయకులు వై.నరసింహారావు, చుంచు రామాంజనేయులు, చుంచు శింగయ్య, సర్పంచ్ మంచు మురళి పాల్గొన్నారు.

- త్రోవగుంట జడ్పీ హైస్కూలులో జరిగిన పీటీఎంలో హెచ్ఎం వై.వెంకటరావు, ఏడీ-2 వరప్రసాద్, పాఠశాల దాత ఆలపాటి సీతారామయ్య పాల్గొన్నారు

గద్దలగుంటలో..

ఒంగోలు(రూరల్): ఒంగోలు నగరం గద్దలగుంటలోని శ్రీపింగళి కోదండరామయ్య ఓరియంటల్ పాఠశాలలో శుక్రవారం తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా హెచ్ఎం నాగినేని పద్మావతి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. వారి పిల్లల విద్యాభివృద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ శివకుమారి, పీటీ సురేష్‌బాబు పాల్గొన్నారు.


సింగరాయకొండలో విద్యార్థినితో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి : కలెక్టర్

సింగరాయకొండ : విద్యార్థినిలు లక్ష్యాలను నిర్దేశించుకొని వాటి సాధనకు నిరంతరం కృషి చేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. స్థానిక డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నదని చెప్పారు. ప్రభుత్వ పాఠశాల్లో మెరుగైన సౌకర్యాలు, వసతులు కల్పించామన్నారు. విద్యలో పిల్లల పురోగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకోవడానికి ఆత్మీయ సమావేశాలు దోహదం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో లక్ష్మీప్రసన్న, జిల్లా కోఆర్డినేటర్ .జయ పాల్గొన్నారు. మండలంలోని ఊళ్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి టూరిజం కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ పాల్గొన్నారు. పాతసింగరాయకొండ జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన సమావేశానికి రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ వేల్పుల సింగయ్య, కలికివాయి ప్రభుత్వ పాఠశాలలో కార్యక్రమానికి పీబీ చానల్ చైర్మన్ మందలపు గాంధీచౌదరి ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు.


ఊళ్లపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థినులతో డాక్టర్ నూకసాని

చదువు అందరి ఆస్తి : ఎమ్మెల్యే బీఎన్


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

సంతనూతలపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): చదువు అనేది అందరి ఆస్తి అని, ఏ ఒక్కరి సొంతం కాదని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సంతనూతలపాడులోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో శుక్రవారం జరిగిన పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తన తండ్రి బి.దానం ప్రభుత్వ పాఠశాలల్లోనే క్రమశిక్షణతో చదివి ఐఏఎస్ ఆఫీసర్ అయ్యి ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారన్నారు. తనతోపాటు సోదరులని చదివించారని, అందరూ ఉన్నతస్థానంలో ఉన్నారని చెప్పారు. ఇదంతా కేవలం చదువు వల్లే సాధ్యమవుతుందని, అందువల్ల విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. రెసిడెన్షియల్ స్కూల్‌కు రూ.కోట్ల విలువచేసే మూడున్నర ఎకరా స్థలాన్ని ఉచితంగా అందించిన వింగ్ కమాండర్ సూదనగుంట వెంకటప్రసాద్ గారి సతీమణి ఇందిరాదేవికి ఎమ్మెల్యే విజయ్‌కుమార్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. వింగ్ కమాండర్ వెంకటప్రసాద్ విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. అనంతరం ఇందిరాదేవి అందించిన క్రీడా దుస్తులను 30 మంది విద్యార్థులకు అందజేశారు. విద్యార్థులు తయారుచేసిన పలువురు వస్తువులను పరిశీలించి అభినందించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో డీఆర్వో చిన ఓబులేష్, మండలప్రత్యేక అధికారి పి.శ్రీహరి, తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీడీవో సురేష్‌బాబు, ఎంఈవో వెంకారెడ్డి, వైద్యురాలు సుధామణి, రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనంతయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, కుంచాల రాజు, టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకా స్వాములు, నాయకులు బొడ్డపాటి చంద్రశేఖర్, ఆర్.అంకారావు, ఎ.శ్రీనివాసరావు, జడ్పీటీసీ డి.రమణమ్మ, ఎంపీపీ బి.విజయ, సర్పంచ్ డి.నాగమణి, ఉపాధ్యాయులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

పొన్నలూరు మండలంలో..


పొన్నలూరులో మాట్లాడుతున్న కోటిరెడ్డి

పొన్నలూరు: మండలంలోని అన్ని పాఠశాలల్లో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ సుజాత మాట్లాడుతూ విద్యార్థి అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో కీలకమన్నారు. టీడీపీ మండల సీనియర్ నాయకుడు కర్ణ కోటిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు వై.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ యానాది, టీడీపీ మండల నాయకులు మండవ ప్రసాద్, పల్లపోతు రమేష్‌బాబు, మండవ మురళీమోహన్, గుమ్మల్ల వెంకట్రావు, కొమ్మి వెంకట్రావు, ఎస్సై అనూక్, ఎంఈవో రవిచంద్ర, ఏవో రాము, కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్ర పాల్గొన్నారు.

మర్రిపూడి మండలంలో..


మాట్లాడుతున్న సొసైటి అధ్యక్షుడు శ్రీనివాసులు

మర్రిపూడి: విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి, మర్రిపూడి సొసైటీ అధ్యక్షుడు ఎర్రమోతు శ్రీనివాసులు కోరారు. శుక్రవారం స్థానిక జూనియర్ కళాశాలలో నిర్వహించిన మెగా పీటీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల నడవడికపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అల్లూరయ్య పాల్గొన్నారు. కేజీబీవీలో నిర్వహించిన సమావేశానికి ఎంఈవో రంగయ్య, ఎంపీడీవో నాగుర్‌వలి, విద్యాకమిటీ చైర్మన్ ఉప్పు సాయిబాబు తదితరులు హాజరయ్యారు.

కొండపి మండలంలో..



కొండపి జీజేసీలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామాంజనేయులు

కొండపి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాలు (పీటీఎంలు) శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల్లో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొని తమ పిల్లల పురోగతిపై ఉపాధ్యాయులతో చర్చించారు. కొండపిలోని జీజేసీలో ఎంపీడీవో రామాంజనేయులు పాల్గొని విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడారు. ఆత్మీయ సమావేశం లక్ష్యాన్ని అందరూ అర్థం చేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు కళాశాల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొమ్ము సుశీల పాల్గొన్నారు. కొండపిలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి బాలికల తల్లిదండ్రులు భారీగా హాజరయ్యారు. ముప్పవరం జడ్పీస్కూల్‌లో దాతలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని స్కూల్ అభివృద్ధి, వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. వెన్నూరు జడ్పీ స్కూల్‌లో మెగా పీటీఎం కార్యక్రమంలో విద్యార్థుల పేరెంట్స్ భారీగా హాజరయ్యారు. గ్రామానికి చెందిన పారిశ్రామికవేత్త పోతినేని హరిప్రసాద్ అందిస్తున్న సాయంతో స్కూల్‌లో నాణ్యమైన భోజనం నిరంతరం కొనసాగుతున్నదని హెచ్ఎం భారతి తెలిపారు. స్కూల్ అభివృద్ధికి హరిప్రసాద్ అందిస్తున్న సాయాన్ని అందిపుచ్చుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని వెన్నూరు గ్రామ సర్పంచ్ గొర్రెపాటి సంధ్యారాణి ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి నగదు బహుమతులు అందించారు.

చిర్రికూరపాడులో సైకిళ్ల పంపిణీ

జరుగుమల్లి మండలం చిర్రికూరపాడు జడ్పీ స్కూల్ విద్యార్థులకు 20 సైకిళ్లను స్కూల్ ఆవరణలో నిర్వహించిన మెగా పీటీఎం కార్యక్రమంలో దాతలు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన కమ్మ చెంచురామయ్య, వెంకటేశ్వర్లు బ్రదర్స్, పూర్వ విద్యార్థులు, గ్రామస్థులు అందుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.మురళి, ఎంపీపీ బెల్లం విజయనిర్మల, మాజీ ఎంపీపీ బెల్లం సత్యన్నారాయణ పాల్గొన్నారు. జరుగుమల్లి జడ్పీస్కూల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో రమణమూర్తి పాల్గొని విద్యార్థులకు లక్ష్య సందేశం ఇచ్చారు. ఈసందర్భంగా స్కూల్‌కు రూ.30 వేలతో రెండు బీరువాలు బహూకరించిన ఉపాధ్యాయుడు బి.నరసింగరావు, 30 కుర్చీలు స్కూల్‌కు దానమిచ్చిన ఉపాధ్యాయురాలు ఎం.ధనలక్ష్మి, మరో ఉపాధ్యాయుడు సిహెచ్.జయంతిబాబులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం నిర్మల, ఎంఈవో డోలా శ్రీనివాసరావు, స్కూల్ హెచ్ఎం పి.సుధాకర్, జరుగుమల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు నలమోతు వెంకటేశ్వర్లు, గ్రామ టీడీపీ నాయకుడు దగ్గుమాటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతుండటంతో పలు గ్రామాల్లో పేరెంట్స్ తక్కువగా హాజరయ్యారు.


విద్యార్థులకు సైకిళ్లు అందజేసిన దాతలు

విద్యతో పాటు నైతిక విలువలు నేర్చుకోవాలి : జేసీ

కొత్తపట్నం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు విద్యతో పాటు నైతిక విలువలను కూడా నేర్చుకోవాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం కొత్తపట్నం మండలం మోటుమాలలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో జరిగిన మెగా పీటీఎంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులకు మంచి విద్యతో పాటు సంస్కారం అందించాల్సిన బాధ్యత తల్లిదండులదేనని చెప్పారు. చదువు మనిషికి మంచి నడవడిక నేర్పి పౌరుడిగా సమాజంలో ఏ విధంగా మెలగాలో నేర్పుతుందన్నారు. ఇష్టంతో చదివితే ఆశించిన లక్ష్యంవైపు సులభంగా అడుగులు వేయగలుగుతారన్నారు. విద్యార్థినులకు ప్రతి రోజూ వార్త పత్రిలను చదివే అలవాటు చేయాలని సిబ్బందికి సూచించారు. సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని జేసీ ఆకాంక్షించారు. ఎస్‌వో మీరున్నీసా అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ శాంతి, ఎంఈవో పద్మావతి, ఏఎంవో నాగేంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

వైభవంగా అయ్యప్ప పడిపూజ


పూజలో పాల్గొన్న శిద్దా రాఘవరావు కుటుంబసభ్యులు

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరం లాయర్‌పేటలోని మాజీమంత్రి శిద్దా రాఘవరావు ఇంటి వద్ద శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి పడి పూజ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అరటిబోదెలతో అయ్యప్పస్వామి, విఘ్నేశ్వరుడు, సుబ్రహ్మహ్యేశ్వరస్వామి మండపాలను సుందరంగా అలంకరించారు. చీమకుర్తి హరిహర క్షేత్రం నుంచి మేళతాళాలతో తీసుకవచ్చిన ఉత్సవ విగ్రహాలను ఆయా మందిరాలలో ఉంచి వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. మాజీమంత్రి శిద్దా రాఘవరావు, లక్ష్మీపద్మావతి దంపతులు, శిద్దా సుధీర్, మన్నం ఫణికుమార్ కుటుంబసభ్యులు స్వామివార్లకు వస్త్రాలను బహూకరించారు. మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం, పలువురు ప్రముఖులు విచ్చేశారు. కాగా గురుస్వాముల ఆధ్వర్యంలో భజన కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో అయ్యప్ప, శివ, ఆంజనేయ, భవానీ దీక్షాధారులు తరలివచ్చారు. అనంతరం వారికి భిక్ష కార్యక్రమం జరిగింది.

ప్రోత్సాహక నగదు అందజేత

సంతనూతలపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కష్టపడి చదువుకుని సమాజానికి ఆదర్శవంతగా నిలవాలని టీడీపీ నాయకుడు కుంచాల రాజు పేర్కొన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో పదో తరగతిలో ప్రథమస్థానంలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థికి రూ.5వేలు, ద్వితీయస్థానం సాధించిన ఇరువురు విద్యార్థులకు రూ.3వేల చొప్పున, తృతీయస్థానం సాధించిన విద్యార్థికి రూ.2వేలు ప్రోత్సాహక నగదును శుక్రవారం సంతనూతలపాడు ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో జరిగిన పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశంలో అందజేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రూ.30వేల విలువచేసే కంప్యూటర్ ప్రింటర్‌సెట్‌ను తహసీల్దార్ నారాయణరెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనంతయ్య, సర్వేయరు రాజేష్, ఆర్ఐ రవితేజ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు నగదు అందిస్తున్న కుంచాల రాజు, అతిథులు

పేదల అభివృద్ధికి కృషి : బీఎన్

సంతనూతలపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పేద, బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఒంగోలులోని ఎమ్మెల్యే బీఎన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గంలో పలు గ్రామాలకు చెందిన ప్రజలు 25 అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆయా సమస్యలను సంబంధిత శాఖా అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. అనంతరం సీఎం సహాయనిధి కింద 70మంది లబ్ధిదారులకు రూ.44లక్షల51వేల658లను చెక్కుల రూపంలో ఎమ్మెల్యే విజయ్‌కుమార్ అందజేశారు.

మద్దిపాడు: అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు మండలవాసులకు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ శుక్రవారం ఒంగోలులోని తన కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పొగాకు సమాఖ్య చైర్మన్ మండవ జయంత్‌బాబు, టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వరరావు, జనసేన మండల అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, మాజీ సర్పంచ్ గోరంట్ల చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరిలో ప్రీ పీహెచ్‌డీ పరీక్ష నిర్వహణ

ఒంగోలు విద్య, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలోని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రీ పీహెచ్‌డీ పరీక్షను నిర్వహించారు. యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఎస్.నిర్మలమణి, ఉపకులపతి డీవీఆర్.మూర్తి ఆదేశాల మేరకు ఈ పరీక్ష జరిగింది. విశ్వవిద్యాలయంలో 11 డిపార్ట్‌మెంట్స్ ఉండగా 50 మంది పరీక్షకు హాజరయ్యారు. కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ జి.సోమశేఖర్, విశ్వ విద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మలమణి పర్యవేక్షించారు.

ఘనంగా ప్రపంచ మృత్తిక దినోత్సవం

ఒంగోలు విద్య, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ మృత్తిక దినోత్సవం (వరల్డ్ సాయిల్ డే)ను ఘనంగా నిర్వహించారు. వృక్ష, జంతు శాస్త్ర విభాగాలు, యూత్ రెడ్ క్రాస్ సంయుక్తంగా నిర్వహించిన వేడుకలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.యామిని అమ్మాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టిలోని సహజ లక్షణాలను కాపాడుకోవడానికి విరివిరిగా మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి కె.అరుణకుమారి, జంతు శాస్త్ర విభాగాధిపతి వి.శ్రీలక్ష్మిలు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు.

నాణ్యమైన పొగనారును ఎంపిక చేసుకోవాలి


మాట్లాడుతున్న వేల నిర్వహణాధికారి తులసి

ఒంగోలు(రూరల్), డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): రైతులు మంచి దిగుబడుల కోసం నాణ్యమైన పొగనారును ఎంపిక చేసుకోవాలని ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2 నిర్వహణాధికారి జె.తులసి కోరారు. శుక్రవారం పోతవరంలోని ఆడిటోరియం వద్ద పొగాకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు బోర్డు అనుమతికి మించి పొగాకు సాగు చేయవద్దని స్పష్టం చేశారు. పొగాకు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడి ఉంటాయన్నారు. ప్రత్యామ్నాయ పంటలు వైపు మొగ్గు చూపాలని సూచించారు. నారు కొనుగోలు చేసిన రైతులు తప్పనిసరిగా రసీదును పొగాకు వేలంకేంద్రంలో ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ వినోద్, జీపీఐ మేనేజర్ కార్తీక్ పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌టీయూ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపట్నం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆ సంఘం నాయకులు శుక్రవారం రంగాయపాలెం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ నెల 8,9 తేదీల్లో గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బక్కా శ్రీను, కోడూరి కోటేశ్వరరావు, కరుణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రాహ్మణ సంక్షేమ దినోత్సవం


కేక్ కట్ చేస్తున్న మేనేజర్ వెంకటరాధాకృష్ణ, కల్యాణచక్రవర్తి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షేమ సంస్థ, ఏపీ బ్రాహ్మణ కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పడి పదేళ్ళు పూర్తయిన సందర్భంగా వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం ఒంగోలులోని కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో మేనేజర్ కాజా వెంకటరాధాకృష్ణ, సీనియర్ ఎగ్జిక్యూటివ్ కళ్యాణ్‌చక్రవర్తిలు కేక్ కట్ చేసి సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ ద్వారా పేద బ్రాహ్మణులకు ఆర్థిక సహకారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పి.హనుమంతరావు, ఏవీ.సత్యనారాయణమూర్తి, మురళీకృష్ణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు శ్రీకృష్ణుని కథలు వినిపించాలి

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ ఇంట్లోని పిల్లలకు ప్రతిరోజు కృష్ణుని కథలు వినిపించడం ద్వారా వారిలో తల్లిదండ్రుల పట్ల మమకారం, సంఘం పట్ల బాధ్యత ఏర్పడుతుందని ప్రముఖ జ్యోతిష్య, వాస్తుపండితులు అగస్త్యరాజు వెంకటశివసుబ్రహ్మణ్యశర్మ పేర్కొన్నారు. పద్యసారస్వతపరిషత్ ఆధ్వర్యంలో ఒంగోలులోని పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకట శివసుబ్రహ్మణ్యశర్మ శ్రీకృష్ణలీలలపై ప్రసంగించారు. శ్రీకృష్ణుడి అవతారంలోని తాత్విక, వేదాంత రహస్యాలను ఉద్బోధించారు. భాగవత పఠనం సర్వపాప హరణమని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమలో పద్య సారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు చదలవాడ లక్ష్మీనరసింహారావు, జిల్లా అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి, ప్రధాన కార్యదర్శి పంగళి పూర్ణచంద్రరావు, కోశాధికారి అనఘా వెంకట సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న వెలుగు అధికారులు

కొండపి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పశుపోషకులైన డ్వాక్రా మహిళలు పశువులు, ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించిన రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ-వెలుగు ఏపీటీ సీవో బాలకృష్ణరాజు కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం సిబ్బంది, పాల ఉత్పత్తిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ యూనిట్‌ల గ్రౌండింగ్‌కు కృషి చేస్తున్నామన్నారు. పశుసంవర్థక శాఖ అసిస్టెంట్ సర్జన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పశువులకు దాణా, మినరల్స్ అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గోపీనాథ్, సీసీలు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కొండపి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య భద్రతకు ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 78 మందికి రూ.66లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలపై భారాన్ని తగ్గించేందుకు రూ.25 లక్షల బీమా పథకాన్ని రాష్ట్రంలోని ప్రజలకు త్వరలో ప్రభుత్వం వర్తింపచేయనుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొండపి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కె.ఉప్పలపాడు గ్రామంలో కొత్తగా ఫీడర్ ఎల్‌సీలు ఏర్పాటు చేస్తున్నందున శనివారం కె.ఉప్పలపాడు, చినవెంకన్నపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ పి.శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రెండు గ్రామాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పొగాకు సాగులో మెలకువలు పాటించాలి

మద్దిపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పొగాకు సాగులో రైతులు మెలకువలు పాటించాలని వెల్లంపల్లి వేలం కేంద్రం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ కోరారు. వెల్లంపల్లి వేలం కేంద్రం పరిధిలో వెంకటాపురం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు నాట్లు వేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. అనంతరం రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్ బాలిక కిడ్నాప్‌నకు యత్నం

ఒంగోలు క్రైం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికను కిడ్నాప్ చేసిన యువకుడిను ఆమె తల్లిదండ్రులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. ఈ సంఘటన ఒంగోలులో జరిగింది. శుక్రవారం సాయత్రం స్థానిక వడ్డిపాలెంలో మైనర్ బాలిక ఇంట్లో తల్లిదండ్రులపై అలిగి బయటకు వచ్చింది. అదేకాలనీకి చెందిన కుంచాల అజయ్ పూటుగా మద్యం సేవించి బాలికను బలవతంగా తన మోటార్‌సైకిల్ ఎక్కించుకుని తీసుకెళుతుండగా ఆమె తల్లిదండ్రులు గమనించి వెంటపడ్డారు. ఎట్టకేలకు తమ కుమార్తెను కాపాడుకున్నారు. వెంటనే నిందితుడు అజయ్‌ను ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

నేడు పలు ప్రాంతాలలో విద్యుత్ సరఫరా కట్

గిద్దలూరు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల కింద అడ్డు వస్తున్న చెట్లను తొలగించే కారణంగా మండలంలోని మోడంపల్లి, మిట్టమీదిపల్లెలలో శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ అధికారి డి.వై.శేషగిరిరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా ఆరాధన

గిద్దలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీకాశినాయన ఆశ్రమంలో శుక్రవారం కాశినాయన ఆరాధన మహోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా చెక్క భజన, కోలాట ప్రదర్శన అలరించింది. అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. గిద్దలూరు ఆర్టీసీ డిపో అధికారులు ప్రత్యేక బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

అన్నా క్యాంటీన్ తనిఖీ

గిద్దలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్నా క్యాంటీన్‌ను మున్సిపల్ కమిషనర్ రమణబాబు తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న అల్పాహార నాణ్యతను పరిశీలించారు.

వైభవంగా గాయత్రీ మహాయజ్ఞం

గిద్దలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గాయత్రీ మాత ఆలయంలో దత్తజయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. రిటైర్డు తెలుగు ప్రొఫెసర్ ఎస్.నారాయణరెడ్డి, రామక్రిష్ణ మిషన్ అధ్యక్షుడు పి.హనుమంతరెడ్డి, సభ్యులు లక్ష్మీప్రసూన, హరనాథ బాబు పాల్గొన్నారు.

అనాథలకు దుప్పట్ల పంపిణీ

గిద్దలూరు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలలో రాత్రివేళల్లో నిద్రిస్తున్న అనాథలకు మానవత సేవా సంస్థ అధ్యక్షుడు శివారెడ్డి, సభ్యులు ఉలన్ దుప్పట్లను పంపిణీ చేశారు. గురువారం అర్ధరాత్రి మానవత సేవాసంస్థ సభ్యులు ఆయా ప్రాంతాలకు వెళ్లి చలిలో ఇబ్బంది పడుతున్న అనాథలకు దుప్పట్లు అందించి ఆదుకున్నారు.

సబ్సిడీపై దాణా అందజేత

రాచర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పశుపోషకులకు 50% సబ్సిడీపై దాణా పంపిణీ చేస్తున్నామని మండల పశువైద్యాధికారి డాక్టర్ దేవిరెడ్డి హరిబాబు చెప్పారు. బస్తా విలువ రూ.1100 కాగా అందులో 50శాతం సబ్సిడీ పోను మిగిలిన సొమ్ము రైతు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రాచర్ల నుంచి ఆరవీటికోట వరకు 160 బస్తాలు, అనుములవీడు పశువైద్యశాల పరిధిలో 40బస్తాల దాణా సిద్ధంగా ఉందని రైతుకు ఒక్క బస్తా మాత్రమే ఇస్తామని చెప్పారు.

టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి



ఓటరు జాబితా అందజేస్తున్న నక్కా శ్రీను

కంభం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గత అసెంబ్లీ ఎన్నికల్లో అర్ధవీడు మండలం నాగులవరం గ్రామం 3, 4, 8, 11, 12 ఎన్నికల బూత్‌లలో టీడీపీకి తక్కువ ఓట్లు వచ్చినందున, అక్కడపార్టీ బలోపేతానికి కృషిచేయాలని పరిశీలకుడు, టీడీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు నక్క శ్రీను తెలిపారు. నియోజకవర్గంలో తక్కువ మెజారిటీ వచ్చిన పోలింగ్ బూత్‌లను శుక్రవారం ఆయన పరిశీలించి నేతలతో సమావేశమయ్యారు. మండల పార్టీ అధ్యక్షుడు బండ్లమూడి అంజనేయులు యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటరెడ్డి పాల్గొన్నారు. ఓటరు జాబితా అందజేశారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

పెద్దదోర్నాల, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పథకాలపై చెంచు గిరిజనులు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో ప్రసూనదేవి చెప్పారు. స్థానిక వెలుగు కార్యాలయంలో ఆర్‌హెడ్స్ సంస్థ ఆధ్వర్యంలో చెంచు గిరిజన యువతకు ప్రభుత్వ పథకాలపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి కరుణాకర్, సిబ్బంది ప్రసాద్, కోటేశ్వరరావు, జాన్, వెంకటేశం పాల్గొన్నారు.

'సీఎం సహాయ నిధి పేదల పాలిట వరం'

మార్కాపురం రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదల పాలిట వరమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సతీమణి వసంతలక్ష్మీ చెప్పారు. మండలంలోని వివిధ గ్రామాలలో అనారోగ్యంతో ప్రైవేటు వైద్యశాలలో వైద్యం చేయించుకున్న వారికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం ఆయా గ్రామాలలో వారి వద్దకు వెళ్లి టీడీపీ నాయకులతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద రిమడుగు, మాల్యవంతునిపాడు, మిట్టమీదిపల్లి, రాజుపాలెం, నికరంపల్లి, కొండేపల్లిలో 8 మందికి రూ.3,44,102 చెక్కులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కె. శ్రీనివాసులు, నాసర్‌రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

ఎన్నికలకు సమాయత్తం కావాలి

గిద్దలూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరగబోయే పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, మున్సిపల్ ఎన్నికలకు సమాయత్తం కావాలని లేబర్ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ పి.వి.శివారెడ్డి బీజేపీ శ్రేణులను కోరారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలో ర్యాలీ నిర్వహించి సాయి ఫంక్షన్ హాలులో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. శివారెడ్డి మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.వి.నారాయణ, నాయకులు ఉదయ్‌శంకర్, శ్రీనివాసరెడ్డి, రమేష్‌రెడ్డి, ఖాదర్‌వలి, బాదుల్లా పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులకు శిక్షణ తరగతులు

మార్కాపురం రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో శుక్రవారం డివిజన్ లెవల్‌లో ప్రజాప్రతినిధులకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీడీవో బాలు నాయక్, ఎంపీడీవో బాలచెన్నయ్యలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామాలలో చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

జగదాంబకు ప్రత్యేక పూజలు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం పట్టణంలోని జగదాంబ సమేత మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబకు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఆంజనేయ శర్మ, వరుణ్ తేజ శర్మలు స్వామి అమ్మవార్లకు అభిషేకాలు అలంకరణ, విశేష పూజలు నిర్వహించారు. భక్తుల అధిక సంఖ్యలో హాజరై దర్శించుకుని పూజలు చేశారు. ఈవో ఈదుల చెన్నకేశవ రెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు.

విద్యారంగ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



కొనకనమిట్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యా రంగం, విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి చెప్పారు. పట్టణంలోని జడ్పీ బాలుర బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పీటీఎం నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ విద్యార్థులు నైతిక విలువలు కలిగిన విద్యను అభ్యసించాలన్నారు. విద్యాశాఖ మంత్రి లోకేష్ ఆలోచన మేరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం కబడ్డీ పోటీలో జాతీయ స్థాయికి ఎంపికైన బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు బూట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర స్థాయి పోటీలో ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి, ఎంఈవోలు రాందాస్ నాయక్, శర్వాణీ, బాలుర ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ ఏడుకొండలు, వైస్ చైర్మన్ షేక్ ముంతాజ్‌బేగం, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత టీఎన్ జగన్నాథ్, బాలికల ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ పఠాన్ నాగూర్‌ఖాన్, వైస్ చైర్మన్ అంజలీ, పండిత పరిషత్ రాష్ట్ర కార్యదర్శి రవిచంద్ర పాల్గొన్నారు.

కొనకనమిట్లలో...

కొనకనమిట్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల బంగారు భవిష్యత్‌ను కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. మండలంలోని గొట్లగట్టు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగాపేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ ఈఏడాది నుంచి నియోజకవర్గంలో 550 మార్కులకు పైగా నిష్పత్తి ప్రకారం ఏస్కూల్ విద్యార్థులు సాధిస్తారో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయులకు తన సొంత నిధులు లక్ష రూపాయలు బహుమతిగా అందిస్తానని ప్రకటించారు. అదేవిధంగా మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.25, రూ.15, రూ.10 వేలను అందిస్తానని చెప్పారు. ఈకార్యక్రమంలో నేత మోరబోయిన బాబురావు, పొదిలి ఏఎంసీ చైర్మన్ డాక్టర్ ఇమామ్‌సాహెబ్, మార్కాపురం డిప్యూటీ డీఈవో శ్రీనివాసులు, సర్పంచ్ పెరికే సుఖ్‌దేవ్, తహసీల్దార్ సురేష్, ఎంపీడీవో ఈశ్వరమ్మ, ఎంఈవోలు డాంగేషరీఫ్, బరిగే నరసింహారావు, చినారికట్ల సొసైటీ అధ్యక్షులు సానికొమ్ము వెంకటేశ్వరెడ్డి, నాయకులు పరిటాల సుబ్బయ్య, వెంకటేశ్వర్లు, చేకూరి చెన్నకేశవులు, బొంతయ్య పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అందరూ తోడ్పడాలి

పెద్దదోర్నాల, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు కూడా తోడ్పాటు ఇవ్వాలని తహసీల్దారు అశోక్ కుమార్ రెడ్డి చెప్పారు.స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఎంఈవో మస్తాన్‌నాయక్, టీడీపీ మండల అధ్యక్షుడు షేక్ మాబు పాల్గొన్నారు.

కొమరోలులో...

కొమరోలు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంచాల్సిన బాధ్యత ప్రతి ఉపాధ్యాయునిపై ఉందని అమ్మ ఫౌండేషన్ అధ్యక్షుడు, మండల టీడీపీ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ చెప్పారు. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ ఘనంగా నిర్వహించారు.

పరస్పర సహకారంతోనే విద్యాభివృద్ధి

రాచర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతోనే విద్యాభివృద్ధి సాధ్యమని ఎంపీడీవో వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంఈవో గిరిధరశర్మ, రాష్ట్ర గ్రీనింగ్అండ్ బ్యూటిఫికేషన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ యోగానంద్ చెప్పారు. రాచర్ల, జేపీచెరువు ఆదర్శ బాలికల గురుకుల, కేజీబీవీ విద్యాలయాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంతకుమారి పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి భూమి పూజ

రాచర్లలోని పాఠశాలలో దాతల సహకారంతో విద్యార్థులు భోజనానికి, స్టడీకి సంబంధించి షెడ్డు నిర్మాణానికి ప్రిన్సిపల్ పోలా మురళి భూమిపూజ చేశారు. షెడ్డు నిర్మాణానికి ఆయుర్వేద డాక్టర్ నగేష్ ఆకుల రూ.50వేలు అందజేశారని సింగిల్ ఫేజ్ మోటారుకు టీడీపీ నాయకులు శిరిగిరి వెంకటపతి సహకరించగా, సీసీ కెమెరాలు ఏర్పాటుకు మండల పార్టీ అధ్యక్షుడు కటిక యోగానంద్ సహకరించినట్లు ఆయన తెలిపారు.

కంభం, అర్ధవీడు మండలాల్లో...

కంభం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కంభం, అర్ధవీడు మండలాల్లోని పలుప్రభుత్వపాఠశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్స్ సమావేశాలు ఘనంగాజరిగాయి. తురిమెళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోనీ, ఎంఈవో సత్తార్ పాల్గొన్నారు.

మార్కాపురంలో...

మార్కాపురం రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని డీపీవో వెంకటేశ్వరరావు చెప్పారు. మండలంలోని రాయవరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్ మీటింగ్ 3లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో సుబ్బారావు, ఎంపీడీవో బాలచెన్నయ్య పాల్గొన్నారు.

మార్కాపురం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్ డే మీటింగ్‌లను ఘనంగా నిర్వహించారు. మిట్టమీదిపల్లి మోడల్ స్కూల్‌లో, చింతగుంట్లలో, రాయవరంలోని మహాత్మ జ్యోతిబా పూలే స్కూల్‌లో సమావేశాలు నిర్వహించారు.

తర్లుపాడులో...

తర్లుపాడు, డిసెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తల్లిదండ్రులు ఉపాధ్యాయుల సమావేశం పండుగ వాతావరణంలో జరిగింది. ఈసందర్భంగా కలుజువ్వలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల మాక్ అసెంబ్లీ కార్యక్రమానికి హాజరైన గాయం వర్షితను విద్యార్థుల తలిదండ్రులు, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ కేకే కిషోర్ కుమార్, ఎంఈవోలు దేవరకొండ సుజాత, అచ్యుత సుబ్బారావు, ఎంపీడీవో అన్నమ్మ, వైద్యాధికారి సోనియా పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెంలో...

ఎర్రగొండపాలెం రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో పండుగ వాతావరణంలో పేరెంట్స్ మీటింగ్ నిర్వహించారు. నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పాలుట్ల ఆశ్రమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో డీటీడబ్ల్యూవో వరలక్ష్మి పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలలో ఏటిడబ్ల్యూఓ వెంకటేశ్వర్లు, అంజయ్య పాల్గొన్నారు.

పెద్దారవీడులో...

పెద్దారవీడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని డీపీవో వెంకటేశ్వర్లు చెప్పారు. పెద్దారవీడు కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతికి ఉపాధ్యాయులే కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జాన్ సుందరం, డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాసులు, ఏంఈవోలు పి.శ్రీనివాసులు, ఎస్.సుబ్రమణ్యం, టీడీపీ మండలాధ్యక్షులు మెట్టు శ్రీనివాసుల రెడ్డి, క్లస్టర్ ఇంచార్జి గొట్టం శ్రీనివాసులరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు వెన్నా బోడిరెడ్డి పాల్గొన్నారు

పుల్లలచెరువులో...

పుల్లలచెరువు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : విద్యతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని పుల్లలచెరువు మండల టీడీపీ అధ్యక్షుడు పోట్ల గోవిందు చెప్పారు. మండలంలోని పుల్లలచెరువు, పిడికిటివారిపల్లె జడ్పీ పాఠశాలలో మెగా పేరెంట్ మిటింగ్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో నేతలు పోట్ల గోవిందు, కాకర్ల కోటయ్య,శనగ నారాయణరెడ్డి, పయ్యావుల ప్రసాద్, రెంటపల్లి సుబ్బారెడ్డి, గజ్వేల్లి భాస్కర్, కె కుమార్, మేడికొండ లక్ష్మి నారాయణ, మేడికొండ అనిల్ కుమార్ చౌదరి పాల్గొన్నారు.

విద్యతోపాటు నైతిక విలువలు అవసరం

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



మాక్ అసెంబ్లీలో హోంమంత్రిగా ప్రతిభ కనబరిచిన విద్యార్థి రమ్యశ్రీని అభినందిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో విద్యతోపాటు నైతిక విలువలు అవసరమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ - టీచర్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ విద్యార్థులలో నైపుణ్యం పెంచడానికి, సృజనాత్మకతను వెలికి తీయడానికి ఈ మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రభుత్వం ప్రతి విద్యార్థికీ సంవత్సరానికి రూ.83 వేలు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంపీడీవో సీతారామయ్య, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు, ఎంఈవోలు నాగభూషణ్‌రెడ్డి, అశ్వనీకుమార్, మున్సిపల్ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, సొసైటీ బ్యాంక్ చైర్మన్ దుత్తా బాలీశ్వరయ్య, పాలుగుళ్ళ ప్రతాపరెడ్డి, దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, షానేషావలి పాల్గొన్నారు.

రమ్యశ్రీని అభినందించిన ఎమ్మెల్యే

ఇటీవల అమరావతిలో జరిగిన మాక్ అసెంబ్లీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని రమ్యశ్రీని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అభినందించారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న రమ్యశ్రీ ఇటీవల మాక్ అసెంబ్లీకి ఎంపికై అక్కడ హోంమంత్రిగా అందరి మన్ననలు పొందగా తాజాగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి రమ్యశ్రీని శాలువతో సన్మానించారు. సంజీవరాయునిపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు దాను, ఎస్ఎంసీ చైర్మన్ గుండమయ్యలు విద్యార్థులు తయారు చేసిన ఫొటో ఆల్బమ్, చార్టులు, లైబ్రరీ పుస్తకాలను పరిశీలించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం నాగరాజు పాల్గొన్నారు.

పేదపిల్లలకు ఉన్నత చదువే ఆశయం

టీడీపీ ఇన్చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో పేదవిద్యార్థులు సైతం ఉన్నత చదువులు చదువుకోవాలన్న సదుద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం తల్లికి వందనం కార్యక్రమం అమలు చేస్తోందని నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు చెప్పారు. ఎర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఎరిక్షన్ బాబు మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వం పలు డీఎస్సీల ద్వారా లక్షలాది మంది ఉపాధ్యాయులను నియమించి, మారుమూల గ్రామాల్లో పాఠశాలలు ఏర్పాటు చేసి విద్యావ్యాప్తికి కృషి చేస్తోందన్నారు. ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అనేక సంస్కరణలు చేపట్టి ప్రభుత్వ పాఠశాలలలో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా సౌకర్యాలు పెంచారని చెప్పారు. రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ చైర్మన్ నాదెండ్ల బ్రహ్మంచౌదరి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించి విద్యార్థులకు ప్రభుత్వం అంటే ఏమిటీ, ఎలాపనిచేస్తోందనే అనే అంశాలు తెలుసుకునేలా చేశారని కొనియాడారు. అనంతరం రాష్ట్ర, జిల్లా స్థాయిలో వివిధ ఆటల పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులను అభినందించి బహుమతులు పంపిణీ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎంసీ చైర్మన్ రసూల్‌ఖాన్, ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల టీడీపీ అధ్యక్షుడు చిట్యాల వెంగళరెడ్డి, ఎంఈవో ఆంజనేయులు, స్పెషల్ ఆఫీసర్ పోలిరెడ్డి, ఎంఈవో -2 మల్లునాయక్, హెచ్ఎం ఖాశిం, మాజీ చైర్మన్ గోళ్ళ వీర వెంకటసుబ్బారావు పాల్గొన్నారు. అనంతరం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ఎర్రగొండపాలెంలోని తాగునీటి పథకం ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించారు.



కబడ్డీ పోటీలో కాంస్య పతకం సాధించిన విద్యార్థి నోమన్‌ఖాన్‌ను అభినందిస్తున్న ఇన్చార్జి ఎరిక్షన్‌బాబు, నియోజకవర్గ పరిశీలకులు బ్రహ్మం చౌదరి

మార్కాపురం జిల్లా ప్రదాత చంద్రబాబు

మార్కాపురం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మార్కాపురం జిల్లా ప్రదాత సీఎం చంద్రబాబునాయుడు అని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి చెప్పారు. స్థానిక 30వ వార్డు పరిధిలో విజయాటాకీస్ ప్రాంతంలోని రామాలయం వద్ద శుక్రవారం రాత్రి మార్కాపురం జిల్లా ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా వార్డు పరిధిలో ర్యాలీ నిర్వహించి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే నారాయణరెడ్డి మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా ఎంతో వెనుకబడిన మార్కాపురం ప్రాంతంలోని ప్రజల కష్టాలు జిల్లాతో తీరనున్నాయన్నారు. నాడు పట్టణానికి తాగునీటి స్కీమ్ తీసుకువచ్చి కష్టాలు తీర్చామన్నారు. పట్టణంలోని కోర్టు సెంటర్ నుంచి పూల సుబ్బయ్య కాలనీ, ఆర్టీసీ డిపో నుంచి మార్కెట్ యార్డు వరకు రహదారులు విస్తరించింది టీడీపీ హయాంలోనేనని గుర్తుచేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ప్రజలు ఎన్ని కష్టాలు పడ్డారో మర్చిపోవద్దన్నారు. వచ్చే సంవత్సరం వెలిగొండ ప్రాజెక్టు కూడా పూర్తవుతుందని చెప్పారు. మార్కాపురం అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రజా ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న వైసీపీ నాయకులకు ప్రజలే భవిష్యత్తులో తగిన బుద్ధిచెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్‌ఇబ్రహీంఖాన్, రంగస్వామి, మాజీ అధ్యక్షులు షేక్ మౌలాలి, టీడీపీ నాయకులు కనిగిరి రమణ, సయ్యద్ గఫార్, కౌన్సిలర్ షేక్ చిన్నషెక్షావలి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

జిల్లాగా ప్రకటించినందుకు రుణపడి ఉంటాం

పొదిలి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం ప్రాంతాన్ని ప్రత్యేక జిల్లా చేసినందుకు పొదిలి ప్రాంత వాసులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి రుణపడి ఉంటారని జువ్వలేరు మహిళలు, టీడీపీ నాయకులు చెప్పారు. శుక్రవారం మండలంలోని జువ్వలేరు గ్రామంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నేతలు అంజిరెడ్డి, గునుపూడి భాస్కర్, వరికుంట్ల అనిల్, పొదిలి ఏఎంసీ చైర్మన్ డాక్టర్ ఇమాం సాహెబ్, ఖుద్దూష్, ఆవులూరి యలమంద, శామంతపూడి నాగేశ్వరావు, రసూల్, కాటూరి శ్రీనివాసులు, జ్యోతి మల్లికార్జున్, తానికొండ వెంకట్రావ్, గౌస్, యాసిన్ పాల్గొన్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

అధికారులు లేకుండా గ్రామసభలు.. వాస్తవమే

తర్లుపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నారెడ్డిపల్లి మీర్జాపేట, తర్లుపాడులో ఉపాధిహామీ గ్రామసభలకు అధికారులు హాజరుకాకపోవడంపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన వార్త వాస్తవమేనని ఇన్‌చార్జి ఎంపీడీవో రాఘవరావు అంగీకరించారు. మార్కాపురంలో డీడీవో కార్యాలయంలో ప్రారంభోత్సంలో పాల్గొనేందుకు అధికారులు వెళ్లడంతో ఉపాధిహామీ గ్రామ సభలకు వెళ్లలేకపోయారని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించండి

పెద్దారవీడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇంటి పన్ను వసూళ్లపై దృష్టి సారించాలని డీపీవో వెంకటేశ్వర్లు చెప్పారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం తనను కలిసిన టీడీపీ నాయకులు, అధికారులతో ఆయన సమావేశమయ్యారు. మండలంలోని సచివాలయాలలో పనిచేసే సిబ్బంది పనితీరుపై టీడీపీ మండలాధ్యక్షుడు మెట్టు శ్రీనివాసుల రెడ్డి పలు ఫిర్యాదులు చేశారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సరఫరాపై స్పందించడం లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణకు పెద్దారవీడు మండలానికి కొత్తగా 31 రిక్షాలను కేటాయించామన్నారు.

వర్మీ కంపోస్ట్ ద్వారా సంపద సృష్టి

సంపద తయారీ కేంద్రాలలో వర్మీ కంపోస్టు తయారు చేయడం ద్వారా పంచాయతీలలో సంపద సృష్టించవచ్చని డీపీవో వెంకటేశ్వర్లు చెప్పారు. మండలంలోని పెద్దారవీడు, దేవరాజుగట్టు గ్రామాలలో శుక్రవారం ఆయన పారిశుధ్య పనులను పరిశీలించారు.

తాగునీటి శుభ్రతతో అనారోగ్యం దూరం

డీపీవో వెంకటేశ్వరరావు

మార్కాపురం రూరల్, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): గ్రామాలలో తాగునీటి ట్యాంకులను ఎప్పటికప్పుడు పరిశుభ్రం చేస్తుంటే అనారోగ్యం దరిచేరదని డీపీవో వెంకటేశ్వరరావు చెప్పారు. మండలంలోని రాయవరం గ్రామంలో శుక్రవారం డీపీవో, డీఎల్పీవోలు అధికారులతో కలసి జల సురక్ష మాసం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకును పరిశుభ్రం చేయించి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ ప్రతి 15 రోజులకొకసారి ట్యాంక్‌ను పరిశుభ్రం చేసుకుని క్లోరినేషన్ చేయించుకోవాలని సూచించారు. గ్రామశివారులో ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో సుబ్బారావు, ఎంపీడీవో బాలచెన్నయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ లక్ష్మణనాయక్, డిప్యూటీ ఎంపీడీవో స్వర్ణలత, ఏఈ నాగరాజు, పంచాయతీ సెక్రటరీ పెద్దిరాజు, గ్రామ సర్పంచ్ భాగ్యలక్ష్మీకోటయ్య, టీడీపీ నాయకులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ట్యాంకులు పరిశుభ్రంగా ఉంచాలి

రాచర్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశుభ్రంగా ఉంచాలని గిద్దలూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ నవకిషోర్ చెప్పారు. జల సురక్ష మాసంలో భాగంగా మండలంలోని అనుములవీడు గ్రామంలో ఓవర్ హెడ్ ట్యాంకును శుక్రవారం ఆయన ఎంపీడీవో వెంకట రామిరెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ట్యాంకులన్నింటినీ శుభ్రం చేయించి బ్లీచింగ్ చల్లించాలని, పరిశుభ్రతతో కూడిన నీటిని ప్రజలకు అందించాలన్నారు. డిప్యూటీ ఎంపీడీవో వెంకటేష్, ఎంఈవో గిరిధర శర్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నరేష్ రెడ్డి, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఎల్లయ్య, సర్పంచ్ లతీఫ్ పాల్గొన్నారు.

15 రోజులకొకసారి ట్యాంకులు శుభ్రపరచాలి

త్రిపురాంతకం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నీటి ట్యాంకులను ప్రతి 15 రోజులకొకసారి తప్పనిసరిగా శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలని డీపీవో వెంకటేశ్వరరావు చెప్పారు. సేఫ్ వాటర్ మంత్ కార్యక్రమం నేపథ్యంలో ఆయన త్రిపురాంతకం గ్రామ పంచాయతీలోని తాగునీటి వనరులను పరిశీలించారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్ సహకారంతో ఫీల్డ్ టెస్ట్ కిట్‌ల ద్వారా ప్రజల సమక్షంలో నీటిని పరీక్షించాలని అధికారులకు చెప్పారు. ఎంపీడీవో రాజ్‌కుమార్, డిప్యూటీ ఎంపీడీవో మురళి, పంచాయతీ కార్యదర్శి రామసుబ్బయ్య పాల్గొన్నారు.



పెద్దారవీడులో తాగునీటిట్యాంక్‌ను పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వరరావు



దర్శి పట్టణంలోని పొదిలిరోడ్డులో వాటర్ ట్యాంక్‌ను పరిశీలిస్తున్న టీడీపీ దర్శి ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

జలసంరక్షణ బాధ్యత అందరిది

● టీడీపీ దర్శి ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : జలవనరులను పరిరక్షించుకోవాల్సి బాధ్యత అందరిపై ఉందని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. దర్శి పట్టణంలోని పొదిలి రోడ్డులో జలసంరక్షణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సాయంత్రం వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు స్వచ్ఛమైన మంచినీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజలు ఎంతో విలువైన నీటిని వృథా చేయకుండా అవసరాల మేరకు వినియోగించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, కమిషనర్ వై.మహేశ్వరరావు, ఏఈ శ్రీరామ్‌మూర్తి, టీడీపీ దర్శి మండల అధ్యక్షుడు మారెళ్ల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు పుల్లలచెరువు చిన్నా, డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కె. వెలుగొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కాశినాయనకు పూజలు చేస్తున్న భక్తులు

వైభవంగా కాశినాయన ఆరాధన వేడుకలు

దొనకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక నాల్గురోడ్ల కూడలిలోని ఆనంద ఆశ్రమంలో ధర్మకర్త కాకర్ల భైరవానందస్వామి పర్యవేక్షణలో ఆశ్రమంలో వేంచేసిన భగవాన్ కాశినాయన 30వ ఆరాధన వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాశినాయనను ప్రత్యేకంగా అలంకరించి ఉదయం 6 గంటల నుంచి పంచామృత అభిషేకాలు, అష్టోత్తర శతనామావలి, సహస్రనామార్చనలు చేసి మహానైవేద్యం సమర్పించి స్వామి వారికి సామూహిక హారతులిచ్చారు. ఇండ్లచెరువు గ్రామానికి చెందిన సాధం పెద్దరామయ్య కుటుంబ సభ్యులు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ధర్మకర్త స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.



నాయుడుపాలెంలో రక్షిత మంచి నీటి పథకాన్ని పరిశీలిస్తున్న మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు, ఇతర అధికారులు

ప్రజలకు సురక్షిత తాగునీరు

● మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు

ముండ్లమూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రజలకు రక్షిత మంచి నీటి పథకాల ద్వారా సురక్షితమైన నీరు అందిస్తున్నామని మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని నాయుడుపాలెంలో ఎస్‌పీపీ రక్షిత మంచి నీటి ట్యాంక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్యాంకును వారానికి ఒకసారి శుభ్రం చేసి సురక్షితమైన నీటిని అందించటం ద్వారా ప్రజలకు ఆరోగ్య వంతమైన జీవితం అందించిన వారమవుతామన్నారు. ట్యాంక్ చుట్టు పక్కల పరిసరాలను కూడా శుభ్ర పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం. శ్రీదేవి, తహసీల్దార్ ఎల్. లక్ష్మీనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో ఆర్. జనార్దన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఏ హనుమాన్ బాబు, సర్పంచ్ గొర్రె శ్రీదేవి, రాముడు, పంచాయతీ కార్యదర్శి వేణు తదితరులు ఉన్నారు.

పీఆర్సీని వెంటనే అమలు చేయాలి

సీఎస్‌పురం(పామూరు) డిసెంబరు, 5 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీని వెంటనే అమలు చేయాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వి. సాంబశివరావు అన్నారు. మండలంలోని నాగులారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ సబ్‌కమిటీ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులకు సంబంధించి పలు సమస్యలపై చర్చించారు. మండల ప్రధాన కార్యదర్శి షేక్ పాదుషా, కె. వెంకటేశ్వర్లు, జి. శ్రీనివాసరాజు, జె. వెంకట్రావు, ఐ. కొండయ్యలు ఉన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

పామూరు, డిసెంబరు, 5 (ఆంధ్రజ్యోతి) : కస్తూర్బా పాఠశాలలో 10 తరగతి చదువుతున్న విద్యార్థులకు స్వయంకృషి సేవా సంస్థ అధ్యక్షుడు షేక్ నాయబ్‌రసూల్ ఆధ్వర్యంలో షేక్ హర్షద్ ఆర్థిక సహకారంతో స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం అందజేసారు. ప్రిన్సిపాల్ కటకం సృజన, మెంటా నరసింహారావు, షేక్ నన్నే, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్త రాజీనామా

మండలంలోని తూర్పుకట్టకిందపల్లిలోని కరెళ్లపాడు అంగన్‌వాడీ కార్యకర్త అరుణ అనారోగ్య కారణాలతో రాజీనామా చేశారు. ఈ మేరకు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారినికి లేఖ పంపించారు. తన రాజీనామ లేఖను ఆమోదించాలని అందులో కోరారు.

ఆడపిల్లల చదువులకు ప్రభుత్వం పెద్దపీట

సీఎస్‌పురం(పామూరు) : ప్రభుత్వం ఆడపిల్లల విద్యకు పెద్ద పీట వేస్తుందని ప్రిన్సిపాల్ షేక్ రేష్మా తెలిపారు. సీఎస్‌పురం లోని కేజీబీవీ పాఠశాలలో శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు పాల్గొన్నారు. అనంతరం ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

విద్యార్థుల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

తల్లిదండ్రుల సమావేశంలో ఎమ్మెల్యే ఉగ్ర

వీసీపల్లి,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి):విద్యార్థినీవిద్యార్థుల సమగ్రాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం విద్యారంగంలో ఎన్నో సంస్కరణలను అమలు చేస్తోందని కనిగిరి శాసనసభ్యుడు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు.స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్‌డే సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం పాఠశాలలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ లెర్నింగ్, నైపుణ్యాల అభివృద్ధి వంటి కార్యక్రమాలను ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిందన్నారు. విద్యాభివృద్ధిలో భాగంగా విద్యార్థినీ విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరిచేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సరికొత్త మార్పులు తీసుకొచ్చారని ఆయన అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మెరుగైన ఫలితాలు ఇస్తాయని ఆయన అన్నారు.అనంతరం ఎంఈవో ఆర్.శ్రీనివాసులు ఉచితంగా అందజేసిన స్టడీ మెటీరియల్స్‌ను 10వ తరగతి విద్యార్థులకు ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, తహసీల్దార్ సీహెచ్.ఉష, ఎంపీడీవో కృష్ణారావు, ఎంఈవోలు జి.సంజీవి, ఆర్.శ్రీనివాసులు, హెచ్‌ఎం సుబ్బరామయ్య, ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లేశ్వరి, ఎస్సై జి.కోటయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు స్టడీచైర్స్ పంపిణీ



వీసీపల్లిలో విద్యార్థినులకు స్టడీచైర్స్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర, దాత శ్రీనివాసులు

వీసీపల్లి గ్రామానికి చెందిన వ్యాపారవేత్త గోగడ శ్రీనివాసులు స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినీ విద్యార్థులకు 100 స్టడీ చైర్స్, ప్యాడ్‌లను శుక్రవారం పాఠశాలలో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా గోగడ శ్రీనివాసులును ఎమ్మెల్యే ఉగ్ర అభినందించారు.అనంతరం ఉగ్రను శ్రీనివాసులు శాలువాతో సత్కరించారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికే..

పామూరు : ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికే రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా మెగా పేరెంట్ సమావేశాలు ఏర్పాటు చేస్తుందని తహసీల్దార్ ఆర్. వాసుదేవరావు తెలిపారు. పామూరు కేజీబీవీ పాఠశాలలో విద్యార్థి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పామూరు ఉన్నత పాఠశాలలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య, ఎంఈవో పి. కోటిరెడ్డి, విద్యాకమిటీ చైర్మన్ గుత్తి కొండలరావు తదితరులు పాల్గొన్నారు. సీఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం షేక్ ఖాదరున్నీసా బేగం అధ్యక్షతన మెగా పేరెంట్ కమిటీ సమావేశం బడిపిలుపు- వికసిత ఆంధ్రకు మలుపు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు బొబ్బూరి రమేష్, సింగిల్‌విండో చైర్మన్ సీహెచ్ వెంకట్‌రెడ్డి, ఎస్‌ఎంసీ చైర్మన్ హుసేన్‌బి, ఎన్‌సీ మాల కొండయ్య, మన్నేపల్లి శ్రీనివాసులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సీఎస్‌పురం పేరెంట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న టీడీపీ అధ్యక్షుడు రమేష్



కేజీబీవీ పాఠశాలలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ దర్శి ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

విద్యతోనే సమాజాభివృద్ధి

● టీడీపీ దర్శి ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

ముండ్లమూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని టీడీపీ దర్శి నియోజక వర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. శుక్రవారం ముండ్లమూరులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యా వ్యవస్థ బాగుంటేనే రాష్ట్రం బాగుంటుందని, తద్వారా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో పలువురు విద్యార్థులు చెప్పిన సందేశాలు డాక్టర్ లక్ష్మిని ఆకట్టుకున్నాయి. ఈ ఆత్మీయ సమావేశానికి కేజీబీవీ ప్రత్యేక అధికారి ఆవుల సునీత అధ్యక్షత వహించారు. అనంతరం విద్యార్థినులు తల్లిదండ్రులతో కలసి భోజనం చేశారు. ముందుగా డాక్టర్ లక్ష్మికి ఉపాధ్యాయులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక కలెక్టర్ ఎస్. జాన్సన్, మండల స్పెషల్ అధికారి శ్రీనివాసులు, ఎంపీడీవో ఎం. శ్రీదేవి, తహసీల్దార్ ఎల్. లక్ష్మీనారాయణ, ఎంఈవో షేక్ కాలేషావలి, సీఐ వై. రామారావు, ఏఎంసీ చైర్మన్ దారం నాగవేణి సుబ్బారావు, వైస్ చైర్మన్ కోడెగ మస్తాన్‌రావు, టీడీపీ మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సర్పంచ్ నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

దర్శి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత శిఖరాలందుకోవాలని మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎంతో ప్రాముఖ్యత ఇస్తుందన్నారు. కళాశాల ప్రిన్స్‌పాల్ యునాతన్, లెక్చరర్ కోటయ్య, పేరెంట్స్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, అధికారులు పాల్గొన్నారు.

కోలాహలంగా తల్లిదండ్రుల సమావేశాలు

కురిచేడు : మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం శుక్రవారం కురిచేడులో కోలాహలంగా జరిగింది. పాఠశాలల్లో పండుగ వాతావరణం నెలకొన్నది. పాఠశాలల ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశాలలో విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. బాలికల ఉన్నత పాఠశాలలో గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం ఎస్‌ఈ శంకరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మరో అతిథి నుసుం వెంకట నాగిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తమ వంతు కృషిచేస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలలో విద్యార్థుల భోజనానికి అవసరమైన 250 ప్లేట్లు, గ్లాసులను లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు సంస్థ త్వరలో అందిస్తుందని అధ్యక్షుడు ఇందూరి వెంకట నరిసిరెడ్డి హామీ ఇచ్చారు. అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో ఎంఈవో వస్రాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులతో మాట్లాడారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న అంకె భాగ్యలక్ష్మిని ఎంఈవో చదువుల తల్లి అని సంబోధిస్తూ పలు అవార్డులు అందజేశారు. బాలికను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సుబ్బారావు, ఎంఈవో ముఖ్య అతిథులు ఘనంగా సన్మానించారు.



చదువుల తల్లి భాగ్యలక్ష్మికి అవార్డులు అందజేస్తున్న ఎంఈవో, మండల ప్రత్యేకాధికారులు



దొనకొండ గురుకుల పాఠశాలలో ప్రోగ్రెస్ కార్డులను తల్లిదండ్రులకు అందజేస్తున్న తహసీల్దార్ రమాదేవి

పండుగలా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు

దొనకొండ : మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు మండలంలోని అన్నీ పాఠశాలల్లో శుక్రవారం పండుగ వాతావరణాన్ని తలపించేలా ఘనంగా నిర్వహించారు. దొనకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలో జిల్లా ఏపీఐఐసీ జోనల్ మేనేజర్, మండల ప్రత్యేకాధికారి ఎం. మదన్‌మోహన్, ఎంపీడీవో వసంతరావునాయక్, కసూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో తహసీల్దార్ రమాదేవిలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. దొనకొండ జడ్పీ పాఠశాల, బాలికల హాస్టల్లో విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరందించేలా హెచ్‌ఎం రామాంజనేయులు రూ.80వేలు సొంత నిధులతో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ పరిశీలించి హెచ్‌ఎంను అభినందించారు. అనంతరం విద్యార్థుల ప్రగతిని సూచించే ప్రోగ్రెస్‌కార్డులను తల్లిదండ్రులకు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో పాఠశాలల విద్యాకమిటీ చైర్మన్లు, అధికసంఖ్యలో తల్లితండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భావి భారత పౌరులుగా తీర్చిదిద్దాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ రమణారావు

తాళ్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులను ఉత్తమ భావిభారత పౌరులుగా తీర్చిదిద్దటం సమష్టి బాధ్యతని తహసీల్దార్ రమణారావు అన్నారు. స్థానిక వీకే జూనియర్ కళాశాలలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అలాగే కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఆత్మీయసమావేశంలో జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి , మండల ప్రత్యేకాధికారి కుమార్, ఎంపీడీవో అజిత మాట్లాడారు. అలాగే బొద్దికూరపాడు, తూర్పుగంగవరం, నాగంబొట్లపాలెం, లక్కవరం, శివరాంపురం జిల్లా పరిషత్ హైస్కూళ్లలోనూ పండుగ వాతావరణంలో ఆత్మీయ సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవోలు జి.సుబ్బయ్య, ఎల్.సుధాకర్‌రావు, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వేణుగోపాల్,కేజీబీవీ ప్రిన్సిపాల్ సుజిత, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. అందరూ కలిసి సహపంక్తి భోజనం చేశారు.

నేతల మధ్య పోటీతో.. ఊపందుకున్న సేవా కార్యక్రమాలు

చిల్లచెట్లతో నిండిన రహదారులు శుభ్రం

'స్థానిక' ఎన్నికల ముందుచూపుతో కార్యక్రమాలు

దొనకొండ, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): దొనకొండ పంచాయతీలో ఇటీవల కాలంలో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ నాయకుల మధ్య పోటాపోటీగా సేవా కార్యక్రమాలు ఊపందుకున్నాయి. దీంతో చిల్లచెట్లతో మూసుకుపోయి ప్రజలు రాకపోకలు జరుపుకునేందుకు ఇబ్బందికరంగా ఉన్న రహదారులు శుభ్రమవ్వటం ప్రజల్లో చర్చనీయాంశమైంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ కసరత్తు చేస్తుండటంతో పాటు మార్చిలో ఎన్నికల నోటిఫికేషన్ జారీ అవుతుందనే విస్తృత ప్రచారం రాజకీయ పార్టీల నేతల్లో నెలకొంది. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని టీడీపీ శ్రేణులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించినట్లు ఇటీవల సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. దీంతో గ్రామాల్లో అధికార పార్టీ నేతల్లో పంచాయతీ ఎన్నికల సందడి అప్పుడే మొదలైంది. కాగా గ్రామాల్లో సర్పంచ్ పదవికి రిజర్వేషన్ల ప్రక్రియ ఏవిధంగా ఉండబోతోందన్న విషయంలో కొందరు ఆశావాహుల్లో కొంత ఉత్కంఠ నెలకొంది. దొనకొండ మేజర్ పంచాయతీ సర్పంచ్ పదవి ఈ విడత బీసీ సామాజిక వర్గానికి రిజర్వు అయ్యే అవకాశం ఉందనే ప్రచారంతో అధికార పార్టీలో ఆ సామాజికవర్గానికి చెందిన వారు బరిలో నిలిచేందుకు ఉత్సాహం కనబరుస్తూ ముందుకు సాగుతున్నారు. టీడీపీ దర్శి నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మోడి వెంకటేశ్వర్లు, మండల టీడీపీ అధ్యక్షుడు మోడి ఆంజనేయులు, మండల బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బత్తుల బ్రహ్మయ్యలు సర్పంచ్ పదవికి పోటీపడుతూ పంచాయతీ పరిధిలోని వార్డుల్లో కలియతిరుగుతున్నారు. శుభ, అశుభ కార్యక్రమాల్లో పాల్గొంటూ ఓటర్లతో మమేకమవుతున్నారు. ఇటీవల దొనకొండ పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో రహదారులకు ఇరువైపులా దట్టంగా పెరిగిన చిల్లచెట్లను తొలగించి రహదారులను శుభ్రం చేసే కార్యక్రమాలు ముమ్మరంగా చేపడుతున్నారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిల్లో స్టార్స్ ఏర్పాటుకు అవసరమైన సామగ్రి అందిస్తున్నారు. మరోవైపు వైసీపీకి చెందిన బత్తుల వెంకటసుబ్బయ్య సర్పంచ్ బరిలో నిలిచేందుకు ఆశిస్తూ పలు ప్రాంతాల్లో రహదారుల వెంట చిల్లచెట్లు తొలగించే కార్యక్రమం ఇటీవల చేపట్టారు. ఏదిఏమైనా దొనకొండ సర్పంచ్ పదవిని కైవసం చేసుకునేందుకు బీసీ సామాజిక వర్గంలో రోజురోజుకు పెరుగుతున్న పోటీపై ప్రజలు అనేక రకాలుగా చర్చించుకుంటున్నారు. అసలు రిజర్వేషన్ ఏ వర్గాన్ని వరిస్తుందో అనేది సహితం ప్రజల్లో చర్చనీయాంశమైంది.



దొనకొండలో ఇటీవల చిల్లచెట్లు తొలగించటంతో శుభ్రమైన రహదారి



కస్తూర్బాగాంధీ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆర్డీవో

వ్యక్తిత్వ వికాసంతోనే రాణింపు

● ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి

కనిగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు వ్యక్తిత్వ వికాసంతో రాణించాలని ఆర్డీవో కేశవర్ధన్‌రెడ్డి అన్నారు. పట్టణ సమీపంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో ఆర్డీవో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం విద్యాప్రగతి కోసం విద్యార్థులకు అనేక సౌకర్యాలతో పాటు విద్యాసామగ్రిని, ఆర్థిక సహకారాన్ని అందిస్తుందన్నారు. విద్యార్థి ప్రతిభను తల్లిదండ్రులు ఉపాధ్యాయుల నుంచి తెలుసుకునేందుకు సమావేశాలు దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో యూవీ నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్, టీడీపీ నాయకులు కృష్ణారెడ్డి, సైకం మాలకొండారెడ్డి, విద్యార్థినులు పాల్గొన్నారు. అదేవిధంగా మండలంలోని కంచర్లవారిపల్లి హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ సమావేశాలు నిర్వహించారు. పెద్దఎత్తున విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి హాజరయ్యారు.

పక్కా గృహాల నిర్మాణానికి రూ.5లక్షలు ఇవ్వాలి

సీఎస్‌పురం(పామూరు) డిసెంబరు, 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ప్రభుత్వం మంజూరు చేసే కాలనీలకు యూనిట్ ధర (గృహ నిర్మాణానికి) రూ, 5 లక్షల చొప్పున సాయం అందించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఊసా వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ఊసా పర్యటించి లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రభుత్వం అందచేసే రూ. 180 లక్షల ఇల్లు నిర్మించుకోవడం సాధ్యం కాదని, అందువల్ల ఎక్కువ మంది దరఖాస్తులు చేసుకోవడం లేదన్నారు. కేరళ ప్రభుత్వం మాదిరి రాష్ట్రం మాదిరి మన ప్రభుత్వం కూడా గృహనిర్మాణ దారులకు రూ.5 లక్షల సాయం అందించాలని డిమాండ్ చేశారు.

కాటంవారిపల్లెను కురిచేడు పంచాయతీలోనే ఉంచాలి

కురిచేడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కురిచేడు మేజర్ పంచాయతీలో ఉన్న కాటంవారిపల్లె, పేరుంబొట్లపాలెం గ్రామాలను ప్రత్యేక పంచాయతీగా విడగొడతారనే ఊహాగానాలు వినపడుతున్నాయి. దీంతో శుక్రవారం ఆ గ్రామాల ప్రజలు తమ గ్రామాలను కురిచేడు పంచాయతీలోనే ఉంచాలంటూ పంచాయతీ కార్యదర్శి చాంద్‌బీకి వినతి పత్రం అందజేశారు. తమకు ఎంతో కాలంగా ఈ పంచాయతీ వారితో ఉన్న అనుబంధాలను తెంచవద్దంటూ వారు విన్నవించారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి రూపశ్రీ

జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

● న్యాయాధికారి రూపశ్రీ

కనిగిరి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని కనిగిరి జూనియర్ సివిల్‌కోర్టు న్యాయాధికారి రూపశ్రీ అన్నారు. హైకోర్టు ఉత్తర్వుల మేరకు శుక్రవారం కనిగిరి కోర్టు ఆవరణలో పోలీసులు, అధికారులు, మున్సిపల్ అధికారులు, బీఎస్‌ఎన్‌ఎల్ అధికారులు, న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కక్షిదారులు తమ అమూల్యమైన కాలాన్ని, నగదును వృథా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా కేసులను పరిష్కరించుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. వాది, ప్రతివాదులకు లోక్ అదాలత్ యొక్క ఉద్దేశంపై అవగాహన కల్పించాలని సూచించారు. జాతీయలోక్ అదాలత్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా కృషి చేయాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐలు, న్యాయవాదులు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆవుల లారీ బోల్తా

ముండ్లమూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద ఉల్లగల్లు గ్రామంలో శుక్రవారం ఉదయం ఆవుల లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన సైడు కాలువలో పడి పోయింది. దీంతో ఒక ఆవు దూడ మృతి చెందింది. మరో ఆవు లారీ కింద పడి పోవటంతో స్థానికులు హుటాహుటిన ఆవును తాళ్ల సాయంతో బయటకు తీశారు. వివరాల్లోకి వెళితే.. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరు నుంచి మండలంలోని పెద ఉల్లగల్లుకు ఆవుల లారీ వెళ్తోంది. ఆవులు షెడ్డు దగ్గరకు వెళ్లేందుకు డ్రైవర్ సడన్‌గా మలుపు తిప్పటంతో అదుపు చేయలేక పక్కనే గోతిలో పడింది. అనంతరం రెండు గంటల తరువాత ఎక్స్‌కవేటర్‌తో లారీని పైకి తీశారు. దీంతో మిగతా ఆవులకు గాని, యజమానులకు గాని ఎలాంటి గాయాలు కాలేదు. పెద్ద ప్రమాదం తప్పింది.



రోడ్డుపక్కన బోల్తాపడిన ఆవులు తరలిస్తున్న లారీ

పూరిమెట్లలో పూరిపాక దగ్ధం

మండలంలోని పూరిమెట్ల గ్రామానికి చెందిన మర్రెడ్డి నాసరరెడ్డికి చెందిన పాక ప్రమాదవశాత్తు దగ్ధమైన సంఘటన శుక్రవారం మధ్యాహ్నం జరిగింది. నాసరరెడ్డి ఇంటికి ఆనుకొని ఉన్న పాకలో మూడు పొగాకు బేళ్లతో పాటు పలు వస్తువులు దగ్ధమయ్యాయి. సుమారు లక్ష రూపాయల మేర నష్టం వాటిల్లింది. గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారని నాసరరెడ్డి తెలిపారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



పైపులకు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

కురిచేడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని మసీదు బజారులో మంచినీటి పైప్‌లైన్ మరమ్మతులకు గురై చాలాకాలం అయింది. ఆ బజారులో నివసించేవారు పలుమార్లు మరమ్మతులు చేయమని అధికారులను కోరారు. ఎంపీడీవో సత్య హనుమప్రసాద్ శుక్రవారం మంచినీటి పైప్‌లైన్‌కు అవసరం అయిన ప్రదేశాలలో వెల్డింగ్, కప్లింగ్‌లు వేయించారు. దీంతో వారికి మంచినీరు వచ్చే అవకాశాలు ఏర్పడ్డాయి. మసీదు బజారు మహిళలు ఎంపీడీవో సత్య హనుమప్రసాద్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

నేడు తాళ్లూరులో ప్రజాదర్బార్

తాళ్లూరు,డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ దర్శి నియోజవర్గ ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి సారథ్యంలో స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం 10 గంటలకు ప్రజాదర్బార్ జరుగుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావులు శుక్రవారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ప్రజలు ప్రజా దర్బార్‌లో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



గిరిజన ప్రపంచం

ఉద్భవం

- ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు చిన్నారుల ప్రదర్శనలతో ఆవిష్కృతం
- ముగిసిన ఉద్భవ్- 2025 వేడుకలు



6



నాటి నాసిరకం వైన్‌ం మారింది!

- ప్రస్తుతం క్వాలిటీ, బ్రాండ్ల విషయంలో మెరుగ్గా మద్యం దుకాణాలు
- ప్రైవేట్ దుకాణాల్లో పెరిగిన విక్రయాలు, అధునాతన సౌకర్యాలు
- వైసీపీ జమానాలో నాసిరకం మద్యం అమ్మకాలు
- క్యాష్ ఇస్తేనే మద్యం.. డిజిటల్ పేమెంట్లకు నో..
- కావాల్సిన బ్రాండ్లకు బార్లకు వెళ్లాల్సిందే..



6



శ్రీకాంత్‌రెడ్డి | యశ్వంత్ సాయి, వాసు | మహేష్

బీటెక్ విద్యార్థులకు కన్నీటి వీడ్కోలు

- రోడ్డు ప్రమాదంతో నాలుగు కుటుంబాల్లో విషాదం
- పోస్టుమార్టం అనంతరం స్వగ్రామాలకు మృతదేహాలు

వినుకొండ టౌన్, నూజెండ్ల, పిడుగురాళ్ల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీటెక్ చదువుకుంటున్నారు.. కుటుంబానికి ప్రయోజనం చేకూరుస్తారని ఆశించిన తల్లిదండ్రులను విషాదానికి గురిచేస్తూ అశువులు బాశారు. శనివారం ఇరుముడితో శబరిమల యాత్రకు వెళ్లే క్రమంలో మిత్రులందరూ వినుకొండకు బయల్దేరగా ఊహించని రీతిలో వీరు ప్రయాణిస్తున్న కారు కంటైనర్‌ను ఢీకొట్టింది. చిలకలూరిపేట బైపాస్‌లో నాదెండ్ల మండలం గణపవరం వద్ద గురువారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో విజ్ఞాన్ కళాశాలలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులు మృతి చెందగా వారిలో నలుగురు పల్నాడు జిల్లాకు చెందిన వారున్నారు. అయ్యప్పమాల ధరించిన విద్యార్థులు గుంటూరు నుంచి వినుకొండలోని ఆలయానికి కారులో వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో వినుకొండ మండలం శివాపురానికి చెందిన మేరుగు శ్రీకాంత్‌రెడ్డి(21), నూజెండ్ల మండలం మూలకలూరుకు చెందిన యశ్వంత్ సాయి(19), వంగవల్లి వాసు(19), పిడుగురాళ్లకు చెందిన శివరాత్రి మహేష్‌బాబుతో పాటు ప్రకాశం జిల్లా తాళ్లూరు మండలం విఠలాపురానికి చెందిన మెడిగం రామిరెడ్డిలు మృతి చెందిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడిన వినుకొండ మండలం దొండపాడు గ్రామానికి చెందిన మద్దుకూరి కార్తీక్ గుంటూరులో చికిత్స పొందుతున్నాడు. కాగా పోస్టుమార్టం అనంతరం మృతదేహాలను అప్పగించడంతో వారివారి గ్రామాల్లో విద్యార్థులకు కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. విద్యార్థులకు స్నేహితులు, బంధువులు, ఆయా గ్రామాలకు చెందిన వారు కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ ప్రమాదంలో ఆయా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. శ్రీకాంత్‌రెడ్డికి తండ్రి సుబ్బారెడ్డి, తల్లి కృష్ణకుమారి, నాయనమ్మ వెంకాయమ్మ, సోదరుడు గౌతమ్‌రెడ్డి ఉన్నారు. వ్యవసాయంలో ఇంతకాలం తండ్రి పడిన కష్టం ఇక పడనివ్వనంటూ శ్రీకాంత్‌రెడ్డి చెప్పిన మాటలు తలుచుకుంటూ కుటుంబసభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. యశ్వంత్ సాయి తల్లి కుమారి ఏఎన్‌ఎంగా సేవలు అందిస్తున్నారు. వంగవల్లి వెంకటరావు, (మిగతా 6వ పేజీలో)

విద్యార్థుల్లో శక్తిని గుర్తించాలి



- పిల్లల ఆలోచనలు, ప్రవర్తనలోనే భవిష్యత్
- అబ్దుల్‌కలాం స్ఫూర్తితో విద్యార్థులు ఎదగాలి
- మెగా పీటీఎంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు పరిశీలిస్తూ..



విద్యార్థులతో పవన్ కల్యాణ్, పుల్లారావు, కలెక్టర్ తదితరులు

పాఠశాలకు పవన్ వరాలు

శారదా పాఠశాలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ వరాలు ప్రకటించారు. తన సొంత నిధులతో గ్రంథాలయాన్ని అభివృద్ధి చేస్తానని చెప్పారు. పూర్తి స్థాయిలో పుస్తకాలు అందిస్తానని, బీరువాలు ఇస్తానన్నారు. పాఠశాలకు 25 కంప్యూటర్లను విరాళంగా అందజేస్తానని చెప్పారు. ఆట స్థలం కావాలని విద్యార్థిని జాస్మిన్ కోరగా స్పందించిన పవన్ ఆట స్థలం ఏర్పాటు చేయాలని అధికారులను వేదికపైనే ఆదేశించారు. ఈ విషయంలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చొరవ తీసుకోవాలని చెప్పారు. కూటమి, జనసేన నేతలు విద్యార్థుల కోసం ప్రత్యేకంగా గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలని సూచించారు. మొబైల్ లైబ్రరీల ఏర్పాటుపై ఆలోచన చేయాలన్నారు.

చిలకలూరిపేట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అద్భుతమైన శక్తి ఉంటుంది.. దానిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గుర్తించి ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ తెలిపారు. చిలకలూరిపేటలోని శారదా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పేరెంట్ టీచర్స్ మీట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పవన్ విద్యార్థులతో మమేకమయ్యారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. పాఠశాలలో గదులు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌లను పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యా యులతో మాట్లాడారు. అనంతరం జరిగిన (మిగతా 6వ పేజీలో)



తల్లి.. టీచర్ పాత్ర కీలకం

చిన్నప్పుడు మా అమ్మ లైట్ వేయగానే దణ్ణం పెట్టుకునేది. చాలా సార్లు చూశాక ఎందుకమ్మా దణ్ణం పెట్టుకుంటున్నావు అని అడిగాను. ఎడిసన్ కనిపెట్టిన లైట్‌తో మనకు ఈ వెలుగులు.. అందు కని ఆయనకు దణ్ణం పెడుతున్నానని చెప్పింది. శాస్త్రజ్ఞులకు, మనకు మంచి భవిష్యత్ ఇచ్చిన వారికి కృతజ్ఞతగా ఉండాలని చిన్నప్పుడే తల్లి ద్వారా తెలుసుకున్నాను. నాకు చిన్నతనంలో సోషల్ టీచర్ సమాజం, దేశభక్తి గురించి చెప్పారు. ఈ రోజున ఇంత చేయగలుగుతున్నామంటే ఆ టీచర్ చెప్పిన చిన్న పాఠమే కారణం.

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

ప్రజలకు మెరుగైన వైద్యం

కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా కృషి ● సంతమాగులూరులో మంత్రి సత్యకుమార్



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు సత్యకుమార్, గొట్టిపాటి

సంతమాగులూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి సత్యకుమార్‌యాదవ్ తెలిపారు. సంతమాగులూరులో రూ.1.65 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంత్రి గొట్టిపాటి రవికుమార్‌తో కలిసి సత్యకుమార్ శుక్రవారం ప్రారంభించారు. నూతన భవనంలోని సౌకర్యాలు, వైద్య సదుపాయాలను వారు పరిశీలించారు. రూ.43.6 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని ప్రారంభించి, ఉన్నత పాఠశాల విద్యార్థులకు 500 సైకిళ్లను మంత్రులు పంపిణీ చేశారు. అనంతరం పాతమాగులూరు, సంతమాగులూరు గ్రామాల మధ్యలో రూ.30 లక్షలతో నిర్మించిన హిందూ కర్మశాల భవనాన్ని మంత్రులు ప్రారంభించారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు చేవూరి వాసిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి గొట్టిపాటి ప్రసంగించారు. పేదల ఆరోగ్యానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. త్వరలోనే ప్రాసంగలపాడు, ఏల్చూరు, వైదన గ్రామాల్లో కూడా భూ సేకరణ చేసి ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ వైయలమంద, సర్పంచ్ పుచ్చకాయల నాగేశ్వరరావు, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పద్మావతి, డీఎంహెచ్‌వో ఎస్ విజయమ్మ, ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు, డీఈవో పురుషోత్తం, తహసీల్దార్ రవిబాబు, ఎంపీడీవో జ్యోతిర్మయి, ఎంఈవో కోటేశ్వరరావు, డాక్టర్ నిర్మల్‌కుమార్, అట్లా పెద వెంకటరెడ్డి, దుద్దేల గాలియ్య, ఆలూరి శ్రీనివాసరావు, చింతా రామారావు, గడ్డం నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయంగా.. బడి పండుగ

జిల్లా వ్యాప్తంగా ఘనంగా మెగా పీటీఎం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

విద్యార్థులు వారి తల్లిదండ్రుల సందడితో.. విద్యార్థుల ప్రోగ్రెస్ నివేదికలతో ఉపాధ్యాయులు.. స్ఫూర్తిదాయక ప్రసంగాలతో నేతలు, అధికారుల మధ్య బడి పండుగ ఆత్మీయంగా జరిగింది. శుక్రవారం జిల్లావ్యాప్తంగా మెగా పీటీఎం కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. బల్లికురవ మండలం కొప్పెరపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పీటీఎంలో కలెక్టర్ వినోద్‌కుమార్ పాల్గొన్నారు. విద్యార్థుల ఉన్నతిలో తల్లిదండ్రులతో పాటు టీచర్ల పాత్ర కూడా కీలకమని తెలిపారు.



కొప్పెరపాడులో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

విద్యార్థుల ప్రతిభా పాటవాలకు సంబంధించిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను తొలుత తల్లిదండ్రులకు టీచర్లు అందించారు. తర్వాత జరిగిన కార్యక్రమంలో వారి మధ్య అనుసంధానకర్తగా ఉంటూ కలెక్టర్ అన్ని అంశాలను చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థిగా తన అనుభవాలను పిల్లలతో పంచుకున్నారు. పీటీఎం సందర్భంగా సంతమాగులూరులోని ప్రభు త్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంత్రి రవికుమార్, మరో మంత్రి సత్యకుమార్‌తో కలిసి సైకిళ్లు పంపిణీ చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు వీరందరిని ఒకే వేదిక మీదకు తెచ్చి ఎలాంటి సమస్యలున్నా పరిష్కరించుకుని, అంతిమంగా విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఇవ్వడమే పీటీఎం లక్ష్యమని మంత్రి రవికుమార్ తెలిపారు. మార్టూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సమావేశంలో పాల్గొన్నారు. వేమూరు, అమృతలూరు మండలాల పరిధిలో జరిగిన పీటీఎంలో విద్యార్థులతో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మమేకమయ్యారు. చీరాలలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన పీటీఎంలో ఎమ్మెల్యే కొండయ్య పాల్గొన్నారు. బాపట్ల, రేపల్లె నియోజకవర్గాల పరిధిలో పీటీఎం కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహించారు.



సంతమాగులూరులో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేసి వారితో ముచ్చటిస్తున్న మంత్రులు రవికుమార్, సత్యకుమార్

బీపీఎస్‌కు వెనకడుగు

బీపీఎస్ పీనల్ చార్జీలతో పాటు 14 శాతం ఓఎస్‌సీ ఫీజు చెల్లించాలని లైసెన్స్‌డ్ సర్వేయర్లు చెబుతుండటంతో భవన యజమానులు వెనకడుగు వేస్తున్నారు. 150 చదరపు గజాల భవనం ఉదాహరణగా తీసుకొంటే పీనల్ చార్జీలు వచ్చి రూ.1.60 లక్షలకు పైగానే లెక్కిస్తున్నారు. ఇక ఓఎస్‌సీ కింద అక్కడ భూమి విలువ రూ.20 లక్షలు ఉందనుకొంటే దానికి రూ. 2.80 లక్షలు ఒక అంతస్తుకు చెల్లించాల్సి ఉంటుంది. రెండు అంతస్తులు అయితే రెట్టింపు అవుతుంది. ఈ విధంగా చిన్న భవనాన్ని బీపీఎస్ కింద రెగ్యులరైజేషన్ చేసుకోవాలంటేనే దాదాపుగా రూ.5 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఫీజులు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడటంతో ఎవరూ ముందుకు రావడం లేదు.



ప్రతిబంధకంగా ఓఎస్‌సీ ఫీజు

- భూమి విలువలో 14 శాతం అంటున్న నగరపాలక సంస్థ
- భారమవుతున్న పీనల్ ఫీజులు
- చిన్న భవనాలకే రూ.లక్షల్లో చెల్లింపు..

బాపట్ల డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): బిల్డింగ్ పీనలైజేషన్ స్కీమ్(బీపీఎస్)కి గుంటూరు నగరపాలక సంస్థలో స్పందన కరువైంది. ఈ పథకం అమలులోకి వచ్చి దాదాపుగా 20 రోజులు గడిచినప్పటికీ భవన యజమానులు అంతగా ఆసక్తి ప్రదర్శించడం లేదు. ఇందుకు ప్రధాన కారణం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్(ఓఎస్‌సీ) ఫీజు కారణమన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.

కొన్ని సంవత్సరాల తర్వాత ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం బీపీఎస్‌ని గత నెల 12 నుంచి అమలులోకి తీసుకొచ్చింది. బేసిక్ పీనలైజేషన్ చార్జీల కింద 100 చదరపు మీటర్ల వరకు చదరపు మీటర్‌కు రూ.40, 101 నుంచి 300 చదరపు మీటర్ల వరకు రూ.60 పీనల్ చార్జీలను నిర్ణయించింది. 301 నుంచి 500 చదరపు మీటర్ల వరకు బిల్డింగ్ ప్లాన్ డీవియేషన్ 30 శాతం లోపు ఉంటే చదరపు మీటర్‌కు రూ.80, 30 శాతం కంటే ఎక్కువ/ప్లాన్ లేకుండా నిర్మించి ఉంటే రూ. 100 చొప్పున చెల్లించాలి. 501 నుంచి 1000 చదరపు మీటర్ల వరకు భవనాలకు 30 శాతం లోపు డీవియేషన్ ఉంటే చదరపు మీటర్‌కు రూ.100, అంతకంటే ఎక్కువ/ప్లాన్ లేకపోతే రూ.120 చెల్లించాలి. వెయ్యి చదరపు మీటర్ల కంటే ఎక్కువ విస్తీర్ణం కలిగిన భవనాలకు 30 శాతం డీవియేషన్ లోపు ఉంటే రూ.150 చొప్పున, అంతకంటే ఎక్కువ/పూర్తిగా అనధికార నిర్మాణం అయితే రూ. 200 చొప్పున చెల్లించాలి. హాస్టల్స్, సర్వీసు అపార్టుమెంట్‌లు, డార్మిటరీలు, కమర్షియల్, ఇండస్ట్రియల్, (మిగతా 6వ పేజీలో)

వచ్చే నెల 30న సైన్స్ ఎగ్జిబిషన్

- 30 ఏళ్ల అనంతరం గుంటూరు వైద్య కళాశాలలో ఏర్పాటు
- సీఎం చంద్రబాబుచే ప్రారంభం.. రెండు వారాలు నిర్వహణ

గుంటూరు మెడికల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వైద్య రంగంపై విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపేలా గుంటూరు వైద్య కళాశాలలో జనవరి 30న సైన్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దీనిని ప్రారంభిస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి శుక్రవారం తెలిపారు. చివరి సారిగా 1996లో గుంటూరు మెడికల్ కాలేజీలో సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. తిరిగి ముప్పై ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వచ్చే జనవరిలో సైన్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించాలని జీఎంసీ వర్గాలు నిర్ణయించాయి. రెండు వారాల పాటు పాఠశాలలు, కళాశాల విద్యార్థులతో పాటు సాధారణ ప్రజలు ఈ విజ్ఞాన ప్రదర్శనను తిలకించవచ్చు. అనాటమీ, ఫిజియాలజీ, పెథాలజీ, మైక్రోబయాలజీ వంటి నాన్‌క్లినికల్ విభాగాలతో పాటు మానవ శరీర అవయవాల ప్రదర్శన వంటి అంశాలను ప్రదర్శనలో ఉంచుతారు. పలు రకాల శస్త్రచికిత్సల వీడియో ప్రదర్శనలు ఉంటాయి. వర్చువల్ రియాలిటీతో మరికొన్ని విజ్ఞాన ప్రదర్శనలు ఉంటాయి.

విద్యార్థుల్లో శక్తిని గుర్తించాలి

(5వ పేజీ తరువాయి)

సభలో ఆయన ప్రసంగించారు. స్వయం శక్తి తో ఎదిగేలా విద్యార్థుల మనస్సు, ఆలోచనలను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు. వ్యక్తిత్వ వికాసానికి సంబంధించిన పాఠాలు చెప్పగలిగితే ఎంతోమంది అద్భుతమైన వ్యక్తులు వస్తారన్నారు. విద్యార్థుల ఆలోచనలు.. ప్రవర్తన.. వ్యక్తిత్వం రేపటి దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందన్నారు. పీటీఎం విద్యారంగంలో కీలకమైన మార్పని దీని వల్ల విద్యార్థుల్లోని బలాలు.. బలహీనతలు ఏమిటనేదే తల్లిదండ్రులు తెలుసుకోగలరన్నారు. అబ్దుల్‌కలాం లాంటి వారి స్ఫూర్తిగా ప్రతీ విద్యార్థి ఎదగాలన్నారు. సమాజాన్ని కదిలించే శక్తి చదువు ఇస్తుందన్నారు. మానసిక దారుఢ్యం రావాలంటే పుస్తకాలు బాగా చదవాలని విద్యార్థులకు తెలిపారు. అమెరికాలో ఉంటున్న గోరంట్ల వాసు పాఠశాలకు విరాళంగా ఇచ్చిన పరికరాలు విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. సైన్స్ ప్రదర్శన జుబేదా, రిహానా, స్మృతి, రత్నకుమారి, గౌసియా అనే విద్యార్థినులను అభినందించారు.

పవన్‌తో సినిమా తీయాలనుకున్నా : పుల్లారావు

తాను రాజకీయాల్లోకి రాకముందు పవన్ కల్యాణ్‌తో సినిమా తీయాలనుకున్నానని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. పవన్ కోసం చిలకలూరిపేట ప్రజలు ఎంతో కాలంగా ఎదురు చూశారని ప్రస్తుతం వారి కోరిక నెరవేరిందన్నారు. సభలో పంచాయతీరాజ్ కమీషనర్ కృష్ణతేజ, ఇంటర్ బోర్డు డైరెక్టర్ రంజిత్‌బాషా, జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, ప్రధానోపాధ్యాయురాలు రత్నభారతి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణతేజ తాత పేరుతో చౌక్ అద్భుతం

పీటీఎంలో పాల్గొనేందుకు 10 నుంచి 12 ఊర్లు చెప్పారు. చిలకలూరిపేటను ఎంచుకున్నాను. అయితే మా సొంత ఊరు చిలకలూరిపేటకు వస్తున్నారని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ గురువారం రాత్రి తనకు చెప్పారని పవన్‌కల్యాణ్ చెప్పారు. కృష్ణతేజ తాత మైలవరపు గుండయ్య వందల కోట్ల విలువైన స్థలాలను నాడు ప్రజా అవసరాలకు ఇవ్వడం చాలా గొప్పగా ఉందన్నారు. ఆయన పేరుతో మైలవరపు గుండయ్య చౌక్ పేరు చూశానని, గడియార స్తంభం కనిపిస్తే అడిగితే వారు ఏవరో కాదు కృష్ణతేజ తాత అని తెలుసుకున్నానన్నారు. ఒకరి పేరుపై చౌక్ పెట్టారంటే వారెంతో సేవ చేసి ఉండాలన్నారు. తోట రాఘవయ్య తన కూతురు పేరుపై శారద స్కూల్ కోసం ఎకరం స్థలం ఇవ్వడం అభినందనయమన్నారు. గతంలో పెద్దలు విద్యాసంస్థలకు పెద్దఎత్తున స్థలాలు ఇచ్చే వారని, ఇప్పుడు ఉన్న స్థలాలను లాగేసుకుంటున్నారన్నారు.

విద్యార్థులతో మమేకం..

శారదా పాఠశాలలో జరిగిన మెగా పేరెంట్ టీచర్స్ మీట్‌లో పాల్గొన్న పవన్‌కల్యాణ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మమేకమయ్యారు. సైన్స్ ఎగ్జిబిషన్‌లో విద్యార్థుల ఎగ్జిబిట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. క్రీడా సామగ్రి పరిశీలించి బేస్‌బాల్ బ్యాట్‌ను చేతపట్టి పరీక్షించారు. తరగతి గదుల్లో విద్యార్థులతో ముచ్చటించారు. డిజిటల్ బోర్డులను ఆసక్తిగా గమనించగా వాటి పనితీరును ఉపాధ్యాయులు ఆయనకు వివరించారు. లైబ్రరీలో బీరువాలను పరిశీలించి వాటికి సరిపడా పుస్తకాలు లేకపోవడాన్ని గుర్తించారు. పవన్ కల్యాణ్‌కు తొలుత విద్యార్థులు, వారి తల్లిదండ్రులు.. ఉపాధ్యాయులు, కలెక్టర్ కృతికాశుక్లా, డీఈవో చంద్రకళ స్వాగతం పలికారు.

కలెక్టర్‌కు అభినందనలు

హర్యానాకు చెందిన కలెక్టర్ కృతికాశుక్లా తెలుగు మాట్లాడుతున్నారు. ఆమె మాటలు చూస్తే గుంటూరు.. విజయవాడ అనుకున్నాను. ఎక్కడో హర్యానా నుంచి వచ్చి మన మాతృ భాష తెలుగు నేర్చుకుని మాట్లాడుతుంటే సంతోషంగా ఉందంటూ పవన్‌కల్యాణ్ కృతికాశుక్లాను వేదికపైనే ప్రత్యేకంగా అభినందించారు.

బీపీఎస్‌కు వెనకడుగు

(5వ పేజీ తరువాయి)

ఇనిస్టిట్యూషనల్ బిల్డింగ్‌లకు వేర్వేరుగా పీనల్ చార్జీలను ప్రభుత్వం నిర్ణయించింది. అలానే అపార్టుమెంట్‌లు, కాంప్లెక్స్‌లకు కూడా వేర్వేగా చార్జీలు ఉన్నాయి.

160 దరఖాస్తులు

బేసిక్ పీనలైజేషన్ ఛార్జీలు ఆగస్టు 31వ తేదీ నాటికి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం విలువ ప్రకారం చదరపు గజం రూ.50 వేల కంటే ఎక్కువగా ఉంటే 100 శాతం, రూ. 25,001 నుంచి రూ. 50 వేల లోపు ఉంటే 90 శాతం, రూ. 10,001 నుంచి రూ. 25 వేల లోపు ఉంటే 80 శాతం, రూ.5001 నుంచి రూ.10 వేల మధ్యన ఉంటే 70 శాతం, రూ.1001 నుంచి రూ.5 వేల లోపు ఉంటే 60 శాతం, రూ. వెయ్యి లోపు ఉంటే 50 శాతం చెల్లించాలి. ఎవరికైతే భూమి విలువ డాక్యుమెంట్‌లో తక్కువగా ఉంటుందో వారికి కొంత ఉపశమనంగా ఈ చార్జీలు ఉన్నాయి. అయితే ఎటొచ్చి 14 శాతం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్‌ని దీనికి లింకు చేయడంతోనే స్పందన కరువైంది. ఇప్పటి వరకు కేవలం 160 దరఖాస్తులు మాత్రమే అందాయంటే స్పందన ఎంత తక్కువ స్థాయిలో ఉందో కళ్లకు కడుతున్నది. భవనాలు ఈ మధ్యన నిర్మించినవి కావు. ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించి అనుభవిస్తున్నవి. అన్నిరకాల పన్నులు కూడా చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో 14 శాతం ఓపెన్ స్పేస్ కంట్రిబ్యూషన్‌ని తొలగిస్తే స్పందన అనూహ్యంగా పెరిగే అవకాశం ఉన్నట్లుగా లైసెన్స్‌డ్ సర్వేయర్లు చెబుతున్నారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరుతున్నారు.

బీటెక్ విద్యార్థులకు కన్నీటి వీడ్కోలు

(5వ పేజీ తరువాయి)

నాగరాజలకు ఒక్కగానొక్క కుమారుడైన వాసు మృతితో వారు కన్నీటి పర్యంతమవుతున్నారు. మహేష్‌బాబు తండ్రి తాపీమేస్త్రీగా పనులు చేస్తూ కుమారుడు మహేష్‌బాబును ఇంజనీరింగ్ చదవిస్తున్నారు. కాగా తల్లి గృహిణి. మహేష్ మృతితో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు.

ప్రమాదానికి కారణం ఆ కారేనా?

నాదెండ్ల: గణపవరం గ్రామ పరిధిలో కుప్పగంజి వాగు సమీపంలో జరిగిన రోడ్డు ఘోర ప్రమాదానికి ఓ కారు కారణమని తెలుస్తోంది. ఘటనకు సంబంధించి సీసీ పుటేజ్‌లు శుక్రవారం వెలుగుచూశాయి. ముందు వెళ్తున్న ఓ కారు ఆగగా ట్రాక్టర్లను తరలిస్తున్న కంటైనర్ స్లో అవుతున్న సమయంలో విద్యార్థులు ప్రయాణిస్తున్న కారు కంటైనర్‌ను ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదం తర్వాత కంటైనర్ ముందున్న కారు వెళ్లిపోయింది. కాగా ఆ కారు ఎవరిదనే విషయం తెలియాల్సి ఉంది.

పొగాకు రైతు బ్యారన్ల వద్ద మొక్కలు నాటాలి

అద్దంకి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పొగాకు సాగుచేసే ప్రతి రైతు బ్యారన్ వద్ద 10 మొక్కలు చొప్పున నాటి సంరక్షించాలని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి రామకృష్ణ అన్నారు. మండలంలోని వెంకటాపురంలో 100 మొక్కలు పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు పొగాకు రైతులు సహకరించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పాకనాటి అంజిరెడ్డి, బ్రహ్మారెడ్డి, పున్నారెడ్డి పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న వేలం నిర్వహణాధికారి రామకృష్ణ

నేడు మంత్రి రవికుమార్ పర్యటన

అద్దంకి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ శనివారం పలు గ్రామాలలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు. ఉదయం 11 గంటలకు ధర్మవరంలో నిర్వహించే కార్యక్రమాలకు హాజరై అనంతరం అంబడిపూడి, కొప్పెరపాలెం, కొప్పరం లలో జరిగే కార్యక్రమాలకు హాజరుకానున్నారు.

20వ తేదీలోపు ఆక్రమణలు తొలగించాలి

అద్దంకి,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మినీ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో కాలువ కట్టపై తాత్కాలిక నివాసం ఉండే కుటుంబాలు ఈ నెల 20వ తేదీ లోపు స్వచ్ఛంధంగా తొలగించుకోవాలని మున్సిపల్ కమీషనర్ రవీంద్ర తెలిపారు. ఇప్పటికే అద్దంకి కొండ వద్ద ఇళ్ల స్థలాలు ఇచ్చిన నేపథ్యంలో వెంటనే ఖాళీ చేయాలన్నారు. 20 వ తేదీ లోపు తొలగించుకోకపోతే మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తొలగించనునన్నట్లు తెలిపారు.

ప్రమాదభరితంగా రోడ్డు మలుపు

ఆందోళన చెందుతున్న వాహనచోదకులు

పంగులూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదవాడ నుంచి ఇంకొల్లు వైపువెళ్లే ప్రధాన రహదారిలో రోడ్డు మలుపు రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. బూదవాడ - పావులూరు గ్రామాల మధ్య ఎన్ఎస్పీ కాలువ డ్రాపుల మధ్య అర్ధచంద్రాకారంలో నిర్మితమైన ఈ మలుపులో ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించలేక వాహన చోదకులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. మండలంలోని కల్లంవారి పాలెం, చినమల్లవరం, బూదవాడ గ్రామాల నుంచి పలు అవసరాల నిమిత్తం ప్రజలు ద్విచక్ర వాహనాలపై ఇంకొల్లుకు రాకపోకలు సాగిస్తుంటారు. ఒంగోలు నుంచి బూదవాడకు, బూదవాడ వైపుగా చీరాలకు నడిచే ఆర్టీసీ బస్సులతో పాటు స్కూలు బస్సులు, వస్తు రవాణాచేసే ఆటోలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి సమయంలో ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురులో రోడ్డు మలుపు గుర్తించలేక అనేకమంది ప్రమాదాల బారినపడ్డ ఘటనలున్నాయి. సాగర్ కాలువ డ్రాపుల మధ్య ప్రమాదకర రోడ్డు మలుపును సవరించి ప్రమాదాలను నివారించాలని బూదవాడ పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదభరితంగా ఉన్న రహదారి

తూర్పు కొప్పెరపాడులో శిథిలావస్థకు చేరిన సహకార భవనం

పంగులూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు కొప్పెరపాడు గ్రామ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ భవనం శిథిలావస్థకు చేరింది. నాలుగు దశాబ్దాల క్రితం (1982) నిర్మితమైన భవనం పైకప్పు శిథిలమై పెచ్చులురాలడంతో పాటు కొద్దిపాటి వర్షానికి భవనం పైకప్పు నుంచి వర్షపు నీరు గదులను ముంచెత్తుతోంది. దీంతో కార్యకలాపాలు నిర్వహించలేక సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. భవన పొల్లులో ఉండడంతో వర్షపునీరు భవనంలోకి చేరు తోంది. దీంతో ఈ భవనంలో ఎరువుల నిల్వ చేయలేక ఇబ్బందిగా ఉన్న పరిస్థితి నెలకొంది. తూర్పు కొప్పెర పాడు, తక్కెళ్లపాడు, అలవల పాడు గ్రామాల రైతులకు వివిధ రకాల సేవలందించే సహకార సంఘ భవనాన్ని పునర్‌నిర్మించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



శిథిలావస్థకు చేరిన సహకార భవనం

ప్రజల సమస్యలు తెలుసుకొనేందుకే ప్రజాదర్బార్

అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో ప్రజల సమస్యలను తెలుసుకొనేందుకే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండయ్య పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి ఆయన స్వయంగా అర్జీలు స్వీకరించారు. పింఛన్ల సమస్యలను దాదాపుగా పరిష్కరించినట్లు చెప్పారు. కొన్ని సాంకేతిక ఇతర సమస్యల కారణంగా పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. అలాగే నూతన గృహాల మంజూరుకు సంబంధించి ఇప్పటికే పెద్దఎత్తున దరఖాస్తులు అందినట్లు చెప్పారు. ప్రతీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. అయితే వాటికి ప్రాధాన్యతాక్రమంలోనే దృష్టిసారిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి అర్జీలు స్వీకరిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

నాటి నాసిరకం 'వైన్'ం మారింది!

క్వాలిటీ, బ్రాండ్లలో మెరుగ్గా మద్యం దుకాణాలు

గుంటూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాల్లో కాలానుగుణంగా అనేక మార్పులు వస్తున్నాయి. వైసీపీ హయాంలో మద్యం షాపులలో కోరిన బ్రాండ్ దొరికేది కాదు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రస్తుతం ఏ బ్రాండ్ కావాలంటే ఆ బ్రాండ్ మద్యం దొరుకుతుంది. గతంలో కేవలం నగదుకు మాత్రమే అమ్మకాలు జరిగేవి. ఇప్పుడు మద్యం షాపుల వద్ద అన్ని రకాల డిజిటల్ పేమెంట్లు ఉన్నాయి. 2023 సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు మాసాల్లో అప్పటి ప్రభుత్వ దుకాణాల్లో జరిగిన అమ్మకాలకు.. కూటమి ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు త్రైమాసికానికి ప్రైవేటు మద్యం దుకాణాల అమ్మకాలను బేరీజు వేస్తే ఎంతో వ్యత్యాసం ఉంది. 2023లో గుంటూరు జిల్లాలో రూ.251.30 కోట్ల అమ్మకాలు జరగ్గా.. ఈ ఏడాది అదే మూడు నెలల్లో రూ.325.98 కోట్ల అమ్మకాలు జరిగాయి. దీని ప్రకారం అప్పటి కంటే ఇప్పుడు సుమారు రూ.74 కోట్లకు పైగా అమ్మకాలు జరిగాయి. అదే విధంగా పల్నాడు జిల్లాలో 2023లో రూ. 214.90 కోట్ల అమ్మకాలు జరగ్గా, ఈ ఏడాది రూ. 251.30 కోట్ల విక్రయాలు జరిగాయి. సుమారుగా రూ. 36 కోట్లకు పైగా అమ్మకాలు పెరిగాయి. దీనికి ప్రధాన కారణం గతంలో ప్రభుత్వ వైన్ షాపుల నిర్వాహకులతో అప్పటి బార్ యజమానులు కుమ్మక్కయ్యేవారు. ఆ బార్లు ఎక్కువ శాతం వైసీపీ నేతల ఆధ్వర్యంలో ఉండేవి. దీంతో ప్రభుత్వ దుకాణాల్లో మద్యం అమ్మకాలు అంతగా జరిగేవి కాదు. సమయం ప్రకారం షాపులను తెరిచి మూసేసేవారు. అంతే కాకుండా కోరుకున్న మద్యం కూడా దొరికేది కాదు. దీంతో అప్పట్లో మద్యం బాబులంతా బార్ల వైపు చూసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. వైన్స్, బార్లు మొత్తం ప్రైవేట్ పరం చేయడంతో పోటీ పెరిగి మద్యం బాబులకు అన్ని రకాల బ్రాండ్లు విస్తారంగా దొరుకుతున్నాయి.

గిరిజన ప్రపంచం ఉద్భవం

ఘనంగా ముగిసిన ఉద్భవ్- 2025 వేడుకలు

తాడేపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరిజన విద్యార్థుల ఆట పాటలు, వారి సంస్కృతి, సంప్రదాయాల ప్రదర్శనలు మూడు రోజులుగా కనువిందు చేశాయి. అడవి బిడ్డల్లో దాగిన ప్రతిభను ప్రపంచానికి చాటి చెప్పేలా బుధవారం ప్రారంభమైన ఉద్భవ్ 2025 వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. జాతీయస్థాయి ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ (ఇఎంఆర్ఎస్) సాంస్కృతిక ఉత్సవాలు ఏపిలో తొలిసారిగా ఒదుకు కేఎల్ యూనివర్సిటీ వేదికగా నిర్వహించారు. 22 రాష్ట్రాల నుంచి 1647 మంది విద్యార్థులు.. ఏపీలోని 28 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల నుంచి ఎంపికైన 110 మంది తమ ప్రతిభను చాటారు. ఆఖరి రోజు బహుమతి ప్రదానం కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు సంధ్యారాణి, కందుల దుర్గేష్, బాల వీరాంజనేయస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. దేశ నలుమూలల నుంచి విచ్చేసిన గిరిజన విద్యార్థులు తమ రాష్ట్ర ఆచార వ్యవహారాలను ప్రతిబింబిస్తూ నిర్వహించిన ప్రదర్శలు అలరించాయి. తెలంగాణ, ఒడిశా, త్రిపుర విద్యార్థులు అత్యధికంగా బహుమతులు సాధించారు. మొత్తం 49 విభాగాల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఓవరాల్ ఛాంపియన్‌గా తెలంగాణ నిలిచింది. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి మల్లికార్జున నాయక్, ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాసంస్థల సొసైటీ కార్యదర్శి గౌతమి, నెస్ట్ సహాయ కార్యదర్శి బిపిన్ రాటూరి, రంపచోడవరం ఐటీడీఏ పీఓ స్మరణ్‌రాజ్, కేఎల్‌యూ ప్రోవీసీ వెంకటరామ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శింగరకొండలో గిరి ప్రదక్షిణ

అద్దంకి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా శింగరకొండలో శుక్రవారం గిరిప్రదక్షిణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శింగరకొండలోని లక్ష్మీనరశింహస్వామి మెట్ల మార్గం వద్ద ప్రారంభమైన గిరి ప్రదక్షిణ 99 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహం, గోపాలపురం, భవనాసి చెరువు మీదుగా కొండపై లక్ష్మీనరశింహ స్వామి దేవాలయం వరకు సాగింది. లక్ష్మీనరశింహస్వామిని దర్శించుకొని గిరి ప్రదక్షిణ ముగించారు. అనంతరం ప్రసన్నాంజనేయస్వామిని దర్శించుకున్నారు. ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావు, రమా సుందరి, భక్త బృందం పాల్గొన్నారు.



గిరిప్రదక్షణ ప్రారంభిస్తున్న భక్తులు

9న అద్దంకిలో జాబ్‌మేళా



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కమిషనర్

అద్దంకి,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో ఈ నెల 9న మంగళవారం అద్దంకిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర తెలిపారు. జాబ్‌మేళా పోస్టర్ ను శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆవిష్కరించారు. అద్దంకి ప్రాంతంలోని యువత కు ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశ్యంతో జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాస్, మేనేజర్ శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కృషిచేయాలి : ఎంపీడీవో

చినగంజాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు కృషి చేయాలని ఎంపీడీవో కె.ధనలక్ష్మి, సంతరావూరు పీఏసీఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ లక్ష్మిలు అన్నారు. మండల పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలో శుక్రవారం మెగా పీటీఎం3.0ని ఘనంగా నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్.ఎం కె.శ్రీనివాసరెడ్డి, రాజుబంగారుపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆర్ఎస్‌వీ.పోతురాజు, కడవకుదురు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం. కుర్రా రామారావు, సంతరావూరు జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సత్యానందంల అధ్యక్షతన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలను నిర్వహించారు. చినగంజాం జడ్పీ పాఠశాలలో పాఠశాల పూర్వవిద్యార్థుల సంఘం తరపున 3గురు విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేసినట్లు హెచ్ఎం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులలో ప్రతిభ కనపరిచిన వారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు, సంతరావూరు జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు సంతరావూరు పీ.హెచ్‌సీ వైద్యాధికారి కే.కీర్తిసరోజ్ ఆరోగ్య సలహాలు, పోషకాహార విలువలు, రక్తహీనత నివారణ పద్దతులు, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఎస్ఎంసీ చైర్మన్లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆంధ్రకేసరిలో ప్రీ పీహెచ్‌డీ పరీక్ష నిర్వహణ

ఒంగోలు విద్య, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయంలోని రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రీ పీహెచ్‌డీ పరీక్షను నిర్వహించారు. యూనివర్సిటీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ఎస్.నిర్మలమణి, ఉపకులపతి డీవీఆర్.మూర్తి ఆదేశాల మేరకు ఈ పరీక్ష జరిగింది. విశ్వవిద్యాలయంలో 11 డిపార్ట్‌మెంట్స్ ఉండగా 50 మంది పరీక్షకు హాజరయ్యారు. కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ జి.సోమశేఖర్, విశ్వ విద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ నిర్మలమణి పర్యవేక్షించారు.

ఘనంగా ప్రపంచ మృత్తిక దినోత్సవం

ఒంగోలు విద్య, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని దామచర్ల సక్కుబాయమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రపంచ మృత్తిక దినోత్సవం (వరల్డ్ సాయిల్ డే)ను ఘనంగా నిర్వహించారు. వృక్ష, జంతు శాస్త్ర విభాగాలు, యూత్ రెడ్ క్రాస్ సంయుక్తంగా నిర్వహించిన వేడుకలకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.యామిని అమ్మాజీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మట్టిలోని సహజ లక్షణాలను కాపాడుకోవడానికి విరివిరిగా మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో వృక్షశాస్త్ర విభాగాధిపతి కె.అరుణకుమారి, జంతు శాస్త్ర విభాగాధిపతి వి.శ్రీలక్ష్మిలు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మొక్కలు నాటారు.

నాణ్యమైన పొగనారును ఎంపిక చేసుకోవాలి



మాట్లాడుతున్న వేల నిర్వహణాధికారి తులసి

ఒంగోలు(రూరల్), డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): రైతులు మంచి దిగుబడుల కోసం నాణ్యమైన పొగనారును ఎం పిక చేసుకోవాలని ఒంగోలు పొగాకు వేలం కేంద్రం-2 ని ర్వహణాధికారి జె.తులసి కో రారు. శుక్రవారం పోతవరం లోని ఆడిటోరియం వద్ద పొ గాకు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు బోర్డు అనుమతికి మించి పొగాకు సాగు చేయవద్దని స్పష్టం చేశారు. పొగాకు ధరలు అంతర్జాతీయ మార్కెట్‌పై ఆధారపడి ఉంటాయన్నారు. ప్రత్యా మ్నాయ పంటలు వైపు మొగ్గు చూపాలని సూచించారు. నారు కొనుగోలు చేసి న రైతులు తప్పనిసరిగా రసీదును పొగాకు వేలంకేంద్రంలో ఇవ్వాలని చెప్పారు. కార్యక్రమంలో ఐటీసీ మేనేజర్ వినోద్, జీపీఐ మేనేజర్ కార్తీక్ పాల్గొన్నారు.

ఏఐఎఫ్‌టీయూ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కొత్తపట్నం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఏఐఎఫ్‌టీయూ న్యూ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆ సంఘం నాయకులు శుక్రవారం రంగాయపాలెం గ్రామంలో ఆవిష్కరించారు. ఈ నెల 8, 9 తేదీల్లో గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే ఈ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బక్కా శ్రీను, కోడూరి కోటేశ్వరరావు, కరుణ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మేనేజర్ వెంకటరాధాకృష్ణ, కల్యాణచక్రవర్తి

ఘనంగా బ్రాహ్మణ సంక్షేమ దినోత్సవం

ఒంగోలు కలెక్టరేట్, డి సెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సంక్షే మ సంస్థ, ఏపీ బ్రాహ్మణ కో ఆపరేటివ్ క్రిడెట్ సొసైటీ ఏర్పడి పదేళ్ళు పూర్తయిన సందర్భంగా వేడుకలను ఘ నంగా నిర్వహించారు. శుక్ర వారం ఒంగోలులోని కో ఆ పరేటివ్ క్రిడెట్ సొసైటీ కార్యాలయంలో మేనేజర్ కాజా వెంకటరాధాకృష్ణ, సీ నియర్ ఎగ్జిక్యూటివ్ కళ్యాణ్‌చక్రవర్తిలు కేక్ కట్ చేసి సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ ద్వారా పేద బ్రాహ్మణు లకు ఆర్థిక సహకారం అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు పి.హనుమంతరావు, ఏవీ.సత్యనారా యణమూర్తి, మురళీకృష్ణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు శ్రీకృష్ణుని కథలు వినిపించాలి

ఒంగోలు కల్చరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): తమ ఇంట్లోని పిల్లలకు ప్రతిరోజు కృష్ణుని కథలు వినిపించడం ద్వారా వారిలో తల్లిదండ్రుల పట్ల మమకారం, సంఘం పట్ల బాధ్యత ఏర్పడుతుందని ప్రముఖ జ్యోతిష్య, వాస్తుపండితులు అగస్త్యరాజు వెంకటశివసుబ్రహ్మణ్యశర్మ పేర్కొన్నారు. పద్యసారస్వతపరిషత్ ఆధ్వర్యంలో ఒంగోలులోని పరిషత్ కార్యాలయంలో శుక్రవారం శ్రీమద్భాగవత సప్తాహ ప్రవచన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన వెంకట శివసుబ్రహ్మణ్యశర్మ శ్రీకృష్ణలీలలపై ప్రసంగించారు. శ్రీకృష్ణుడి అవతారంలోని తాత్విక, వేదాంత రహస్యాలను ఉద్బోధించారు. భాగవత పఠనం సర్వపాప హరణమని పేర్కొన్నారు. అనంతరం నిర్వాహకులు ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమలో పద్య సారస్వత పరిషత్ జాతీయ అధ్యక్షుడు చదలవాడ లక్ష్మీనరసింహారావు, జిల్లా అధ్యక్షుడు మాగంటి శ్రీరామమూర్తి, ప్రధాన కార్యదర్శి పంగళి పూర్ణచంద్రరావు, కోశాధికారి అనఘా వెంకట సుబ్బారావు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

కొండపి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పశుపోషకులైన డ్వాక్రా మహిళలు పశువులు, ప్రాసెసింగ్ యూనిట్లకు సంబంధించిన రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ-వెలుగు ఏపీటీ సీవో బాలకృష్ణరాజు కోరారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం సిబ్బంది, పాల ఉత్పత్తిదారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీఎం సుబ్బారావు మాట్లాడుతూ పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ యూనిట్‌ల గ్రౌండింగ్‌కు కృషి చేస్తున్నామన్నారు. పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పశువులకు దాణా, మినరల్స్ అందించడం ద్వారా పాల ఉత్పత్తి పెంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం గోపీనాథ్, సీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెలుగు అధికారులు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కొండపి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్య భద్రతకు ప్రజాప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన 78 మందికి రూ.66లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదలపై భారాన్ని తగ్గించేందుకు రూ.25 లక్షల బీమా పథకాన్ని రాష్ట్రంలోని ప్రజలకు త్వరలో ప్రభుత్వం వర్తింపచేయనుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

పొగాకు సాగులో మెలకువలు పాటించాలి



మొక్కలను పంపిణీ చేస్తున్న నిర్వహణాధికారి రామకృష్ణ

మద్దిపాడు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పొగాకు సాగులో రైతులు మెలకువలు పాటించాలని వెల్లంపల్లి వేలం కేంద్రం నిర్వహణాధికారి కోవి రామకృష్ణ కోరారు. వెల్లంపల్లి వేలం కేంద్రం పరిధిలో వెంకటాపురం గ్రామంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతతూ పొగాకు నాట్లు వేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. సేంద్రీయ ఎరువులతో మొక్కల ఎదుగుదల బాగుంటుందని చెప్పారు. అనంతరం రైతులకు మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

అవీ..ఇవీ..

రూ.139 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు

● ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు

పంగులూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జలజీవన్‌మిషన్ ద్వారా 338 పనులకు రూ.139 కోట్ల నిదులు మంజూరయ్యాయని ఆర్ డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు తెలిపారు. పంగులూరులో శుక్రవారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. నిధులు మంజూరైన పనులలో 42చోట్ల పనులు ప్రారంభించాల్సి ఉందన్నారు. స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా సామాజిక మరుగుదొడ్లు (సచివాలయాల వద్ద) 398 మంజూరయినట్లు తెలిపారు. వీటిని 2026 మార్చిలోగా పూర్తిచేయడం జరుగుతుందన్నారు. 344 సామూహిక మరుగుదొడ్లు మంజూరు కాగా వీటిలో 209 నిర్మాణాలు పూర్తయ్యాయని, 135 నిర్మాణ దశలో ఉన్నాయని అనంతరాజు తెలిపారు. రైతుసేవాకేంద్రాలు, వైద్యశాలలు, బస్టాండ్లు, సామాజికభవనాలు, దేవాలయాలవద్ద వీటిని నిర్మిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 265 గ్రామాలున్నాయని వీటిలో 176 గ్రామాలను ప్రభుత్వం ఓడీఎస్ గ్రామాలుగా ప్రకటించి అన్ని సౌకర్యాలను కల్పించినట్లు తెలిపారు. గ్రామాలలో ఆర్వో ప్లాంట్లను నిర్మించుకోవాలంటే పంచాయతీ అనుమతి తీసుకోవాలని, వాటిని పర్యవేక్షించే బాధ్యత ఇంజనీరింగ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపారాణి పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా అంజనాదేవీ బాధ్యతలు



అంజనాదేవీ

బల్లికురవ, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): బల్లికురవ మండలంలో గ్రామ సచివాలయాల పర్యవేక్షణకు ప్రభుత్వం నియమించిన డిప్యూటీ ఎంపీడీవో పి.అంజనాదేవీ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండల పరిషత్ కార్యాలయంలో సీనియర్ సహాయకురాలిగా పనిచేస్తున్న అంజనాదేవీ పదోన్నతిలో భాగంగా బల్లికురవ మండల పరిషత్‌కు డిప్యూటీ ఎంపీడీవోగా నియమితులయ్యారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన అంజనాదేవీ ఎంపీడీవో కుసుమకుమారిని కలిసి అనంతరం గ్రామ సచివాలయాల బలోపేతంపై పలువురు సిబ్బందితో సమీక్షించారు.

కొమ్మినేనివారిపాలెం సొసైటీ ఆధ్వర్యంలో కళాజాత



డిజిటల్ లావాదేవీలపై అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

బల్లికురవ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఆదేశాల మేరకు మండలంలోని కొమ్మినేనివారిపాలెం సొసైటీ కార్యాలయం వద్ద శుక్రవారం ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ లావాదేవీలపై నాబార్డు వారి సౌజన్యంతో రైతులకు కళాజాత బృందం బుర్ర కధ రూపంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రైతులు సహకార బ్యాంకులో ఖాతాలు కలిగి ఉంటే వారికి ఎన్నో రకాల ఉపయెగాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు కొమ్మాలపాటి రామారావు, సీఈవో కాజారావు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రక్తదానం



రక్తదానం చేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

అద్దంకిటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో శుక్రవారం రక్తదానం చేశారు. దామావారిపాలేనికి చెందిన ఆకుల వెంకటసుబ్బమ్మకు అత్యవసరంగా రక్తం అవసరం కావడంతో రోటరీ బ్లడ్ బ్యాంక్ ఛైర్మన్, శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం పాలక మండలి అధ్యక్షుడు చుండూరి మురళి సుధాకరరావు రక్తదానం చేశారు. రోటరీ క్లబ్ అధ్వర్యంలో ఇది 457వ రక్తదానం అని మురళి సుధాకరరావు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి అలహరి హరి ప్రసాద్, మాజీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య పాల్గొన్నారు.

రైలు ప్రమాదంలో వ్యక్తి మృతి

● పట్టాలు దాటుతుండగా ప్రమాదం

కొత్తపాలెం(చీరాల), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైలు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన ఘటన శుక్రవారం స్థానిక హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో చోటుచేసుకొంది. చోటుచేసుకొంది. అందిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొత్తపాలెంకు చెందిన ఓ వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీ కొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

పొదుపు రుణం నిలిపివేయడంపై ఫిర్యాదు

బల్లికురవ,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘానికి మంజూరైన రుణాన్ని పంట రుణానికి జమ చేస్తామని మేనేజర్ తమను అగౌరవ పరిచారని కొమ్మినేనివారిపాలెంకు చెందిన స్నేహ సుధ మహిళ మండలి గ్రూపు సభ్యులు శుక్రవారం బ్యాంకు ఉన్నతాధికారులకు ప్రభుత్వ వాట్సాప్ గవర్నెన్స్‌కు ఫిర్యాదు చేశారు., కొమ్మినేనివారిపాలెం గ్రామంలోని పొదుపు సంఘానికి పొదుపు రుణం వలపర్ల స్టేట్ బ్యాంకులో మంజూరైంది. ఈ రుణం మంజురు చేసే సమయంలో పొదుపు సంఘానికి చెందిన ఒక మహిళపై పంటరుణం బకాయి ఉంది. ఈ రుణం చెల్లించే వరకు పొదుపు రుణం ఇవ్వడం లేదని పొదుపు మహిళలు బ్యాంకు మేనేజర్‌పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అదేమంటే తమను అగౌరవ పరిచి మాట్లాడారని, తమకు ఖాతా రద్దు చేయాలని కోరిన రద్దు చేయడం లేదని ఈ సందర్భంగా మహిళలు ఫిర్యాదులో పేర్కొన్నారు. పొదుపు సంఘ మహిళల పిర్యాదుపై మేనేజర్ రమేష్‌ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా పొదుపు సంఘం లీడర్ పంట రుణం చెల్లించకపోవడంతో పొదుపు రుణం మంజురులో జాప్యం చేయాల్సి వచ్చిందని ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తాము వివరణ ఇస్తామన్నారు.

13న జాతీయ లోక్‌అదాలత్



పోలీస్ అధికారులతో చర్చిస్తున్న న్యాయాధికారి అఖిల

అద్దంకి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగినన కేసుల పరిష్కారానికి కృషి చేయాలని ప్రిన్సిపల్ సీనియర్ న్యాయాధికారి శ్రీసీత అన్నారు. శుక్రవారం స్థానిక కోర్టు భవనాల సముదాయంలో పోలీస్ అధికారులతో సీనియర్ సివిల్ న్యాయాదికారిణి శ్రీసీత, అడిషనల్ జూనియర్ న్యాయాధికారిణి అఖిలలు సమీక్ష నిర్వహించారు. ఇరుపక్షాలతో మాట్లాడి సామరస్యంగా పరిష్కరించాలన్నారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మహ్మద్, సీఐ సుబ్బరాజు, రేణింగవరం ఎస్సై వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులు

● ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ● పాఠశాలల్లో ఆహ్లాదభరితంగా పీటీఎం సమావేశాలు



పీటీఎం సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

మార్టూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు స్కూళ్లకు ధీటుగా ప్రభుత్వ బడులు ఉండాలని, విద్యార్థులకు మెరుగైన వసతులతో కూడిన నాణ్యమైన విద్యను అందించాలనిఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. శుక్రవారం ఆయన మార్టూరు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయులు తల్లి దండ్రుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావితరాలకు అద్భుతమైన భవిష్యత్తును అందించాలన్న తపన తో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. స్కూళ్లలో పీటీఎం సమావేశాలను ఏర్పాటు తల్లిదండ్రులను పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడం లోకేష్ ఆశయమన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్‌లో వసతుల కోసం తన సొంత నిధులను రూ.5 లక్షలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. బాలికలకు మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవడం, కొన్ని తరగతి గదులలో అర కొర వసతులే ఉండడంతో జడ్పీ సీఈవోతో ఫోన్‌లో మాట్లాడారు. డైనింగ్ హాలు ఏర్పాటుకు రూ.25 లక్షలతో ప్రతిపాదనలు తయారుచేయాలని సీఈవో ను కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రూతు మెర్సీబాయ్ తహసీల్దారు టి.ప్రశాంతి, ఎంపీడీవో వై శ్రీనివాసరావు, ఎంఈవో వస్రామ్‌నాయక్, టోల్‌గేట్ మేనేజర్ దీప, ఎస్‌ఎంసీ ఛైర్మన్ ఇమాంవలి, నాయకులు తొండెపు ఆదినారాయణ, షేక్ ఫరూక్ తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ : తల్లిదండ్రులు తమ పిల్లల ఇష్టాలను తెలుసుకొని వారిని ప్రోత్సహిస్తే వారు ఉత్తములుగా తయారవుతారని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని కొప్పెరపాడు పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలన్నారు. వంద రోజులు ప్రణాళికలో భాగంగా ప్రతి విద్యార్థి కష్టపడి చదివి నూరు శాతం ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీవో కుసుమకుమారి, ఎంఈవోలు శ్రీనివాసరావు, రమేష్ బాబు, పాఠశాల హెచ్‌ఎం పురంశెట్టి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు మాదాల దానయ్య, దమ్ము అంజయ్య, పలువురు ఉపాధ్యాయులు, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వైసీపీతో విద్యారంగం కుదేలు

వేటపాలెం(చీరాల) : గత వైసీపీ అధికారంతో రాష్ట్రంలో విద్యారంగం కుదేలయిందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య విమర్శించారు. ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పీటీఎం (తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం) శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలో వేటపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చీరాల పట్టణంలో వైఏ మహిళా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా చిన్నారుల ప్రదర్శించిన ఎగ్జిబిషన్‌లను పరిశీలించి అభినందించారు. చిన్నారుల భవితవ్యంపై తల్లిదండ్రుల తరువాత అంతటి బాధ్యత ఉపాధ్యాయులకే ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. చిన్నారుల తప్పొప్పులను సరిచేసే క్రమంలో తల్లిదండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలన్నారు. ప్రభుత్వం జూనియర్ కళాశాలల విద్యార్థులను సైతం దృష్టిలో ఉంచుకుని డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సాంబశివరావు, హ్యాండ్‌లూమ్ ఛైర్మన్ సజ్జా హేమలత, ఏఎంసీ ఛైర్మన్ జనార్ధనరావు, పట్టణ అధ్యక్షులు సురేష్, నాగేంద్రమణి, నాయకులు పిక్కి నారాయణ తదతరులు పాల్గొన్నారు.

పంగులూరు : పాఠశాలలకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతు లను వినియోగించుకుని ఉత్తమ బోధనతో ఉపాధ్యాయులు విద్యా ర్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దాలని మండల ప్రత్యేకాధికారి అనంతరాజు అన్నారు. పంగులూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హెచ్‌ఎం శ్రీనివాసరావు అధ్యక్షతన పీటీఎం సమావేశం నిర్వహిం చారు. విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లల చదువు, నడవడిక విషయంలో ప్రత్యేకశ్రద్ధ చూపాలని ఈ సందర్భంగా ప్రత్యేకాధికారి సూచించారు.

మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదులు

పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగా ఉండడం లేదని పాఠశాల విద్యార్థులు, పలువురు తల్లిదండ్రులు అధికారులకు ఫిర్యాదు చేశారు. భోజనంలో తగిన నాణ్యత, రుచి ఉండడం లేదని అధికారులకు ఫిర్యాదు చేశారు. ఇంగ్లీష్ పాఠ్యాంశ బోధన సరిగాలేదని, అర్థంకాని అంశాలను ప్రశ్నిస్తే ఉపాధ్యా యులు దూషిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. విద్యార్థులకు అందించే భోజనం విషయంలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని ప్రత్యేకాధి కారి హెచ్చరించారు. కొండమంజులూరు ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన విలువల విద్య, సైన్స్ స్పోర్ట్స్, గ్రంథాలయ పుస్తకాల స్టాల్స్‌ను తహసీల్దార్ సింగారావు పరిశీలించారు. పీటీఎం ప్రత్యేక సమావేశాలలో ఎంపీడీవో కే.స్వరూపారాణి, ఎంపీడీవో లు నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పర్చూరు/కారంచేడు/ఇంకొల్లు : పండుగ వాతావరణంలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులను పాఠశాలకు దగ్గర చేసి, విద్యార్థుల అభ్యసన ప్రయాణంలో సమష్టి జవాబుదారీతనాన్ని పెంపొందించడానికి ప్రజాకూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్ టీచర్ ఆత్మీయ సమ్మేళనానికి విశేష స్పందన లభించింది. మండలంలోని ఉప్పుటూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా బాపట్ల జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ యస్.లవన్న పాల్గొన్నారు. ఆత్మీయ సమావేశం అనంతరం విద్యార్థులు నిర్వహించిన యోగా కార్యక్రమం ఆకట్టుకుంది. కార్యక్రమంలో తహసీల్దార్ పి.బ్రహ్మయ్య, సర్పంచ్ తిరుమలేశ్వరరావు, హెచ్‌ఎం. వసుందరదేవి పాల్గొన్నారు. అదేవిధంగా పర్చూరులోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన మెగా పేరెంట్‌డే వేడుకలు ఎంతగానో అలరించాయి. కార్యక్రమంలో హెచ్‌ఎం మోదుగుల నాగిరెడ్డి, మోడల్‌స్కూల్ హెచ్‌ఎం.నాగమణి, కేడీపీ ప్రసాద్, షేక్.గౌస్ తదితరులు పాల్గొన్నారు. ఇంకొల్లులో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో ప్రత్యేక అధికారి రమేష్‌బాబు పాల్గొన్నారు.

యద్దనపూడి,(మార్టూరు) : మండలంలోని పూనూరు జడ్పీ హైస్కూల్‌లో, గన్నవరం, యద్దనపూడి గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమాలకు ఎంఈవో చిలుకూరి గోపి హాజరయ్యారు. యనమదలలోని యూపీ పాఠశాలలో ప్రభుత్వ వైద్యాధికారి శ్రీహర్ష హాజరుకాగా, పోలూరులోని ప్రాథమిక పాఠశాలలో దాత రావిపాటి సీతయ్య, పూనూరు లో బోయపాటి సాంబశివరావు తదితరులు హాజరయ్యారు.







బల్లికురవ మండలం కొప్పెరపాడులో కలెక్టర్‌తో కరచాలనం చేస్తున్న విద్యార్థులు, వేటపాలెంలో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య, ఉప్పుటూరులో బహుమతులను అందజేస్తున్న ఎస్‌డీసీ లవన్న

క్రిటికల్ కేర్ యూనిట్ నిర్మాణంలో వేగం



నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులు

చీరాల, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చీరాల ఏరియా వైద్యశాల పరిధిలో కొంత కాలంగా నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ యూనిట్ పనులలో వేగం పుంజుకొంది. ఏపీ ఎంఎస్ఐడీసీ(ఏపీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్) ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనులకు సంబంధించి చేసుకున్న ఒప్పందం ప్రకారం వాస్తవానికి వచ్చే ఏడాది ఆగస్టు నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. అయితే నిర్మాణాల్లో కొన్ని సాంకేతిక, ప్రకృతి పరమైన సమస్యలతో ఇటీవల పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. ఎట్టకేలకు గత మాసంలో దసరాకు స్థానిక శాసనసభ్యులు ఎంఎం కొండయ్య భూమిపూజ చేశారు. దీంతో పనుల్లో వేగం పుంజుకుంది. రాష్ట్రంలో ఐదు క్రిటికల్ కేర్ యూనిట్స్ మంజూరు కాగా ఎమ్మెల్యే కొండయ్య చొరవతో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు చీరాలకు ఒక కేంద్రానికి అవకాశం కల్పించారు. ఈ నేపథ్యంలో రూ.23.75 కోట్లుతో పనులు ప్రారంభమయ్యాయి. అయితే అనుకున్న సమయానికి పనులు ప్రారంభం కాకపోవడంతో మరో రెండు లేక మూడు మాసాలు అదనపు సమయం నిర్మాణాలకు అవ కాశం ఉంటుందని అధికా రులు చెబుతున్నారు.

చీరాల, చుట్టు ప్రక్కల ప్రజలకు ప్రయోజనం

క్రిటికల్ కేర్ యూనిట్ సేవలు ప్రారంభమైతే ఇక్కడ అత్యాధునికంగా 50 బెడ్లు ఏర్పడనున్నాయి. ఇందులో ఐసీయూ, ఆపరేషన్ థియేటర్ అందుబాటులో ఉండనున్నాయి. ప్రస్తుతం 100 పడకలతో ఉన్న ఏరియా వైద్యశాలలో చీరాల, వేటపాలెం, కారంచేడు, పర్చూరు. చినగంజాం, రమారమీ నాగులుప్పలపాడు, మార్టూరు మండలాలకు చెందిన ప్రజలు సైతం ఇక్కడే కార్పోరేట్‌స్థాయిలో వైద్యం పొందే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం వైద్యశాలలో నిత్యం 350 నుండి 450 వరకు ఓపీలు ఉంటున్నాయి. అదనంగా ఏర్పడే కేంద్రంతో గుంటూరు. ఒంగోలు వంటి ప్రాంతాలకు ప్రజలు పరుగులు తీయకుండా నాణ్యమైన వైద్య సేవలు చీరాల్లోనే పొందే అవకాశం ఉంటుంది. ఒక విధంగా చూసుకుంటే క్రిటికల్ కేర్‌తో చీరాల, చుట్టు ప్రక్కల ప్రజలకు మంచి రోజులు వచ్చినట్లేనని భావించాలి.

రహదారి భద్రత నియమాలను పాటించాలి

● మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు



ఎన్ఎస్ఎస్-2 విభాగం విద్యార్థులతో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్, అధ్యాపకులు

అద్దంకిటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాహనదారులు అందరూ రహదారి భద్రత నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించు కోవచ్చని మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రంగారావు అన్నారు. శుక్రవారం మండలంలోని శింగరకొండపాలెంలో కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్-2 విభాగం ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలకు కారణాలు- నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హెల్మెట్ ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం , రోడ్డు వెంబడి ఉండే సూచికలను పాటించడం జాగ్రత్తలు తీసుకోవడం వలన ప్రమాదాలను తగ్గించవచ్చన్నారు. విద్యార్థులు రోడ్డు భద్రత నియమాల గురించి, వాహనాల ఇన్సురెన్స్ గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు అవగాహన కల్పించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో ప్రోగ్రం ఆఫీసర్ డాక్టర్ ఎన్.షర్మిలారాణి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. మోహనరావు, అధ్యాపకులు డి.రాజశేఖర్, ప్రసాద్, గంగయ్య, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మిత్ర, శత్రు పురుగుల నిష్పత్తిని బట్టి సస్యరక్షణ చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటలలో మిత్ర, శత్రు పురుగుల నిష్పత్తిని బట్టి సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ సూచించారు. శుక్రవారం మండలంలోని గోవాడ గ్రామంలో పొలం బడి కార్యక్రమంలో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటకృష్ణ మాట్లాడుతూ రసాయన పురుగుమందుల వినియోగంతో పంటకు మేలు చేసే తూనీగ, సాలీడు, కందిరీగ, అక్షింతల పురుగు వంటి మిత్రపురుగులు చనిపోతాయన్నారు. ఈ పురుగులు పంటకు హనీ చేసే శత్రు పురుగులను నియంత్రిస్తాయన్నారు. పంటలకు మేలు చేసే మిత్ర పురుగులు, హాని చేసే శత్రు పురుగులను ప్రదర్శించి రైతులకు అ వగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు శ్రీలక్ష్మి, వ్యవసాయ విస్తరణ అధికారి రేణుక , రైతులు పుట్టా సాంశివరావు, నరిశెట్టి రమేష్‌బాబు, మానినేని ఏడుకొండలు, నరిశెట్టి బ్రహ్మయ్య పాల్గొన్నారు.

విద్యతోపాటు క్రీడలలోనూ రాణించాలి

కేఆర్‌కే ప్రారంభమైన అంతర కళాశాలల వాలీబాల్ పోటీలు



వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న అద్దంకి సీఐ సుబ్బరాజు

అద్దంకిటౌన్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల ప్రాధాన్యతను తెలుసుకొని వాటిలో ప్రావీణ్యం పొంది రాణించాలని అద్దంకి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏ.సుబ్బారాజు అన్నారు. కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆంధ్రకేసరి యూనివర్సిటీ పరిధిలోని అంతర్ కళాశాలల వాలీబాల్ పోటీలు శుక్రవారం ఆయన ప్రారంభించారు. పోటీలతో స్నేహ భావం పెంపొందించు కోవాలని, గెలుపు, ఓటములు సహజం అన్నారు. ఆటలలో తమ ప్రతిభ తో ఉన్నత స్థాయికి ఎదగడానికి కృషి చేయాలన్నారు. పోటీలలలో మొత్తం 6 కళాశాలల నుంచి టీంలు పాల్గొన్నాయని కళాశాల ప్రిన్సిపాల్, ఆటల ఛైర్మన్ డాక్టర్ వి. మోహనరావు, పిజికల్ డైరెక్టర్, ఆటల ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.సుశీలమ్మలు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అద్దంకిని ప్రకాశంలో విలీనం చేయడం మీకు ఇష్టమేనా..?

కొప్పెరపాడులో రైతుల అభిప్రాయాన్ని తెలుసుకున్న కలెక్టర్



రైతులతో మాట్లాడుతున్న కలెర్టక్ వినోద్‌కుమార్


బల్లికురవ, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపడుతున్న జిల్లాల పునర్విభజనలో అద్దంకి నియెజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో విలీనం చేయడం మీకు ఇష్టమేనా అని కలెక్టర్ వినోద్‌కుమార్ రైతుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. శుక్రవారం కొప్పెరపాడు వచ్చిన కలెక్టర్ అక్కడ ఉన్న రైతులతో కొద్దిసేపు ముచ్చటించారు. నియోజకవర్గాల విషయాన్ని అయన రైతును అడగ్గా అక్కడ ఉన్న అందరూ ముక్త కంఠంతో తమకు బాపట్ల జిల్లా కేంద్రం దూరం అని ఒంగోలు చాలా దగ్గర అని ప్రకాశంలో తమను కలపాలని కోరారు. అనంతరం కలెక్టర్ రైతులకు పంటలకు సరిపడా ఎరువులు అందుతున్నాయా..? అని వారిని అడిగి తెలుసుకున్నారు. వరిసాగు అత్యధికంగా సాగు చేస్తున్నారని వరిలో ఎలుకల తాకిడి ఎలా ఉంది..? అని అయన అడగ్గా రైతులు ఎలుకలు తమ పంటలను నాశనం చేస్తున్నాయన్నారు. తాను పుట్టిన ప్రాంతంలో పాములు కనిపిస్తే రైతులు చంపరని ఇక్కడ పాములను చంపడం వలన పంటలను నాశనం చేస్తున్న ఎలుకలు అధికం అయ్యాయని వారితో అయన అన్నారు. ఎలుకలను తినే పాములు పంట పొలాల్లో ఉండటం కూడా మంచిందే అని రైతులతో అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పలు పథకాల గురించి రైతులకు కలెక్టర్ తెలియజేశారు. పలువురు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఎస్సీ కాలనీ సమీపంలో డ్రైనేజ్ సమస్య అధికంగా ఉందని తక్షణమే అభివృద్ధి చేయాలని వారు కోరారు.

ఘనంగా ప్రారంభమైన క్రిస్మస్ క్యారల్స్ ర్యాలీ



చిన్నారులకు క్రిస్మస్ కానుకలు అందజేస్తున్న దాతలు

చినగంజాం, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి) : క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని స్థానిక అంబేద్కర్‌నగర్‌లోని పెద్ద చర్చి వద్ద నుంచి క్రిస్మస్ క్యారల్స్ ర్యాలీని శుక్రవారం ఘనంగా ప్రారభించారు. ఈ నెల 25 వరకు సండే స్కూల్ చిన్నారులు, యువతి యువకులతో క్రిస్మస్ క్యారల్స్ నిర్వహిస్తున్నట్లు నిర్వహకులు మేకల మేషక్‌బాబు తెలిపారు. అంబేద్కర్‌నగర్‌కు చెందిన దాతలు విశ్రాంత ఉద్యోగి జ్యోతి దావీదు ఆయన సతీమణి పద్మ జ్ఞాపకార్థం వారి కుమారులు సునీల్, సురేంద్ర, కుమార్తె మౌనిక, కీర్తిపాటి శ్రీనివాసరావులు క్యారల్స్ ర్యాలీలో పాల్గొన్న 100 మంది చిన్నారులకు స్నాక్స్ టీ, క్రిస్మస్ కానుకలుగా పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో సండే స్కూల్ చిన్నారులు, యువతి యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



అధికారుల ప్రాథమిక అంచనా	
మండలాల సంఖ్య	19
గ్రామాలు	188
బాధిత రైతులు	12,315
దెబ్బతిన్న పంటల విస్తీర్ణం	6439 హెక్టార్లు
ఇళ్లు	మూడు
మృతి చెందిన పశువులు	3
చెరువులు, కాలువలు	85 చోట్ల
విద్యుత్ సబ్‌స్టేషన్లు	8
ట్రాన్స్‌ఫార్మర్లు	30
33 కేవీ ఫీడర్స్	14 చోట్ల
11 కేవీ ఫీడర్స్	11
స్తంభాలు	31

అప్పులు తెచ్చి నాట్లు వేశా...

ఈసారి చెరువుల్లో నీరు బాగా ఉండటంతో అప్పులు చేసి మరీ నాట్లు వేశాను. తీరా తుఫాన్ దెబ్బకు నాట్లన్నీ మునిగిపోయాయి. బాగా నష్టపోయాను. చివరికి అప్పులే మిగిలేలా ఉన్నాయి. అధికారులు మునిగిన పంటలను పరిశీలించి, ప్రభుత్వం ఆదుకునేలా చూడాలి.

- కూరాకు అశోక్, రాపూరు



మనుబోలు : నీటమునిగి దెబ్బతిన్న నారును చూపుతున్న రైతులు

దిత్వా.. వేలాది మంది రైతుల కష్టాన్ని నీళ్లపాలు చేసింది. లక్షలాది రూపాయల ఆర్థిక నష్టాన్ని తెచ్చిపెట్టింది. దానికన్నా ముఖ్యమైన పంట కాలాన్ని 45 రోజులపాటు వెనక్కు నెట్టింది. అదునుకు పంట పెట్టాలని ఆశించిన రైతుల ఆశలను గల్లంతు చేసింది. నాలుగు రోజులపాటు ఎడతెరపి లేకుండా వానలు కురిపించిన తుఫాన్ పోతూ పోతూ రైతు తినేకూటిలో మట్టి కొట్టిపోయింది. అన్నదాతల నెత్తిన అపార నష్టాన్ని మిగిల్చింది. తిరిగి పంట పెట్టుకోవాలంటే 45 రోజులు వేచి ఉండాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.



ముత్తుకూరు : పొలాల్లో నిలిచిన నీటిని మోటార్లతో తోడుకుంటున్న రైతులు

తుఫాన్.. ఏడిపించెన్!

పెట్టుబడి అంతా పోయింది!



26 ఎకరాల్లో సేద్యం పాలికి (కౌలు) చేస్తున్నాను. ఎకరా కయ్యిలో విత్తనాలు చల్లి వారం రోజుల్లో నారేతలు వేద్దామని కూలీలను మాట్లాడుకున్నా ఇంతలో వర్షం పట్టుకుంది. పై నుంచి వచ్చిన వరదలకు మొత్తం కొట్టుకుపోయింది. విత్తనాలు, కూలీలు, దుక్కిలు మొత్తం రూ. 44 వేల వరకు పెట్టుబడి అయింది. అదంతా గోవిందా. ఇందులో రూపాయి చేతికిరాదు. నీళ్లు తగ్గేదానికి ఇంకా 10 రోజులు దాకా పడుతుంది. మంచి ఎండల్లో వరికోతలు కొయ్యాల్సి వస్తుంది. అప్పుడు ఏం దిగుబడొస్తాదో.. ఏమో!

- కసుమూరు రవి, సౌత్‌మోపూరు

నారుమళ్లు దెబ్బతిన్నాయి



నాకు తరుణాయి చెరువులో నాలుగెకరాల పొలం ఉంది. నాలుగు బస్తాల (బస్తా 25 కేజీలు) విత్తనాలు నారుమళ్లు వేశా. వర్షంతో నారుమళ్లు నీట మునిగాయి. వర్షం తగ్గడంతో నీటిని బయటకు చల్లాను. సగం నారు దెబ్బతిన్నది. సుమారు రూ.5 వేల వరకు నష్టం జరిగింది.

- వెంకటాద్రి, ఉడ్‌హౌస్‌పేట, సంగం

భారీ వర్షాలతో తీవ్ర నష్టం



తుఫాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయాం. వేసిన 10 ఎకరాల నారుమళ్లు నీట మునిగి ఎందుకూ పనికి రాకుండాపోయాయి. మళ్లీ వ్యవసాయ పనులన్నీ మొదలుపెట్టి పంట సాగు చేయాలంటే చాలా భారంగా మారుతుంది. సాగు ఖర్చులు అదనంగా పెరగడంతోపాటు సకాలంలో పంట పండించుకునే పరిస్థితి లేదు.

- నెల్లిపూడి రాము, కృష్ణపట్నం, ముత్తుకూరు

- రైతులను కడగళ్లపాలుచేసిన 'దిత్వా'
- 7 వేల హెక్టార్లలో పంటల నష్టం
- తిరిగి పంట పెట్టాలంటే మరో 45 రోజుల సమయం
- అప్పుడు నాట్లు వేస్తే చీడపీడల భయం
- దిక్కుతోచని స్థితిలో అన్నదాత

నెల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఇది రబీ సీజన్. జిల్లా రైతులకు ఇది ప్రాణపదం. ఈ సీజన్‌లో వరి మంచి దిగుబడి ఇస్తుంది. ముఖ్యంగా చీడపీడల బాధ లేకుండా పంట చేతికందుతుంది. ముందు కురిసిన వర్షాలకు సోమశిల జలాశయంతో పాటు చెరువుల్లోకి పుష్కలంగా నీరు చేరడంతో రబీ పంటపై పుట్టెడాశతో నారు మళ్లు పోశారు. నాట్లూ వేశారు. అయితే 4 రోజులపాటు ఎడతెరపి లేకుండా కురిసిన వర్షం కారణంగా డెల్టా పరిధిలో సుమారు 6 వేల హెక్టార్లలో వరి నాట్లు, నారుమళ్లు మునిగిపోయాయి. కుంటలు, కయ్యలు ఏకం కావడంతో కయ్యల్లో నీళ్లు తగ్గాలంటే మూడు, నాలుగు రోజుల సమయం పడుతుంది. ఆలోగా వరి నాట్లు కుళ్లిపోతాయి. ఇక నారుమళ్ల విషయం చెప్పాల్సిన పనిలేదు. మళ్లీ నారు పోసుకోవాల్సిందే. ఒక హెక్టారు విస్తీర్ణంలో వరినాట్లు వేయడానికి రూ.25వేలు ఖర్చు అవుతుంది. నారుమళ్లకు హెక్టారుకు రూ.5వేలు ఖర్చు అవుతుంది. వరినాట్లు, నారుమళ్లు రెండింటిపై సగటున రూ.15వేల ఖర్చుతో లెక్కించినా నీట మునిగిన 6వేల హెక్టార్ల ద్వారా సుమారు రూ.9 కోట్ల రైతు కష్టార్జితం నీళ్లపాలయ్యింది.

● దిగుబడిపై ఆందోళన

రైతులకు ఇప్పటికి జరిగిన నష్టం కంటే భవిష్యత్తులో జరగబోయేది ఎక్కువ నష్టం. వర్షాల దెబ్బ లేకుంటే ఈ 6 వేల హెక్టార్లలో వరి పంట మంచి దిగుబడి ఇచ్చేది. సాధారణంగా రబీ సీజనల్‌లో ఎకరాకు 4 నుంచి 4.5 పుట్ల ధాన్యం దిగుబడి వస్తుంది. ఇప్పుడు నారుమళ్లు, నారేతలు దెబ్బతినడంతో తిరిగి సాగుకు 45 రోజుల సమయం పడుతుంది. అంటే వరి కోతలు ఏప్రిల్ ఆఖరు లేదా మే నాటికి జరుగుతాయి. అప్పటికి ఎండలు ముదరడంతో పంటలకు చీడపీడల తాకిడి ఎక్కువ అవుతుంది. ప్రధానంగా వెన్నుపోయే సమయానికి మొంపిప్పి, అగ్గి తెగులు పంటను సోకే ప్రమాదం ఉంటుంది. దీనివల్ల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. పెట్టుబడి కూడా చేతికందే అవకాశం ఉండదు. పోనీ వరి తప్ప మరో పంట సాగు చేద్దామన్నా కుదరదు. డెల్టా ప్రాంతంలో ప్రత్యేకించి ఈ సీజన్ ఆరుతడి పంటలకు ఏమాత్రం అనువైనది కాదు. దీంతో కష్టమైనా నష్టమైనా పంట పెట్టాల్సిన పరిస్థితి రైతులకు ఎదురయ్యింది.



పొదలకూరులో నీట మునిగిన నారుమళ్లను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

రూ.10వేలు నష్టపోయా



నాకున్న ఆరెకరాల పొలంలో 6 బస్తాల విత్తనా లు నారుమళ్లు వేశాను. కురిసిన భారీ వర్షానికి నారుమళ్లు నీట మునిగాయి. నాటే సమయంలో నారు దెబ్బ తినడంతో మళ్లీ నారు వేయాలంటే పంట ఆలస్యమవుతుంది. వర్షపు నీరు తగ్గితే విత్తనాలను నేరుగా పొలంలో చల్లాలనుకుంటు న్నాను. దుక్కిలతో కలిపి సుమారు రూ.10 వేల నష్టం వాటిల్లింది.

- రమణయ్య, మర్రిపాడు, సంగం

150 ఎకరాల్లో నాట్లు దెబ్బతిన్నాయ్



రేబాలలో రైతులు 300 ఎకరాలకుపైగా రైతులు వరినాట్లు వేశారు. సుమారు 150 ఎకరాల్లో ఇప్పటివరకు నాట్లు దెబ్బతిన్నాయి. ముంపు నీళ్ళు తగ్గితేనే పంటనష్టం పూర్తిగా తెలుస్తుంది. నారుమళ్ళు కూడా దెబ్బతిన్నాయి. మళ్ళీ నార్లుపోసి, నాట్లు వేయాలంటే మరో నెల వెనుక బడిపోవాల్సి ఉంటుంది.

- టీ. వెంకటరామిరెడ్డి, రేబాల, బుచ్చి

సబ్సిడీపై విత్తనాలు అందించాలి



8 ఎకరాల్లో వరి నారు వేశాను. భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నది. నాలాగే చాలా మంది రైతుల నార్లు వానకు కొట్టుకుపోయాయి. ప్రభుత్వం వెంటనే సబ్సిడీతో విత్తనాలు అందించాలి. వ్యవసాయ అధికారులు వచ్చి మా పొలాల్లో వరద నష్టాన్ని నమోదు చేసుకున్నారు.

- జీ. శ్రీనివాసులు, పొదలకూరు

విత్తనాల వడ్లు ఇవ్వాలి



నాకున్న 6 ఎకరాల్లో నారు పోస్తే మొత్తం మునిగి పోయింది. కయ్యల్లో మోకాలి లోతు నీళ్లున్నాయి. అవి తగ్గేసరికి నారు ఉంటాదని నమ్మకం లేదు. ప్రభుత్వం విత్తనాలు ఇస్తే మరోసారి నార్లు పోసుకోగలం.


- ముంగర శివారెడ్డి, మనుబోలు

దుత్తలూరు వీఆర్వో సస్పెన్షన్

దుత్తలూరు(ఉదయగిరి), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : దుత్తలూరు-1 ఇన్‌చార్జి వీఆర్వో సీహెచ్ శ్రీనివాసులను సస్పెండ్ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు తహసీల్దారు నాగరాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఏరుకొల్లు వీఆర్వోగా ఉన్న సమయంలో శ్రీనివాసులు అప్పటి నాయకుల మాటలు విని అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందకుండా చేయడంతోపాటు వారి పట్ల దురుసుగా ప్రవర్తించారని పేర్కొన్నారు. ఇటీవల ఆయనపై గ్రామస్థులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని, విచారణలో వాస్తవమని తేలడంతో శ్రీనివాసులపై చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

'ట్రాప్' గ్యాంగ్‌లపై గురి!

- ముఠాల ఆగడాలపై పోలీసుల దృష్టి
- కీలక ముఠా నేతల వరుస అరెస్టులు
- మిగిలిన వారి కోసం జల్లెడ
- రికవరీ చేస్తారా..? బాధితులకు అందిస్తారా..?



నెల్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకు బంగారం పేరుతో ఆశచూపి అమాయకులను 'ట్రాప్' చేసి దోచుకుంటున్న ముఠాలపై పోలీసులు దృష్టి పెట్టారు. కీలక ముఠాల ఆగడాలను గుర్తించిన పోలీసు యంత్రాంగం.. ఆ ముఠాల్లోని ప్రధాన నేతలను వరుసగా అరెస్టులు చేస్తున్నారు. వారం రోజుల వ్యవధిలో అనేక ట్రాప్‌లు వేసి రూ.కోట్లు దోచుకున్న దేవరకొండ సుధీర్, షేక్ హసన్‌లను జైలుకు పంపారు. వీరితోపాటు కొందరు అనుచరులను కూడా పట్టుకున్నారు. వారం రోజుల క్రితం షేక్ హసన్ ముఠాను పట్టుకోగా వారి నుంచి 22.4 కేజీల గంజాయితోపాటు రూ.37.50 లక్షల నకిలీ కరెన్సీ నోట్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. అలానే బుధవారం కావలిలో దేవరకొండ సుధీర్‌ను పట్టుకోగా అతడి నుంచి సుమారు 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అలానే అతడి ఇంట్లో నగదు, క్యాష్ కౌంటింగ్ మిషన్లు వంటి మరికొన్ని వస్తువులను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఇప్పుడు సుధీర్ ముఠా సభ్యుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. అలానే మోనా సద్దాం హుస్సేన్ గ్యాంగ్ ఆటలను కూడా పట్టేందుకు పోలీసులు సిద్ధమయ్యారు.

● కావలి కేంద్రంగా..

కావలి కేంద్రంగా కొన్నేళ్ల క్రితం మొదలైన ట్రాప్ గ్యాంగ్ ఆగడాలు ఇతర జిల్లాలు, రాష్ట్రాలకు విస్తరించాయి. మీడియేటర్లను ఏర్పాటు చేసుకొని తక్కువ ధరకు బంగారం ఇస్తామని ఆశచూపడం, నకిలీ కరెన్సీ నోట్లు తయారు చేయడం వంటి చేస్తూ కొన్ని వందల మంది బాధితుల నుంచి రూ.కోట్లు దోచుకున్నారు. సుధీర్, హసన్, హుస్సేన్ మొదట ఒకే గ్యాంగ్‌గా పనిచేసేవారు. అయితే దోచుకున్న సొత్తులో పంపకాల్లో తేడాలు రావడంతో ఒక గ్యాంగ్ కాస్తా మూడు గ్యాంగ్‌లుగా విడిపోయాయి. ఈ ముగ్గురు మూడు ముఠాలను ఏర్పాటు చేసుకొని రకరకాల ప్రదేశాల్లో మోసాలు చేస్తూ వస్తున్నారు. ఈ 'ట్రాప్' గ్యాంగ్‌ల ఆగడాలను ఇటీవల 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలతో వెలుగులోకి తెచ్చింది. ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవడంతో ముఠాల ఆగడాలకు

- మిగతా 7వ పేజీలో..



నెల్లూరు : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి నారాయణ



చేజర్ల : ట్యాబ్‌లను పరిశీలిస్తున్న విద్యార్థులను గమనిస్తున్న మంత్రి ఆనం

అంబరాన్నంటిన సంబరం

- ఉత్సాహంగా మెగా పేరెంట్, టీచర్ మీటింగ్
- అభివృద్ధిలో తల్లిదండ్రుల భాగస్వామ్యం

నెల్లూరు(విద్య), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంచడంతోపాటు సహృద్భావ వాతావరణం కల్పించేందుకు విద్యా శాఖ పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. పాఠశాలల్లో ఉత్తమ విద్య అందించేందుకు, అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేసేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను కలిపి ఒకే వేదికపైకి చేర్చడంతో ప్రభుత్వ బడుల్లో పండగ వాతావరణం నెలకొంది. ప్రజా ప్రతినిధులు, అధికారుల కలిసి తల్లిదండ్రులతో విద్యాపరమైన అంశాలను చర్చించడంతోపాటు సహపంక్తి భోజనాలు చేసి పిల్లల ప్రగతి నివేదికలు అందచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లావ్యాప్తంగా 2,527 ప్రభుత్వ పాఠశాలల్లో, 23 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నిర్వహించిన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ 3.0 కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి. రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ నెల్లూరులోని పలు స్కూళ్లలోనూ, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చేజర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పాల్గొని, ప్రసంగించారు. కావలి, చేవూరులలో నిర్వహించిన మెగా పేటీఎం సమావేశాల్లో కలెక్టర్ హిమాన్షుశుక్లా పాల్గొనగా, జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్యేలు, అధికారులు ఆయా ప్రాంతాల్లో పాల్గొని ప్రసంగించారు.

పరిశ్రమల్లో స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి

- రామాయపట్నం పోర్టు, ఇండోసోల్‌లా వ్యవహరించొద్దు!
- అధికారులకు తేల్చి చెప్పిన రైతులు
- బీపీసీఎల్ ఏర్పాటుపై చేవూరులో ప్రజాభిప్రాయ సేకరణ

గుడ్లూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తమ ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో స్థానిక యువతకే ఉద్యోగాలు ఇవ్వాలని చేవూరు, రావూరు, సాలిపేట రైతులు స్పష్టం చేశారు. చేవూరులో బీపీసీఎల్ ఏర్పాటుపై శుక్రవారం జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో కలెక్టర్ హిమాన్షు శుక్లా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఈ ప్రాంత యువతకు ఉద్యోగాలు వస్తాయన్న ఆశయతో రామాయపట్నం పోర్టు, ఇండోసోల్‌కు భూములిస్తే తీరా ఎక్కడో దూరంగా ఉన్నవారిని ఉద్యోగాల్లో చేర్చుకుని తమకు మొండిచేయి చూపించారని వాపోయారు. ఇండోసోల్‌లో బీహార్ వాళ్లను చేర్చుకొని స్థానిక యువతను మోసం చేశారని మండిపడ్డారు. అదే తరహాలో బీపీసీఎల్ కూడా వ్యవహరిస్తే తాము తీవ్రంగా నష్టపోతామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, బీపీసీఎల్

- మిగతా 8వ పేజీలో..





చేవూరులో జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, పాల్గొన్న రైతులు

ఉచితంగా విత్తనాలు సరఫరా చేయండి

వ్యవసాయ శాఖ మంత్రికి సోమిరెడ్డి లేఖ

నెల్లూరు (వ్యవసాయం)/తోటపల్లిగూడూరు : దిత్వా తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులకు ఉచితంగా విత్తనాలు అందించి ఆదుకోవాలని కోరుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి శుక్రవారం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి లేఖ రాశారు. భారీ వర్షాల కారణంగా పొలాలన్నీ సముద్రాన్ని తలపిస్తున్నాయని పేర్కొన్నారు. దాదాపు జిల్లాలోని 20 మండలాల్లో 16,132 మంది రైతులు నష్టపోయారని, 2116 హెక్టార్లలో నారుమడులు, 6546 హెక్టార్లలో వరినాట్లు దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే 6,997 ఎకరాల్లో వరినాట్లు, 80హెక్టార్లలో వేరుశనగ దెబ్బతిందని తెలిపారు. ఇప్పటికీ వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయని దీంతో నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నష్టాలను అంచనా వేయించే ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని కోరారు.

'సోమశిల'కు పెరిగిన ఇన్‌ఫ్లో

అనంతసాగరం డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం క్యాచ్‌మెంట్ ఏరియాలో కురుస్తున్న వర్షానికి వరద పెరుగుతోంది. గురువారం 22,186 క్యూసెక్కులు వస్తుండగా శుక్రవారం నాటికి 28,080 క్యూసెక్కులకు పెరిగింది. ఇక డ్యాంలో 73.593 టీఎంసీల నీరు నిల్వ ఉండగా, ఉత్తర కాలువకు 50, దక్షిణ కాలువకు 200, డెల్టాకు 2,650, కండలేరుకు 2,000 క్యూసెక్కులు వదులుతున్నారు.

● కండలేరుకు తగ్గిన ప్రవాహం

రాపూరు : కండలేరు డ్యాంకు వరద ప్రవాహం తగ్గింది. శుక్రవారం సాయంత్రం ఇన్‌ఫ్లో 1920 క్యూసెక్కులు ఉండగా, హెడ్ రెగ్యులేటర్ నుంచి 1970 క్యూసెక్కులు, సత్యసాయి గంగ కెనాల్‌కు వెయ్యి, పిన్నేరువాగుకు 850, ఫస్ట్ బ్రాంచ్ కెనాల్‌కు 35, రాపూరు మంచినీటి పథకానికి 5 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	145
స్కిన్ చికెన్	260
స్కిన్‌లెస్	284

కోడిగుడ్ల ధర (100): 670



వేడుకగా వేణుగోపాల స్వామి కల్యాణం

అల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అల్లూరు పట్టణ పరిధిలోని వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై కొలువుదీర్చారు. ఉదయగిరి అనంతాచార్యులు, ఫణి స్వామితో కూడిన అర్చక బృందం శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం జరిపించారు. ఈ వేడుకను చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అనంతరం తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

విద్యార్థులకు క్యారియర్లు, నీటి బాటిళ్ల పంపిణీ

కలిగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద దివ్యాంగ విద్యార్థులకు జైగౌడ ఉద్యమం ఉదయగిరి నియోజకవర్గ అధ్యక్షుడు పీ మాల్యాద్రి గౌడ్ శుక్రవారం క్యారియర్లు, నీటి బాటిళ్లను వితరణగా అందజేశారు. మాల్యాద్రిగౌడ్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో దివ్యాంగులకు ఉపకరణాలను శుక్రవారం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు చిన్నా, మహేష్, నజీర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో దాతలు, టీచర్లు

లింగసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో 4వ తరగతి నుండి 10వ తరగతి వరకు పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు దాతలు నగదు బహుమతులు అందచేశారు. ఇదే హైస్కూల్‌లో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేసిన నీలకంఠశాస్త్రి జ్ఞాపకార్థం ఆయన శిష్యుడు ఎన్ఆర్ఐ కదిరి పార్థసారథి పంపించిన రూ.50 వేల నగదును ఆయన సోదరుడు నరసింహారావు హెచ్ఎం యు మాధవరావుకు అందించారు. దీంతో ఆయన విద్యార్థులకు అందచేశారు. ఈసందర్భంగా ఇటీవల స్టూడెంట్ అసెంబ్లీకి వెళ్లిన యేసుపోగు గ్లోరిని హెచ్ఎం, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మహేంద్రరెడ్డి, శ్రీరామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు

కందుకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా యువజన అధికారి ఏ మహేంద్రరెడ్డి సూచించారు. శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక శ్రీగాయత్రీ విద్యాపరిషత్ డిగ్రీ కాలేజీలో అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా అంతర్జాతీయ స్వచ్ఛంద దినోత్సవం పై విద్యార్థినీ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్ఎం ఆర్. వెంకటేశ్వర్లు (ఆర్వీ), కళాశాల ప్రిన్సిపాల్ పి. గీతాశ్రీనివాసరావు, శ్రీరామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు రవ్వా శ్రీనివాసులు, కోట వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రజలకు అండగా నిలవడం నేరమా ?

బిట్రగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ సంస్థలు అన్యాయంగా చేస్తున్న భూసేకరణను వ్యతిరేకిస్తూ స్థానిక ప్రజలకు అండగా నిలవడం నేరమా? అని మండల సీపీఎం సీనియర్ నాయకుడు తుమ్మలవెంకయ్య ప్రశ్నించారు. బోగోలు మండల సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రుద్రకోట, పెద్దపట్టపుపాలెం తదితర ప్రాంతాల్లో కార్పొరేట్ సంస్థలు చేస్తున్న భూసేకరణను ఆయా గ్రామాల ప్రజలు వ్యతిరేస్తున్నారని తెలిపారు. వారికి మద్దతుగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మాల్యాద్రిని రామయ్యపట్నం వెళ్లనివ్వకుండా గృహనిర్బంధం చేయడం సమంజసం అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండలాధ్యక్షుడు చల్లా నరహరి, భవన నిర్మాణ కమిటీ అధ్యక్షుడు షేక్ బాదుల్లా, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలి

● తహసీల్దారు గిరీష్ కుమార్

కలిగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కావలి-దుత్తలూరు జాతీయ రహదారి విస్తరణ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో అక్రమ కట్టడాల తొలగింపు విషయమై శుక్రవారం తహసీల్దారు గిరీష్‌కుమార్ యజమానుల నుండి హక్కు పత్రాలను సేకరించారు. గ్రామనత్తం భూములతోపాటు పట్టా భూములు కలిగిన యజమానులకు సంబంధించి రోడ్డు మధ్య నుండి 50 అడుగులమేర కట్టడాలు ఎంతమేర తొలగించాల్సి వస్తుందో సర్వేయర్ల చేత కొలతలు తీయించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని రహదారి విస్తరణ పనులకు పట్టణ ప్రజలు సహకరించాలని తహసీల్దారు కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు వెంట వీఆర్వో, వీఆర్ఏ, సర్వేయర్లు ఉన్నారు.



యజమానులతో మాట్లాడుతున్న తహసీల్దారు గిరీష్

'ట్రాప్' గ్యాంగ్‌లపై గురి!

(5వ పేజీ తరువాయి)

పోలీసులు బ్రేకులు వేశారు. వరుసపెట్టి ముఠాలను వెతికి పట్టుకొని జైలుకు పంపుతున్నారు. అయితే జైలుకెళ్లడం, తిరిగి రావడం ఈ గ్యాంగులకు అలవాటుగా మారిపోయింది. ఈ నేపథ్యంలో ముఠా కీలక నేతలపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ వినిపిస్తోంది. అదే సమయంలో వందల మంది బాధితుల నుంచి రూ.కోట్లు దోచుకొని ఉన్నారు. ఆ ముఠాల నుంచి దోచుకున్న డబ్బును రికవరీ చేసి బాధితులకు న్యాయం చేస్తారో లేదో చూడాలి.

పిల్లలతో స్నేహంగా మెలగాలి

కావలి మెగా పీటీఎంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా

కావలి రూరల్, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులతో తల్లిదండ్రులు స్నేహపూర్వకంగా మెలగాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. స్థానిక వెంగళరావు నగర్‌లోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నేడు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తోందన్నారు. నెలకు ఒక్కసారైనా పాఠశాలలకు వెళ్లి పిల్లల చదువు, నడవడిక గురించి తల్లిదండ్రులు ఆరా తీయాలన్నారు. ఎమ్మెల్యే కోరిక మేరకు పాఠశాల అభివృద్ధి కోసం రూ. 10 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రకటించారు.

చెడు వ్యసనాలకు అలవాటుపడితే జీవితాలు గల్లంతే: ఎమ్మెల్యే దగ్గుమాటి : విద్యార్థులు చెడు వ్యసనాలకు అలవాటుపడితే జీవితాలు గల్లంతేనని ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యకు, పారిశ్రామికీకరణకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా కష్టపడి చదవాలని, ధైర్యంగా నిలబడాలన్నారు. అప్పుడే సమాజంలో మంచి గుర్తింపు వస్తుందన్నారు. జిల్లాను పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు కలెక్టర్ ఎంతగానో కృషిచేస్తున్నారన్నారు. అనంతరం పట్టణంలో 100 అడుగుల జాతీయ జెండా, గ్యాలరీలో ఏర్పాటు చేసిన మహనీయుల చిత్రపటాలను కలెక్టర్, ఎమ్మెల్యే తిలకించారు. కలెక్టర్‌తో కలసి ఎమ్మెల్యే సెల్ఫీపాయింట్‌లో ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమం లో ఆర్డీవో సన్నీ వంశీ క్రిష్ణ, మున్సిపల్ కమీషనర్ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, ఎంఈవోలు గోవిందయ్య, వెంకట సుబ్బయ్య, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వల్లేటి వెంకటేశ్వర్లు, కావలి జనసేన ఇన్‌చార్జి అళహరి సుధాకర్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గుత్తికొండ కిషోర్, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, జనసేన పట్టణ అధ్యక్షుడు బొబ్బా సాయి, స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కావలిలో జరిగిన ఉపాధ్యాయ, తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

● **మెగా పీటీఎంకు విశేష స్పందన**

జలదంకి, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశాఖ చేపట్టిన మెగా పీటీఎం (పేరెంట్స్, టీచర్స్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఆత్మీయ సమావేశానికి జలదంకి మండలంలో విశేష స్పందన లభించింది. విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా హాజరై తమ పిల్లలు ఎలా చదువుతున్నారో ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పలువురు గ్రామపెద్దలు ముందుకురావడం విశేషం. మండలంలోని లింగరాజు అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో ఇదివరకే పలు అభివృద్ధి పనులు చేపట్టిన 'మన ఊరు పిలుస్తోంది' ట్రస్ట్ తరుపున హాజరైన ఛైర్మన్ గాలి శ్రీనివాసులు మౌలిక వసతుల విషయంలో మరింత సహకారం అందిస్తానని పేర్కొన్నారు. పట్ల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. సర్పంచ్ మంగలి తిరుమలను విద్యార్థుల తల్లిదండ్రులు సీసీరోడ్డు నిర్మించాలని కోరగా సర్పంచ్ తప్పకుండా వేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ఎంఈఓలు నాగేశ్వరరావు, పద్మనాభయ్య పర్యవేక్షణలో జరిగాయి.



జలదంకి : హాజరైన తల్లిదండ్రులు, గ్రామపెద్దలు

● **తల్లిదండ్రుల సహకారం అవసరం**

అల్లూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తానూ విద్యార్థి దశలో పేదరికాన్ని అనుభవించానని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి అన్నారు. అల్లూరు మండలం, నార్తుమోపూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉపాధ్యాయుడిగా తన ప్రయాణం ప్రారంభమైందని, కష్టాల్లో నుంచి పుట్టుకొచ్చిన పట్టుదలతో తాను ఈ స్థాయికి చేరుకున్నానన్నారు. ఉపాధ్యాయుల కృషి ఎంత అవసరమో విద్యార్థి అభివృద్ధికి తల్లిదండ్రుల సహకారం కూడా అంతే అవసరమన్నారు. విద్యాశాఖలో పెనుమార్పులు చోటు చేసుకున్నాయని, దేశంలోనే విద్యాశాఖను ఉన్నతస్థాయికి తీసుకెళ్లేందుకు మంత్రి లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. తన సహకారం ఎల్లప్పుడూ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రేబాల శంకర్ రెడ్డి, నెల్లూరు నిరంజన్‌రెడ్డి, బండి శ్రీనివాసులు రెడ్డి, పలగాటి శ్రీనివాసులు రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, ఊటు శ్రీకాంత్ రెడ్డి, విడవలూరు దశరథరామిరెడ్డి, ఎండేటి హరికృష్ణ, మండల నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

● **కోలాహలంగా పీటీఎం**

బిట్రగుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా టీచర్స్, పేరెంట్స్ మీటింగ్ శుక్రవారం కోలాహలంగా జరిగింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ నరసమ్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంఈవో జయమ్మ, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. విద్యార్థినులకు మాస్టర్ రవిగన్ ఆధ్వర్యంలో నృత్యంతో



బిట్రగుంట : గురుకులంలో నృత్యంతో మార్షల్ ఆర్ట్స్ ప్రదర్శిస్తున్న బాలికలు

తైక్వాండో మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు ప్రదర్శించారు, పుస్తక, క్రీడా ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈవో, ఎంపీడీవోలు మాట్లాడుతు పిల్లల చదువుల పట్ల తల్లితండ్రులు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు పంపిణీ చేశారు. కప్పరాళ్ళతిప్ప జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, రైల్వే విశాంతి ఉద్యోగి పరిమి సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం

కందుకూరు, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణం, రూరల్ మండల పరిధిలోని వివిధ ప్రాథమిక పాఠశాలలు, ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్ టీచర్స్ సమావేశం ఘనంగా నిర్వహించారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్ఎం ఎం. నరసింహామూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులకు పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం ప్రవేశపెట్టిన వివిధ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ పిల్లల పట్ల తల్లిదండ్రులు సైతం శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు కూడా మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశారు. మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాద్రిపాలెం ప్రాథమిక పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్స్‌మీటింగ్‌లో ఎంఈఓలు ఎం. నాగకుమారశర్మ, ఎం. సుబ్బారెడ్డిలు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, బోధనాపద్ధతుల గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ షేక్ నాగూర్‌వలీ ఆధ్వర్యంలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహించారు.



కందుకూరు : మెగా పీటీఎంకు తల్లిదండ్రులకు స్వాగతం పలుకుతున్న జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల టీచర్లు

● **గురువులు, తల్లిదండ్రులను గౌరవించాలి**

లింగసముద్రం, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : గురువులను, తల్లిదండ్రులను విద్యార్థులు గౌరవించాలని ఎంఈవో-1 కె మాల్యాద్రి సూచించారు. శుక్రవారం స్థానిక కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు యు మాధవరావు అధ్యక్షతన మెగా పీటీఎం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో కలిసి ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతిని సమీక్షించారు. అనంతరం ఎంఈవో మాల్యాద్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను ఉపయోగించుకొని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-2 ఎవి శివకుమార్, పలువురు ఎస్ఎంసి కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



లింగసముద్రం : కేఆర్ జడ్పీ హైస్కూల్‌లో జరిగిన మెగా పీటీఎంలో మాట్లాడుతున్న ఎంఈవో మాల్యాద్రి

● **ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన**

ఉలవపాడు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన అందుతుందని మండల తహసీల్దార్ టీ శ్రీవాసులు పేర్కొన్నారు. మండలంలోని భీమవరం హైస్కూల్‌లో శుక్రవారం ఇన్‌చార్జ్ హెచ్ఎం శివరావు అధ్యక్షతన నిర్వహించిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమ్మేళనంలో ప్రత్యేక పరిశీలకులుగా తహసీల్దార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పౌష్టికాహారం అందిస్తున్నట్టు తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులతో కలిసి మొక్కను నాటారు.



ఉలవపాడు : పీటీఎం సందర్భంగా భీమవరం జడ్పీ హైస్కూల్‌లో మొక్క నాటిన తహసీలార్

● వలేటివారిపాలెం : మండలంలోని చుండి మోడల్ స్కూల్, చుండి ఎంపీపీ స్కూల్, వలేటివారిపాలెం హైస్కూల్ తదితర పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చుండి మోడల్‌స్కూల్ ప్రిన్స్‌పాల్ శ్రీవెంకటేశ్వర్ మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వలేటివారిపాలెం హైస్కూల్ హెచ్ఎం కమల్‌కుమార్, చుండి ఎంపీటీసీ చౌడబోయిన యానాది, నాయకులు చెరువుపల్లి మాల్యాద్రి, కామినేని వీరయ్య, కాకుమాను ఆంజనేయులు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత, కామినేని శ్రీనివాసులు, అంకయ్య పాల్గొన్నారు.

● **విద్యార్థుల ప్రగతికి ఉపాధ్యాయులు బాటలు వేయాలి**

దగదర్తి, (బిట్రగుంట) డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి విద్యార్థుల ప్రగతికి బాటలు వేయాలని ఎమ్మెల్సీ బీద రవిచంద్ర పేర్కొన్నారు. దగదర్తి మండలం అనంతవరం లయన్స్ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదిశేషయ్య ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశానికి ఆయన హాజరయ్యారు. విద్యార్థుల పుస్తక ప్రదర్శన, సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తీర్చిదిద్దుతున్నారన్నారు. జిల్లాలోనే మోడల్ స్కూల్‌గా ప్రథమ స్థానంలో నిలబెట్టడానికి ఉపాధ్యాయులు, తల్లితండ్రుల సహకారం చాలా అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు భాస్కర్, విజయరత్నం, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, హెచ్ఎం మారుతి, ఎస్ఎంసీ ఛైర్మన్ నరేష్, టీడీపీ నేత మంద శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దగదర్తి : అనంతవరం పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ బీద రవిచంద్ర

● **విలువలతో కూడిన విద్యను అభ్యసించాలి**

కావలి రూరల్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని ఎంపీడీవో శ్రీదేవి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం జరిగింది. సర్వాయపాలెం జెడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు తోట వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి పాల్గొన్నారు. 10వ తరగతి విద్యార్థులు 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను అనుసరించి పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ మాధవరావు, ఎంపీటీసీ జంపాని శ్రీనివాసులు, పంచాయతీ అభివృద్ధి అధికారి రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

● **పిల్లల ప్రగతిని వివరించేందుకే...**

కొండాపురం, డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో శుక్రవారం మెగా పేరెంట్స్, టీచర్స్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదర్శ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి-2 ఆనందరావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం పాఠశాలలను విద్యార్థుల ప్రగతిని తల్లిదండ్రులకు వివరించేందుకు ఆత్మీయ సమావేశం మంచి వేదిక అన్నారు. పాఠశాల అభివృద్ధిలో తలిదండ్రులు భాగస్వామ్యులను చేసేందుకు అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ నిధులను ఎటువంటి అభివృద్ధి పనులకు ఉపయోగించాలనే విషయాలపై విద్యా కమిటీ చైర్మన్లు, సభ్యులతో చర్చించారు. సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రామమోహనరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమాలలో ఎంపీడీవో ఆదినారాయణరావు, టీడీపీ కన్వీనర్ పోలినేని చంద్రబాబు నాయుడు, గుడవళ్లూరు సర్పంచ్ మాచర్ల, నేకునాంపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఖాదర్ బాషా పాల్గొన్నారు.

● **కలిగిరిలో..**

కలిగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈవో సురేష్ పేర్కొన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జరిగిన పీటీఎం 3.0 కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందన్నారు. విద్యాశాఖమంత్రి నారా లోకేష్ వినూత్న ఆలోచనలతో విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సహపంక్తి భోజనం చేశారు.



కలిగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సహపంక్తి భోజనం చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు

50 శాతం రాయితీతో విద్యుత్‌లోడ్ క్రమబద్ధీకరణ

కావలి, డిసెంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌లోడ్ క్రమబద్ధీకరణకు ఈ నెల 31 వరకు అవకాశం ఉందని, 50 శాతం రాయితీతో క్రమబద్ధీకరించుకోవచ్చని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ కే రాఘవేంద్రం తెలిపారు. కావలి డివిజన్ కార్యాలయంలో శుక్రవారం అధికారులతో ఎస్ఈ సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పుల్లారెడ్డినగర్ సబ్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యుత్ సమస్యలపై ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన వాట్సాప్ (9552300009) నంబరును ఉపయోగించుకుని విద్యుత్ సేవలను పొందవచ్చన్నారు. క్షేత్ర స్థాయిలో ట్రాన్స్‌ఫారంల నిర్వహణ సక్రమంగా లేక ట్రాన్స్‌ఫారంలు ఫెయిల్ అవుతున్నాయన్నారు. ట్రాన్స్‌ఫారంలను రెగ్యులర్‌గా మెయింటెనెన్స్ చేయాలని, ఏఈలు క్షేత్రస్థాయికి వెళ్లి వాస్తవ పరిస్థితులు తెలుసుకుని వినియోగదారలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. వినియోగదారులకు డిజిటల్ పేమెంట్స్‌పై సంస్థ ఉద్యోగులందరూ అవగాహన కల్పించాలన్నారు. 33కేవీ ఫీడర్లు, 11 కేవీ ఫీడర్లపై ప్రస్తుత విద్యుత్ లోడ్, వినియోగదారుల సంఖ్య, ఓవర్‌లోడ్ ఫీడర్ల పరిస్థితులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఈఈ బెనర్జీ, డిప్యూటీ ఈఈలు రవికుమార్, రవిచంద్ర, ఏఈవో రామాంజనేయులు, ఏఈలు అకౌంట్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్ఈ రాఘవేంద్రం



ఇల్లు కోల్పోయిన కుటుంబానికి దుస్తులు, వంటపాత్రల కిట్ అందచేస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

అగ్ని ప్రమాద బాధితులకు చేయూత

కావలి,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి) అల్లూరు మండలం సింగపేట చెలిక సంఘానికి చెందిన ఏకుల చిన చెంచయ్య, వెంకమ్మ దంపతులు ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోయింది. అసోసియేషన్ ఫర్‌ది రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ వ్యవస్థాపకులు బషీర్ సూచన మేరకు అగ్నిప్రమాద బాధిత గిరిజన కుటుంబానికి కావలి రెడ్‌క్రాస్ బాధ్యులు సహాయం అందించారు. కావలి రెడ్‌క్రాస్ భవనంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వారికి దుస్తులు, వంట సామగ్రి కిట్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ విపత్తు నిర్వహణ విభాగం కన్వీనర్ జనిగర్ల మనోహర్, రెడ్‌క్రాస్ బాధ్యులు డీ. రవిప్రకాష్, కే. హరినారపరెడ్డి, బెజవాడ ప్రసన్న కుమార్, బీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

కావలి,డిసెంబరు5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కావలి నియోజకవర్గంలో వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి తెలిపారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం 37 మంది లబ్ధిదారులకు రూ.26,18,395 విలువ కలిగిన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన అందజేశారు. త్వరలో కావలిలో అనేక కొత్త రోడ్ల నిర్మాణాలతోపాటు, అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో కావలి రాష్ట్రంలోనే ప్రథమస్థానంలో ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు గుత్తికొండ కిషోర్, జ్యోతి బాబూరావు, ఆవుల రామక్రిష్ణ, మాలేపాటి నాగేశ్వరరావు, అల్లం హనుమంతరావు, పోట్లూరి శ్రీనివాసులు, అర్షియా బేగం, షేక్ అలహర్ తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి

కొండ.. కోనల్లో.. లోయల్లో...

గల గల గంగమ్మ పరవళ్లు

కనువిందు చేస్తున్న జలపాతాలు



రాపూరు : పెంచలకోనలో ఎత్తయిన కొండల్లో నుంచి పాలవెల్లువలా దుముకుతున్న జలపాతం



రాపూరు : కణ్వనదిలో పారుతున్న స్వచ్ఛమైన నీరు




సీతారామపురం : భైరవకోన జలపాతంలో కేరింతలు కొడుతున్న పర్యాటకులు



పరమశివుడి పాదాలను తాకుతూ ప్రవహిస్తున్న గంగమ్మ

చుట్టూ అడవులు.. పచ్చని చెట్లు.. ఎత్తయిన కొండలు.. అక్కడ నుంచి పాలవెల్లువలా దుమికే జలపాతం.. హోరెత్తే నీటి హోయలు ఇవన్నీ పెంచలకోన సొంతం. మొన్న మొంథా.. ఇప్పుడు దిత్వా తుఫాన్ల తాకిడితో వరుసగా కురుస్తున్న భారీ వర్షాలకు రాపూరు మండలం పెంచలకోన, జిల్లా పొరుగున ఉన్న భైరవకోన పర్యాటకులను పరుస్తున్నాయి. పెంచలకోనలో దాదాపు 500 మీటర్ల కన్నా ఎక్కువ ఎత్తు నుంచి స్వచ్ఛమైన నీటి ప్రవాహంతో పరవళ్లు తొక్కుతూ జలపాతం కిందకు దూకుతోంది. కణ్వనది నుంచి స్వచ్ఛమైన నీరు కోన మీదుగా కండలేరుకు చేరుతోంది. అటు పర్యాటకులకు, ఇటు ప్రకృతి ప్రేమికులకు మధురానుభూతిని పంచుతూ.. ఎనలేని ప్రకృతి సౌందర్యాన్ని తనలో నిక్షిప్తం చేసుకుని మళ్లీ రారమ్మని ఆహ్వానిస్తోంది ఈ పెంచల నృసింహుడి క్షేత్రం. అలాగే ప్రముఖ పర్యాటక శైవక్షేత్రం భైరవకోనలోనూ జలపాతం కనువిందు చేస్తోంది. ఈ సుందర దృశ్యాలను చూసేందుకు పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు భారీగా తరలివస్తున్నారు. నీటి ప్రవాహంపై తెల్లటి నురగ.. చుట్టేసిన పొగమంచు చూపరుల మదిని హత్తుకుంటున్నాయి. వాగును తలపించేలా ప్రవహిస్తున్న నీరు శ్రీ త్రిముఖ దుర్గాదేవి అమ్మవారి పాదాలను తాకుతున్నాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు చిన్నాపెద్దా తారతమ్యం లేకుండా జలపాతం వద్ద కేరింతలు కొడుతూ సందడి చేస్తున్నారు.

- రాపూరు/సీతారామపురం (ఆంధ్రజ్యోతి)



సీతారామపురం : భైరవకోనలో జలపాతం



జాతీయ రహదారిపై బైఠాయించిన అయ్యప్ప భక్తులు

సేవ్ కలువాయి!

● తిరుపతిలో కలపొద్దు! ● హైవేపై బైఠాయించిన అయ్యప్ప భక్తులు

కలువాయి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి జిల్లాలో కలపొద్దు.. సేవ్ కలువాయి నినాదాలతో అయ్యప్పభక్తులు శుక్రవారం ఆందోళన చేపట్టారు. వెంకటరెడ్డిపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై స్వాములు బైఠాయించి కలువాయిని నెల్లూరులోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. దీంతో సుమారు అరగంటపాటు వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ నిరసనలో మండలంలోని యువత పాల్గొని వారికి మద్దతు తెలిపారు. ఎస్‌ఐ కోటయ్య ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

● దాచూరులో సంతకాల సేకరణ

మండలంలోని దాచూరు గ్రామంలో జిల్లా మార్పుపై సర్పంచు రాజుల అనురాధ ఆధ్వర్యంలో ప్రజలతో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచు శ్రీనివాసులరెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన, నాయకులు పాల్గొన్నారు.

వెంకటాచలంలో ఇన్‌క్లూజివ్ స్పోర్ట్స్ అకాడమీ

ముత్తుకూరు, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి సంస్థలలో ఒకటైన ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిసెబిలిటీస్‌తో కలిసి ఇన్‌క్లూజివ్ స్పోర్ట్స్ అకాడమీని నిర్మించనున్నారు. ఈ మేరకు శుక్రవారం ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈవో జయమేజయ మహాపాత్ర, ఎన్‌ఐఈపీఐడీ డైరెక్టర్ మేజర్ డాక్టర్ బి.వి.రామ్‌కుమార్ అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సహకారంతో వెంకటాచలంలో ఉన్న కాంపోజిట్ రీజనల్ సెంటర్ ఫర్ స్కిల్ డెవలప్‌మెంట్, రిహాబిలిటేషన్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిసెబిలిటీస్ ప్రాంగణంలో ఇన్‌క్లూజివ్ స్పోర్ట్స్ అకాడమీ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ సీఈవో జనమేజయ మహాపాత్ర మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం ఎస్‌ఈఐఎల్ ఎనర్జీ ఎప్పుడూ కట్టుబడి ఉంటుందన్నారు.

ఈ నెల 21న పల్స్‌పోలియో

నెల్లూరు (వైద్యం) డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 21వ తేదీన పల్స్‌పోలియో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో సుజాత తెలిపారు. శుక్రవారం నగరంలోని తన కార్యాలయంలో గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల వైద్యులతో పల్స్‌పోలియో కార్యక్రమ నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. హైరిస్క్ ఏరియాలలో పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయించాలని డీఎంహెచ్‌వో సూచించారు. అనంతరం లింగ వివక్ష, మెడికో లీగల్ కేర్‌పై కూడా వైద్యులకు శిక్షణ ఇ చ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి ఉమామహేశ్వరి, అదనపు డీఎంహెచ్‌వో ఖాదర్‌వలి, డీపీఎంవో సునీల్ తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు ఉద్యోగాలు ఇవ్వాలి

(5వ పేజీ తరువాయి)

ఏర్పాటుతో ఈ ప్రాంతం మొత్తం కలుషితమై ఊళ్లకు ఊళ్లు ఖాళీ చేయాల్సిన దుస్థితి ఏర్పడుతుందని అన్నారు. భూసేకరణ చేస్తున్న గ్రామాలకు ఆర్‌ఆర్ ప్యాకేజీ అమలుచేసి ఖాళీ చేయించాలని, పునరావాస కాలనీలు నిర్మించాలని విన్నవించారు. ఇప్పటివరకు ఇండోసోల్, రామాయపట్నం పోర్టులలో 10 శాతం కూడా స్థానికులకు ఉద్యోగాలు కల్పించలేదని చాపల రమణయ్య, పోట్లేళ్ల మురళి, పి. శ్రీను, నూతలపాటి శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు.

● బీపీసీఎల్‌తో అభివృద్ధి : కలెక్టర్

ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీపీసీఎల్ రాకతో ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. సుమారు 5 వేల ఎకరాల్లో రూ.1.03 లక్షల కోట్లతో ఈ పరిశ్రమ ఏర్పాటు కాబోతున్నట్లు తెలిపారు. స్థానికులకు ఉపాధి అవకాశాలు దొరుకుతాయని తెలిపారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ తొలుత నైపుణ్య శిక్షణ సంస్థను ఏర్పాటు చేసి, అందులో స్థానిక యువతకు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. భూములు కోల్పోతున్న రైతులకు, రైతు కూలీలకు న్యాయం చేయాలని, అలాగే మత్స్యకార కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ అశోక్ కుమార్, సబ్‌కలెక్టర్ హిమ వంశీ, కావలి రెవిన్యూ డివిజనల్ అధికారి చైతన్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

● ఏడుగురి అరెస్టు, రూ.26 వేల స్వాధీనం

నెల్లూరు(క్రైం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరు నగరంలోని కుక్కలగుంట కృష్ణ మందిరం వీధిలోని ఓ ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై శుక్రవారం రాత్రి పోలీసులు దాడి చేశారు. నగర డీఎస్పీ ఐడీ పార్టీ సిబ్బంది, సంతపేట పోలీసులు సంయుక్తంగా ఈ దాడులు నిర్వహించారు. పేకాట స్థావరం నిర్వాహకుడు సుబ్బారావు, ఆరుగురు జూదరులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.26,100 నగదు, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

వైద్య సేవల తర్వాత

ఆసరా ఏదీ!?

● శస్త్రచికిత్స అయ్యాక మందులు, ఇతర ఖర్చులకు నగదు ఇవ్వని ప్రభుత్వం

● గతేడాది అక్టోబరు నుంచి ఆగిన ఎన్టీఆర్ వైద్య సేవ ఆసరా

● సుమారు రూ. 9 కోట్ల వరకు బకాయిలు

● ఎప్పుడు వస్తాయో తెలియదంటున్న అధికారులు

ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద శస్త్రచికిత్స చేయించుకున్న తర్వాత , ఇంట్లో విశ్రాంతి తీసుకుంటూ వైద్యసేవలు పొందుతున్నవారికి నగదు ప్రోత్సాహం అందటం లేదు. ప్రతినెలా వివిధ వ్యాధులకు ఆరోగ్యశ్రీ కింద రోగులు శస్త్రచికిత్సలు చేయించుకుంటారు. అలాంటి వారికి నెట్‌వర్క్ ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ అయిన 24 గంటల్లో నగదు వారి బ్యాంక్ ఖాతాల్లో పడుతుంది. విశాంత్రి సమయంలో వైద్య చికిత్సలతోపాటు మందులకు, ఇతర ఖర్చులకు నెలకు సుమారు రూ. 5వేల వరకు ఆర్థికసాయం అందుతుంది. అయితే గత ఏడాది ఆక్టోబరు నుంచి ఈ సాయం అందటం లేదు.



నెల్లూరు (వైద్యం), డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ప్రభుత్వం ఆరోగ్య ఆసరా పథకాన్ని అందుబాటులో తీసుకువచ్చింది. ఈ పథకాన్ని 2019 డిసెంబరు 1న అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ఆర్భాటంగా ప్రారంభించారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో శస్త్రచికిత్సలు చేయించుకునే వారికి ఈ పథకం అమలు చేస్తున్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రులకు ఇవ్వాల్సిన బకాయిలు పేరుకుపోయాయి. దీంతో వ్యాధిగ్రస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ తరుణంలో అధికారులు ఏమి చేయలేక చేతులెత్తేస్తున్నారు.

● ఎవరెవరికి ఎంతెంత ?

కాళ్లు, చేతులు విరిగినవారు 3 నెలల ఇంట్లోనే విశ్రాంతి తీసుకోవాలి. వారికి రూ. 15వేల వంతున ఆసరా అందిస్తున్నారు. క్యాన్సర్ రోగులకు మెడికల్ మేనేజ్‌మెంట్ కింద 180 రోజులకు రూ. 30వేలను చెల్లిస్తున్నారు. క్రిటికల్ చర్మవ్యాధుల వారికి ఏడాదికి రూ. 60వేల వంతన అందచేస్తున్నారు. ఈ లెక్కన గతేడాది అక్టోబరు నుంచి రోగులకు రూ. 9 కోట్ల వరకు బకాయిలు చెల్లించాల్సి ఉంది. ప్రతి నెలా 2వేల వరకు ఆరోగ్యశ్రీ కింద శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం మొదటి నాలుగు నెలలు ఆసరా కింద రోగులను ఆదుకుంది. ఆ తర్వాత నుంచి నిధులు విడుదల చేయలేదు.

ఏటా ఆసరా కింద చెల్లిస్తున్న నిధులు

సంవత్సరం	ఆసరా రోగులు	చెల్లింపులు రూ. కోట్లలో
2021-22	33,863	16.94
2022-23	37,286	18.55
2023-24	39,888	20.39
2024-25	18,849	10.31
2025-26	16.500	9.00

ఎప్పుడు వస్తాయో తెలియదు...

జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద చికిత్స చేయంచుకున్న రోగులకు ఆసరా పథకం కింద అందాల్సి నిధులు అందలేదు. ఏడాది కాలంగా బకాయిలు పేరుకుపోయాయి. ఆ నిధులు ఎప్పుడు వస్తాయో తెలియదు. అవి రాక పోవటంతో రోగుల నుంచి ఒత్తిడి ఎక్కువైంది.



- డాక్టర్ సుధీర్‌కుమార్, ఎన్టీఆర్ వైద్య సేవ పథకం జిల్లా కో ఆర్డినేటర్

కదలని గేట్లు.. రైతుల కంగారు !

● మొరాయించిన కండలేరు కాలువ గేట్లు! ● ఆగని నీటి ప్రవాహం... చెరువులపైకి మళ్లింపు

● అధికారులకు టెన్షన్ ● ఇప్పటికే చెరువులు నిండటంతో లబోదిబోమంటున్న రైతులు

కలువాయి. డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎంకి పెళ్లి సుబ్బి చావుకొచ్చిందన్నట్లు... కండలేరు కాలువ గేట్లు కదలకపోవడం కలువాయి రైతులను కంగారు పెడుతోంది. సోమశిల జలాశయం వద్ద కండలేరు కాలువ గేట్లు పూర్తిగా కిందకు దిగకుండా మొరాయించాయి. దీంతో కండలేరు కాలువలోకి సుమారు 4వేల క్యూసెక్కుల ప్రవాహం వస్తుండటంతో శుక్రవారం తెలుగుగంగ అధికారులు ఈ నీటిని కండలేరు జలాశయం చేరకుండా మధ్యలో ఉన్న ఎస్కేప్ (అత్యవసర) చానల్ గేట్లు ఎత్తి కలువాయి, చవటపల్లి చెరువులపైకి మళ్లించారు. ఇప్పటికే ఈ చెరువులు నిండి కలుజు నీరు పొలాలను ముంచెత్తుంతోంది. ఈ సమయంలో మళ్లీ కండలేరు కాలువలోని నీటిని చెరువులపైకి మళ్లిండంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కండలేరు జలాశయంలో నీటి నిల్వ గరిష్ఠ మట్టానికి చేరుకుంది. ఈ నేపథ్యంలో దిత్వా తుఫాను కారణంగా కండలేరు పరివాహక ప్రాంతంలో కురిసిన వర్షాలకు డ్యాంలోకి వరద పోటెత్తింది. దీనికితోడు సోమశిల నుంచి కూడా కండలేరు డ్యాంకు నీటి విడుదల కొనసాగుతుండగా కండలేరు ప్రాజెక్టు వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అధికారులలో టెన్షన్ మొదలైంది. సోమశిల నుంచి కండలేరు కాలువకు నీటిని పూర్తిగా నిలిపివేసేందుకు ప్రయత్నించగా గేట్లు పూర్తి స్థాయిలో కిందకు దిగకపోవడంతో కాలువలోకి ప్రవాహం కొనసాగుతోంది. ఈ నీరు కండలేరుకు చేరితే అక్కడ ఇబ్బంది అవుతుందని అధికారులు రెండు ఎస్కేప్ గేట్లు తెరచి చెరువులపైకి మళ్లించారు. 18.4 కిలోమీటరు వద్ద ఉన్న ఎస్కేప్ గేట్లు ఎత్తి కలువాయి చెరువుకు అధికారులు నీటి మళ్లిస్తున్నట్లు సమాచారం అందుకుని కలువాయి రైతులు అక్కడికి చేరుకున్నారు. తెలుగుగంగ అధికారులకు వారి పరిస్థితిని వివరించి చెరువు పైకి నీరు మళ్లించద్దొని వేడుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్నాతాధికారుల ఆదేశాల మేరకు నీరు మళ్లించాల్సి వస్తోందని అధికారులు రైతులకు వివరించారు.



ఎస్కేప్ గేట్లు ఎత్తి నీటిని కలువాయి చెరువుకు మళ్లిస్తున్న తెలుగుగంగ అధికారులు



కలువాయి చెరువుపైకి నీటిని మళ్లించవద్దని అధికారులను కోరుతున్న రైతులు

రాజుపాలెం హైస్కూలుకు 15లక్షల విరాళం

● ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కొడవలూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : రాజుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు రూ.15లక్షల విరాళం అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి ప్రకటించారు. శుక్రవారం రాజుపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ ఆత్మీయ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఒకే వేదికపై తీసుకొచ్చేలా కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌లకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు. పాఠశాల ఆవరణలోని గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించిన అనంతరం ఆమె తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. చిన్నారులు రూపొందించిన కళాకృతులను పరిశీలించారు. సాంస్కృతిక ప్రదర్శనలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ రాజుపాలెం హైస్కూల్‌లో అత్యవసర మౌలిక సదుపాయాల కల్పనకు వీపీఆర్ ఫౌండేషన్ ద్వారా రూ.15 లక్షల విరాళాన్ని ప్రకటించారు. పిల్లలను బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులదే కీలక పాత్ర అన్నారు. అధికారులతో మాట్లాడి స్లాబ్ లీకేజీలను అరికట్టడంలోపాటు అదనపు గదుల నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు స్ఫూర్తిరెడ్డి, ఎంపీడీవో సుబ్బారావు, హైస్కూల్ హెడ్‌మాస్టర్ ఓబులేసు, ఎంఈవో -1 ప్రసన్నకుమారి, ఎంఈవో-2 అంకయ్య, నాయకులు మందిపాటి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, తువ్వర ప్రవీణ్, నాసిన ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బియ్యం భోక్తులపై మౌనమేల...!

● రోజులు గడుస్తున్నా చర్యలు శూన్యం

ఉదయగిరి, డిసెంబరు 5(ఆంధ్రజ్యోతి): పౌర సరఫరాల శాఖ గోదాములో బియ్యాన్ని స్వాహా చేసిన వారి విషయంలో ఉన్నతాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రోజులు గడుస్తున్నా చర్యలు తీసుకోకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆన్‌లైన్‌లో ఉన్న నిల్వలకు, ఉదయగిరి పౌరసరఫరాల గోదాములో ఉన్న నిల్వలకు భారీ వ్యత్యాసం ఉండడంతో గతనెల 21వ తేదీన జిల్లా అధికారులు గోదాముకు చేరుకుని రికార్డులు పరిశీలించారు. 4,000 బస్తాల బియ్యం స్వాహాకు గురైనట్లు గుర్తించి గోదామును సీజ్ చేశారు. పరిశీలనలో గుర్తించిన అంశాలతో రాష్ట్ర కార్యాలయానికి నివేదిక అందజేశారు. అనంతరం ఉదయగిరి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, శాఖా పరమైన విచారణ నివేదిక లేకుండా తాము కేసు తీసుకోలేమని, పూర్తిగా విచారణ జరిపి ఎప్పటి నుంచి బియ్యం స్వాహాకు గురయ్యాయి, ఎవరిపై అనుమానులున్నాయో స్పష్టమైన నివేదిక ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. ఈ క్రమంలో గతనెల 26న విజయవాడ పౌరసరఫరాల ప్రధాన కార్యాలయ అధికారుల బృందం ఉదయగిరి గోదాముకు, అక్కడి రికార్డులను పరిశీలించింది. సెప్టెంబరు, అక్టోబరు మాసాల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించేసరికి చీకటి పడడం, అక్కడ విద్యుత్ సౌకర్యం సక్రమంగా లేకపోవడంతో నవంబరు మాసం రికార్డులు విజయవాడ తీసుకెళ్లింది. అప్పట్లో అధికారుల బృందాన్ని పలకరించగా గోదాములో 4,000 వేల బస్తాల బియ్యం స్వాహాకు గురైన మాట వాస్తవమేనని, నవంబరు మాసం రికార్డులు సైతం పరిశీలించి పూర్తిస్థాయి నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని, రెండు రోజుల్లో చర్యలుంటాయని తెలిపారు. అయితే రోజులు గడుస్తున్నా ఈ కుంభకోణంలో సూత్రధారులెవరో.. పాత్రధారులెవరో తేల్చకపోవడం, ఏలాంటి చర్యలు చేపట్టకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బియ్యం భోక్తలెవరో తేలుస్తారో... లేక ఇలాగే నాన్చుతూ ఆపై అటకెక్కిస్తారో చూడాలి.



ఉదయగిరిలోని పౌరసరఫరాల శాఖ గోదాములో నిల్వలను పరిశీలిస్తున్న అధికారుల బృందం(ఫైల్)